ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్
: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 164 పేజీలు: 10+4 వెల: 6.50

**పబ్‌లో అగ్నిప్రమాదం: 27 మంది మృతి**

**ఇరాన్ హిట్‌లిస్ట్‌లో 13 మంది విదేశీ నేతలు**

5



సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

## నరహంతకుడు రాజ్‌కుమార్
# ఆత్మహత్య

### కొత్తూరు మండలం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహం కనుగొన్న పోలీసులు
### పక్కనే దొరికిన పాయిజన్ బాటిల్
### సంఘటన స్థలంలో విచారణ జరిపిన క్లూస్ టీం
### గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు: పోలీసులు
### రాజ్‌కుమార్ మాట్లాడిన ఓ విడియోను మీడియా ఎదుట ప్రదర్శించిన పోలీసులు

**షాద్‌నగర్ /షాబాద్ / చెవేళ్ల, జులై13, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా కలకలంసృష్టించిన రంగా రెడ్డి జిల్లా షాబాద్ "ఆరు హత్యల" కేసు నిందితుడు రాజ్ కుమార్ ఎట్టకేలకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పెంజెర్ల గ్రామంలో రాజ్ కుమార్ మృతదేహం పోలీసులకు లభ్యమైంది. రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారమందించారు. స్థానికులు రాజ్‌కుమార్ మృతదేహం దగ్గర క్రిమి సంహారక మందు (పాయిజన్) బాటిల్‌ను గుర్తించారు. రాజ్ కుమార్ మేనమామ ఊరిలో రాజ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షాబాద్‌లో రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురుని నరహంతకుడు రాజ్‌కుమార్ వరుసగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. ఈ మారణహోమాన్ని సృష్టించిన రాజ్ కుమార్ ఆచూకీ కోసం పోలీసులు 14 బృందాలుగా విడిపోయి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు >>2



మృతుడు రాజ్‌కుమార్ (ఫైల్)

### నా డబ్బంతా తిని మోసం చేశారు.. అందుకే చంపేశా!
**-విడియోలో రాజ్‌కుమార్**

**షాద్‌నగర్ /షాబాద్ / చెవేళ్ల, జులై13, ప్రభాతవార్త:** ఆ కుటుంబం తనను మోసం చేసిందని వారి కోసం ఎంతో డబ్బు ఖర్చు చేశానని అయినా తనపై పోక్సో కేసు పెట్టారని వీడియోలో మృతుడు రాజ్ కుమార్ చెప్పడం గమనార్హం. ఆ అమ్మాయిని నమ్మి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసినట్లు వీడియోలో పేర్కొన్నారు. అమ్మాయి కుటుంబానికి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసి అప్పుల పాలయ్యానని >>2

### 2 కోట్లు అప్పుచేసి పెడదారి పట్టాడు..
2

**అతని వద్ద 16 సిమ్‌లు: ఫ్యూచర్ సిటీ కమిషనర్**

## 20 నుంచి భారీ వర్షాలు
**బంగాళాఖాతంలో 10 వేల కి.మీ మేర విస్తరించిన మేఘాలు**



**న్యూఢిల్లీ,జులై 13:** దేశంలోని పలు రాష్ట్రాల్లో గత కొన్ని రోజులుగా నైరుతి రుతుపవనాలు బలహీనపడటంతో వర్షపాతం తగ్గింది. అయితే, తాజాగా ఏర్పడిన భారీ వాతావరణ వ్యవస్థ మరోసారి ఆశలు రేకెత్తిస్తోంది. బంగాళాఖాతం నుంచి మధ్య పసిఫిక్ మహాసముద్రం వరకు సుమారు 7వేల నుంచి 10వేల కిలోమీటర్ల పొడవున విస్తరించిన ఇంటర్ ట్రాపికల్ కన్వర్జెన్స్ జోన్-ఐటిసిజడ్ భారత వాతావరణంపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. >>7

# మనమంతా కలిసి పనిచేద్దాం



సోమవారం అన్ని పార్టీల ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి

### రాజకీయాలకు అతీతంగా ముందుకు
### ప్రాజెక్టులు, రవాణా అనుమతులు సాధించాలి
### అవసరమైన పూర్తి సమాచారం అందజేస్తాం
### పిఎం, కేంద్రమంత్రులకు విజ్ఞప్తులు చేయండి
### అన్నిపార్టీల ఎంపీల సమావేశంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై13:** తెలంగాణ రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఈ విషయంలో కలిసి ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం కోరారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఎంపీలకు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ జనాభాలో 10 శాతం జనా భా ఆరు మహా నగరాల్లో ఉందని, అయితే ఈ నగరాలు 25 శాతం జీడీపీ కలిగి ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరమని.. ఎంపీలు ఈ విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఐఐఎం మంజూరుకు విజ్ఞప్తి చేయాలని సీఎం సూచించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, మెట్రో ఫేజ్-2 విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చల సరళిని సీఎం ఎంపీలకు వివరించారు. ఇందుకు సంబంధించి ఎస్‌బిఐ క్యాప్స్‌ని కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని ఎంపీలకు సీఎం సూచించారు. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో 95 శాతం భూ సేకరణ పూర్తయిందని.. ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపాల్సి ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. మూసీ పునరుజ్జీవనం పనుల్లో మొదటి దశ టెండర్ల దశకు వచ్చిందని సీఎం తెలిపారు. ఈ పనులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్రం అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఎంపీలు ఈ విషయంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని సూచించారు.

అంతరాష్ట్ర నదీ జలాల విషయమై ఇటీవల కర్ణాటకలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులతో చర్చించిన అంశాలను సీఎం ఎంపీలకు వివరించారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావల్సి ఉన్నా పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. డ్యామ్‌తో పాటు కాలువల్లో పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటక సహకరించేలా ఒప్పించాలని సీఆర్ పాటిల్‌ను కోరామని, ఈ విషయంపైనా ఎంపీలు కేంద్ర మంత్రిని కలవాలని సీఎం సూచించారు. నదుల అనుసంధానంలో గోదావరి నుంచి నాగార్జునసాగర్‌కు నీళ్ల తీసుకునే విషయంలో ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుందని సీఎం తెలిపారు. గోదావరిలో ఛత్తీస్‌గఢ్‌కు 300 టీఎంసీల వాటా ఉందని, వాటిని >>2



కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం వద్ద కెటిఆర్, జీవన్‌రెడ్డి తదితరులు

## శిఖండి రిపోర్టుతో రాష్ట్రానికి నష్టం
**నీళ్లు ఎత్తిపోయండి: కెటిఆర్**

**కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:** మేడిగడ్డ బ్యారేజీ వద్ద రోజుకు లక్ష క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఎత్తిపోతలను చేపట్టకపోవడంపై మాజీ మంత్రి కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కరీంనగర్ లోయర్ మానేరు డ్యాంలో నీటి మట్టాన్నీ పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద నీటి ప్రవాహం97 మీటర్లు ఉన్నా, మోటార్లు ఆన్ చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నీరు లేక వెలవెలబోతున్నాయని అన్నారు. ఎన్డీఎస్‌ఏ ఇచ్చిన రిపోర్టును ఖశిఖండి రిపోర్టుఖగా అభివర్ణించిన కేటీఆర్, సరైన పరీక్షలు లేకుండానే రాజకీయ దురుద్దేశంతో ఈ నివేదిక ఇచ్చారని విమర్శించారు.

# హుటాహుటిన దేవాదుల

### రూ.194 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల
### 22 రిజర్వాయర్లు పూర్తిగా నింపుతాం
### 38.16 టిఎంసిల సామర్థ్యం పూర్తిగా వినియోగిస్తాం
### మంత్రులు ఉత్తమ్, పొంగులేటితో కలిసి దేవాదుల పనులను పరిశీలించిన డి.సిఎం భట్టి



సోమవారం దేవాదులను పరిశీలిస్తున్న డి.సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్

**ములుగు జిల్లా బ్యూరో, ప్రభాతవార్త, జులై13:** దేవాదుల ఎత్తిపోతల పథకానికి నిధుల కొరత లేకుండా అన్ని పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రాజెక్టును పూర్తి సామర్థంతో అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక-ప్రణాళిక-విద్యుత్ శాఖల మంత్రి మల్లు బట్టి విక్రమార్క ప్రకటించారు. 38.16 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తూ 22రిజర్వాయర్లను నింపి దేవాదుల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ, జే.చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు ను సోమవారం రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ, హౌసింగ్, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి పెండింగ్ పనులు, పంపింగ్ వ్యవస్థ, భూసేకరణ, నీటి నిల్వలు, సాగునీటి ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశాలను ప్రభుత్వం ముందుగానే అంచనా వేసిందని బట్టి విక్రమార్క తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గోదావరి జలాలను >>2



సోమవారం హైదరాబాద్ ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

## ఎల్‌నినోను ఎదుర్కొందాం

### రైతుకు నష్టం రాకుండా మూడు దశల ముందస్తు కార్యాచరణ
### ఇక్రిశాట్ శాస్త్రవేత్తలతో సమీక్ష జరిపిన మంత్రి తుమ్మల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** వానాకాలం-2026లో ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్నిరకాల ముందస్తు చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఇక్రిశాట్‌లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను ఈ >>2



## 21న స్పెషల్ టెట్ నోటిఫికేషన్

### ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేకం
### సెప్టెంబరు 7 నుంచి 11 వరకు పరీక్షలు
### పాఠశాల విద్యా శాఖ డైరక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 13:** రాష్ట్రంలోని ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేకంగా టెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 21న జారీ చేయనున్నట్టు పాఠశాల విద్య శాఖ డైరక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. వారికి సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)- జూన్- 2026 >>2

### శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రపంచంలో టాప్-4

6



### 21 నుండి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

3



# అమెరికా సెంట్‌కామ్ దాడులు

### ఇరాన్‌సైతం గల్ఫ్‌లోని అమెరికా బేస్‌లపై ప్రతిదాడులు
### హార్ముజ్ నౌకలపై దాడితో మళ్లీ పర్షియన్‌గల్ఫ్ ఉద్రిక్తం

**టెహ్రాన్,వాషింగ్టన్,జులై 13:** హార్మూజ్ జలసంధి సమీపంలో అమెరికా జరిపిన తాజా వైమానిక దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలపై భారీ క్షిపణి, డ్రోన్ దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఘర్షణల తర్వాత ఇదే తమ అతిపెద్ద ప్రతీకార ఆపరేషన్ అని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వెల్లడించింది. అమెరికా దాడుల్లో బందర్ అబ్బాస్, ఖెష్మ్ ద్వీపం పరిసరాల్లోని క్షిపణి, వైమానిక రక్షణ వ్యవస్థలు లక్ష్యంగా మారినట్లు సమాచారం. కువైట్, ఖతార్, బహ్రెయిన్, ఒమన్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై తాము దాడులు నిర్వహించినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. కువైట్‌లో అమెరికా పేట్రియాట్ క్షిపణి వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, ఆయుధ నిల్వలను డ్రోన్లతో ధ్వంసం చేశామని తెలిపింది. ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో అమెరికా నౌకాదళానికి చెందిన సదుపాయాలు, బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ఎయిర్‌బేస్, ఖతార్‌లోని అల్ ఉదైద్ ఎయిర్‌బేస్‌పై కూడా దాడులు చేసినట్లు పేర్కొంది. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకారం, యుద్ధ విమానాలు, నౌకలు, డ్రోన్లతో ఇరాన్‌లోని డజన్ల కొద్దీ లక్ష్యాలపై దాడులు నిర్వహించారు. వైమానిక రక్షణ వ్యవస్థలు, తీర ప్రాంత రాడార్లు, క్షిపణి, డ్రోన్ మౌలిక సదుపాయాలు, చిన్న యుద్ధ నౌకలను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. హార్మూజ్ జలసంధిలో పౌర నౌకాయానానికి ముప్పు తగ్గించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు సెంట్‌కామ్ తెలిపింది. హోర్ముజ్ జలసంధిలో పౌర, వాణిజ్య నౌకలకు ముప్పుగా మారిన ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపరచడమే ఈ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశమని అమెరికా వెల్లడించింది.



జార్ఖండ్‌లోని ఖుంటి జిల్లా సవమరంగ్‌బేడ గ్రామంలో ఓ గర్భిణిని వరద నీటితో నిండిన నదిని దాటించి ఆసుపత్రికి తీసుకువెళ్తున్న ప్రజలు

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

## పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై13:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం రాత్రి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన కీలక ప్రాజెక్టుల పర్మిషన్లు, నిధుల సాధనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చించేందుకు ఈ పర్యటన పెట్టుకున్నారు. ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, మనోహర్‌లాల్ ఖట్టర్, నితిన్ గడ్కరీలను కలవనున్నారు. ఇదే సమయంలో గోదావరి, కృష్ణా బేసిన్ల లోని పెండింగ్ ప్రాజెక్టుల క్లియరెన్స్లు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అంతరాష్ట్ర జల వివాదాలపై కేంద్ర పెద్దలతో సీఎం ప్రత్యేకంగా భేటీ కానున్నారు. అదేవిధంగా హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశ విస్తరణ అంశంపై కూడా సీఎం స్పెషల్ ఫోకస్ పెట్టరు. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పెద్దలను కలిసి మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన కేంద్ర వాటా నిధులు, అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరనున్నారు. ముఖ్యంగా శంషాబాద్ ఎయిర్పోర్ట్ కనెక్టివిటీ, ఫ్యూచర్ సిటీ మెట్రో లైన్ల ప్రతిపాదనలను కేంద్రం ముందు పెట్టనున్నారు.కాగా, సీఎం రేవంత్ రెడ్డి పర్యటన రాజకీయ ప్రాధాన్యత కూడా సంతరించుకుంది. పెండింగ్‌లో ఉన్న పలు కార్పొరేషన్ల నామినేటెడ్ పదవుల భర్తీపై సీఎం, ఏఐసీసీ అగ్రనేతలతో చర్చించే అవకాశంఉంది. పార్టీకోసం కష్టపడిన సీనియర్లు, ఇతర ముఖ్య నేతలకు పదవుల కేటాయింపునకు సంబంధించిన తుది జాబితాను అధిష్టానానికి అందజేయబోతున్నట్లుగా సమాచారం.

# స్పెషల్ టెట్ నోటిఫికేషన్

>> పరీక్షల్లో 43.94 శాతం మంది అర్హత సాధించినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను డైరెక్టర్ సోమవారం పాఠశాల విద్య డైక్టరేట్‌లో టెట్-2026 కన్వీనర్ జి రమేష్‌తో కలిసి విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్-జూన్- 2026 పరీక్షలను జూన్ 16 నుంచి 22 వరకు నిర్వహించారు. పరీక్షలకు 1,53,752 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,15,028 మంది హాజరయ్యారు. అందులో 50,544 మంది అర్హత సాధించినట్టు తెలిపారు. టెట్‌కి రాష్ట్ర వ్యాప్తంగా 1,53,752 దరఖాస్తులు రాగా వాటిలో పేపర్-1కి 50,113 మంది దరఖాస్తు చేయగా వారిలో 36,129 మంది హాజరయ్యారు. అందులో 23,590 మంది(65.29శాతం) అర్హత సాధించారు. పేపర్-2లో గణితం అండ్ సైన్స్‌కి 58,675 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 44,128 మంది పరీక్షకు హాజరుకాగా అందులో 17,987 మంది(40.76శాతం) అర్హత సాధించారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌కి 44,964 మంది దరఖాస్తు చేసుకుంటే వారిలో 34,771 మంది పరీక్షకు హాజరు కాగా అందులో 8967 మంది(25.79 శాతం) అర్హత సాధించారు. జూన్‌లో జరిగిన టెట్ పరీక్షలకు 23,623 మంది ఇన్ సర్వీస్ టీచర్లు పరీక్షకు హాజరు కాగా వారిలో 8809 మంది (37.29శాతం) అర్హత సాధించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతోపాటు తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్, సంక్షేమ శాఖల అధ్వర్యంలో కొనసాగుతున్న గురుకులాలు, తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో కొనసాగుతున్న ఇన్ సర్వీస్ టీచర్లకు ఈ నెల 21న స్పెషల్ టెట్ నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్టు నవీన్ నికోలస్ తెలిపారు. వారికి సీబీటీ విధానంలో సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో టెట్ క్వాలిఫై కానీ వారు ఇంకా సుమారు 20వేల మంది వరకు టీచర్లు ఉంటారని తెలిపారు. రాష్ట్రంలోని కేజీబీవీల్లో 20వేల మందికి ఒక జత యూనిఫామ్‌ను శుక్రవారం అందజేయనున్నట్టు తెలిపారు.

# మనమంతా కలిసి పనిచేద్దాం

>> ఛత్తీస్‌గఢ్ వాడుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయన్నారు. అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందన్నారు. గోదావరి నుంచి ఏపీ ప్రాంతం మీదుగా తమిళనాడు, కర్ణాటక, కేరళకు నీరు తీసుకెళ్లే గోదావరి-కావేరి అనుసంధానం ఉందన్నారు. ఈ విషయంలో ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. ఇక్కడ నీళ్ల ఛత్తీస్‌గఢ్‌వి అయితే నిధులు కేంద్రానివని... ఆ రెండింటిని తెలంగాణకు అనుకూలంగా సాధించాలని సీఎం అన్నారు. తెలిపారు. ఈ విషయంపైనా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ ముఖ్యమంత్రి చర్చించామన్నారు. వారు సూత్రప్రాయంగా అంగీకరించారని, ఎన్‌వోసీలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని సీఎం అన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150-151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలతో సీఎం అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్ రైళ్లకు సంబంధించి ఎలైన్‌మెంట్లు కొలిక్కివచ్చాయని సీఎం తెలిపారు. ఆదిలాబాద్ ఢిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామని సీఎం తెలిపారుపార్టీలకు అతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందించడానికి ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కోఆర్డినేషన్‌కు ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను నియమించామని సీఎం చెప్పారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఎంపీలు ఆయన దగ్గర నుంచి తీసుకోవచ్చని సూచించారు. పార్టీలతో సంబంధం లేకుండా ఎంపీలు అడిగే సమాచారం వేగంగా వారికి అందజేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఎంపీల కన్వీనర్ డాక్టర్ మల్లు రవికి సీఎం సూచించారు. సమావేశంలో ఎంపీలు అడిగిన ప్రతి సమాచారం అందజేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా తాము కేంద్ర ప్రభుత్వంతో సహకార ధోరణితోనే ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన వివిధ అంశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి గతంలో పంపిన లేఖలు, ప్రస్తుత స్థితిని తెలియజేస్తూ లేఖలు సిద్ధం చేసి పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీలకు అందుబాటులో ఉంచాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఎంపీలు మల్లు రవి, ఈటల రాజేందర్, కడియం కావ్య, రామసహాయం రఘురామిరెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చామల కిరణ్ కిమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి బిఆర్ఎస్ ఎంపీలు గైర్హాజరయ్యారు.

## మైనర్‌డ్రైవింగ్ ప్రోత్సహించిన

# ఎస్ఐ సస్పెన్షన్

**హైదరాబాద్,జులై 13:** రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించి, మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహించిన వ్యవహారంలో ఎస్సై పూజారి తిరుపతిపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుతం వీఆర్ లో ఉన్న ఆయనను తక్షణమే సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనర్, సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎదురొందాం

>> సమావేశంలో సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు.
ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్‌నినో పరిస్థితులను తట్టుకునేవిధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు, రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధరంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు.
తరువాత వ్యవసాయశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం, మధ్యలో దీర్ఘకాలిక పొడి పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. తరువాత ఇరిగేషన్ శాఖ , భూగర్భజలశాఖ, మిగతాశాఖల అధికారులు మాట్లాడుతూ నీటిలభ్యత వివరాలు విద్యుత్ సరఫరాకు సంబంధించిన రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం రోజువారీగా సమీక్షించాలని మంత్రి తెలిపారు. ప్రస్తుత నివేదిక ప్రకారం 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 20 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉందన్నారు. వర్షాభావ జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాల్సిందిగా సూచించారు.

## వారం - వర్జ్యం

14-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
● అమావాస్య మ.3.16
పునర్వసు రా.12.11
వర్జ్యం : మ.1.31-మ.2.57
దు.ఉ.8.18-ఉ.9.10
2) రా.11.57-రా.12.49
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఇంటా బయటా మీదేపై చేయిగా వుంటుంది.

**వృషభం:** ఇంటా బయట సమస్యలు ఎదురై అధిగమిస్తారు. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:**ఎవ్వరినీ నమ్మకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగినది. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**కర్కాటకం:** హితులు, శ్రేయోభిలాషులు, పెద్దలను కలుసుకొని చర్చలు సాగిస్తారు. ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**సింహం:** ఆరాధనలు, యాత్రలు సంభవము. విధినిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కన్య :** దైవానుగ్రహాన్ని ఎంతగానో నమ్ముకుంటారు. స్థిరాస్తుల కొనుగోలును వాయిదా వేయడం మంచిది.

**తుల :** విదేశీ వస్తువుల ఆకర్షణ నుండి బయట పడుటకు జాగ్రత్త వహించండి. ఆర్థికంగా మెరుగు పడతారు.

**వృశ్చికం:** స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్తలు పాటించండి. ఒక్కసారిగా అనేక అవకాశాలు మీ ముందుకు వస్తాయి.

**ధనుస్సు:** పెట్టుబడుల విషయంలో మెలకువతో వ్యవహరించండి. ఇంటర్వ్యూలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులకు దూరంగా ఉండండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది. వస్త్రలాభం.

**కుంభం:** ప్రజలతో సంబంధాలు మెరుగు పరుచుకోవడానికి అవిరళ కృషి చేస్తారు. స్వల్ప ధనలాభం కలదు.

**మీనం :** హొమియోపతి వైద్యం పట్ల మక్కువ చూపుతారు. రుచికరమైన ఆహారాన్ని స్వీకరించాలని మనస్సు కోరుకుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హుటాహుటిన దేవాదుల

>> గరిష్ఠంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వ్యయం ఎంత పెరిగినా రైతుల ప్రయోజనాల కోసం వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం 10 పంపుల్లో 7 పనిచేస్తున్నాయని, మిగిలిన పంపులను ఒకటి రెండు రోజుల్లోనే అందుబాటులోకి తీసుకురావాలని చీఫ్ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. కాగా ప్రాజెక్టుకు సంబంధించిన రూ.194 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. భూసేకరణకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం సమకూరుస్తుందని, ఆ కారణంగా ఎక్కడా పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 38.16 టీఎంసీలని పేర్కొన్న మంత్రి, ఆ మేరకు నీటిని ఎత్తిపోసి కొత్త ఆయకట్టుతో పాటు స్థిరీకరణ ఆయకట్టుకు కూడా సాగునీరు అందించేలా పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. సాంకేతిక లేదా పరిపాలనా పరమైన అడ్డంకులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

**అత్యధిక పంటల సాగు ప్రజా ప్రభుత్వ హయాంలోనే**

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గోదావరి జలాలను సమర్థంగా వినియోగించడం వల్ల రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక వ్యవసాయ విస్తీర్ణంలో సాగు జరిగిందని బట్టి విక్రమార్క పేర్కొన్నారు. యాసంగి సీజన్‌లో 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు వేల కోట్ల రూపాయల చెల్లింపులు చేసినట్లు తెలిపారు.

**దేవాదుల పూర్తి చేయడమే ప్రభుత్వ సంకల్పం**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశముందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు.

**రైతుల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్నందుకు ప్రజా ప్రభుత్వానికి ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, పంపుల నిర్వహణ సంస్థలు సమన్వయంతో పనిచేస్తేనే రైతులకు నిరంతరాయంగా సాగునీరు అందుతుందని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, పాలకుర్తిఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




రాజ్‌కుమార్ ఆత్మహత్యపై సోమవారం ఘటనాస్థలంలో వివరాలు వెల్లడించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్

# నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య!

>> నిందితుడిని పట్టిస్తే రెండు లక్షల రూపాయల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. పోక్సో కేసులో బెయిల్ పొంది యథేచ్ఛగా తిరుగుతున్న రాజ్‌కుమార్ పగబట్టి చేసిన ఈ ఘాతుకం కలకలం రేపింది. రెండు గంటల్లో ఏకంగా ఆరుగురిని హతమార్చడం రాజధాని శివారులోని షాబాద్‌ను కుదిపేసింది. కేసు పెట్టిన బాధిత బాలిక కుటుంబాన్ని, ప్రశ్నించిన తన కుటుంబాన్ని సైతం ఆ ఉన్మాది గొంతులు కోసి హతమార్చడం రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసింది.

**స్థానికుల సమాచారంతో..**

పెంజర్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కొత్తూరు పోలీసులకు 100 డయల్ ద్వారా సమాచారం స్థానికులు అందజేశారు. దీంతో పోలీసుల రంగ ప్రవేశం చేశారు. గ్రామంలో సిల్వర్ చైన్ రియల్ వెంచర్ పక్కన కల్వకోలు పెంటయ్య రాజులకు సంబంధించిన భూమిలో ఓ గోడ పక్కన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు రాత్ కుమార్ పాల్పడినట్లు పోలీసులు కనుగొన్నారు. అతని వద్ద ఓ సెల్ఫోన్ గడ్డి మందు బాటిల్ ను కనుగొన్నట్లు ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం హుటాహుటిన చేరుకోవడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సెల్ఫోన్లో షాబాద్ హత్యలకు ముందు రోజు వీడియోను చిత్రీకరించాడు. ఆ యొక్క దృశ్యాలను అతను మాట్లాడిన వైనాన్ని స్థానిక మీడియా ముందు పోలీసులు ప్రదర్శించారు. స్థానిక పోలీసులు దర్యాప్తు జరిపిన అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు మీడియాకు తెలిపారు.

**రాజ్ కుమార్ ఆత్మహత్యతో సంచలనం..**

షాబాద్ ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కుమార్ నియోజకవర్గం లోని కొత్తూరు మండలంలో ఆత్మహత్యకు పాల్పడడంతో ఈ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రాజ్ కుమార్ ఈ ప్రాంతంలో నిన్ననే కనిపించినట్టు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పగా ఎవరు నమ్మలేదు. అయితే మృతుడి అమ్మమ్మ స్వగ్రామం మండలంలోని పెంజర్ల గ్రామం కావడంతో అతను ఈ ప్రాంతంలోనే గత రెండు మూడు రోజులుగా తల దాచుకున్నట్లు తెలుస్తోంది. సోమవారం మధ్యాహ్నం రాజ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగు చూడడంతో సంచలనం రేకెత్తించింది. పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తో పాటు డిసిపి శిరీష రాఘవేంద్ర, ఏసిపి లక్ష్మీ ్మనారాయణ, జిల్లాకు చెందిన మరికొంతమంది పోలీసు ఉన్నతాధికారులు ఈ ప్రాంతానికి హుటాహుటిన చేరుకున్నారు. పెంజర్ల గ్రామంలో మృతుడు రాజ్ కుమార్ మేనమామలు మాజీ ఉపసర్పంచ్ లుంగారి లక్ష్మయ్య, గోపాల్, జగన్ లు ఉన్నారు. అయితే ఈ సంఘటన నేపథ్యంలో అతను తన మేనమామల కోసం ఈ గ్రామానికి వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో పోక్సో కేసు అయినప్పుడు అతను ఇక్కడే తలదాచుకున్నట్లు కూడా తెలుస్తుంది. రాజ్ కుమార్ మృతదేహం గ్రామాల్లో లభ్యం కావడంతో గ్రామస్తులు కూడా భయాందోళనకు గురయ్యారు.

**సోదరుడు శవం వద్ద కన్నీరు మునిరగా విలపించిన సోదరుడు భాస్కర్**

వాడిని ఎన్‌కౌంటర్ చేసి చంపేయాల్సింది.. ఇలా ప్రశాంతంగా చనిపోయే అవకాశం ఎందుకు ఇచ్చారు? అంటూ షాబాద్ ఆరు హత్యల కేసులో హంతకుడు రాజ్‌కుమార్ సోదరుడు ఆవేదన వ్యక్తం చేశాడు.సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ షాబాద్‌కు చెందిన రాజ్ కుమార్ సోదరుడు భాస్కర్ సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరు పెట్టుకున్నాడు. చిన్నపిల్లలు కూడా ఏం తప్పు చేశారని చంపేశావురా అంటూ తన ఆవేదన వెలిబుచ్చారు.
ఆ ఇద్దరు చిన్నారులను నేనైనా చూసుకునేవాడిని కదా.." అంటూ తన సోదరుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యాడు. ఇలాంటి వాడిని ప్రశాంతంగా చనిపోయేందుకు పోలీసులు ఎందుకు అవకాశం ఇచ్చారని ఎన్‌కౌంటర్ చేసి చంపాల్సింది అంటూ పోలీసులపై కూడా ఆక్రోశం వెళ్లగక్కాడు. ఈ సమయంలో అతని పోలీసులు తదితర బంధువులు పట్టుకున్నారు.

# హార్ముజ్ జలసంధిని మేమే నిర్వహిస్తాం

## 20% రుసుం వసూలు: ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,జులై 13:** హార్ముజ్ జలసంధి గుండా రవాణా అయ్యే అన్ని సరుకులపై 20 శాతం రుసుము వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రకటించారు. ప్రపంచంలోని అత్యంత కీలక సముద్ర వాణిజ్య మార్గమైన హార్ముజ్ జలసంధికి భద్రత కల్పించే బాధ్యతను అమెరికా చేపడుతోందని, అందుకు అయ్యే ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ రుసుము వసూలు చేయనున్నట్లు తెలిపారు. ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో చేసిన పోస్టులో, ఇప్పటి నుంచి అమెరికాను హోర్ముజ్ జలసంధి సంరక్షకుడుగా పిలుస్తారు. ప్రపంచంలో అత్యంత ఉద్రిక్తతలు నెలకొన్న ఈ సముద్ర మార్గానికి భద్రత కల్పించేందుకు అయ్యే అన్ని ఖర్చులకు న్యాయం దృష్ట్యా, ఈ జలసంధి గుండా రవాణా అయ్యే ప్రతి సరుకుపై 20 శాతం చొప్పున రుసుము వసూలు చేస్తాం. దీనికి సంబంధించిన ప్రక్రియను వెంటనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా సముద్ర దిగ్బంధనాన్ని మళ్లీ అమల్లోకి తీసుకువస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ దిగ్బంధనం వల్ల ఇరాన్‌కు చెందిన నౌకలు లేదా ఇరాన్ వినియోగదారుల నౌకలు మాత్రమే రాకపోకలు సాగించలేవని, మిగిలిన అన్ని దేశాలకు మాత్రం జలసంధి వినియోగంపై ఎలాంటి ఆంక్షలు ఉండవని స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధిని మేమే నిర్వహిస్తాం. దానికి సంరక్షకులుగా వ్యవహరిస్తాం. అవసరమైతే గార్డియన్ ఏంజెల్ ఆఫ్ ది స్ట్రైట్ అని కూడా పిలవొచ్చు. ప్రపంచానికి ఇంత కీలకమైన సముద్ర మార్గాన్ని రక్షిస్తున్నందుకు అమెరికాకు తగిన పరిహారం చెల్లించాలి" అని ఆయన అన్నారు.

# రెండుకోట్లు అప్పుచేసి పెడదారి పట్టాడు..

## నిందితుని వద్ద 16 సిమ్‌లు: ఫ్యూచర్ సిటీ కమిషనర్

**షాద్‌నగర్ /షాబాద్ / చేవెళ్ల, జులై13, ప్రభాతవార్త:** బెట్టింగ్‌లతో అప్పుల పాలయ్యాడు.. మత్తు పదార్థాలకు బానిస అయ్యాడు.. మానసిక స్థితికి దూరమయ్యాడు.. ఆన్లైన్ బెట్టింగుల పేరుతో రెండు కోట్ల అప్పులు చేశాడు.. అమ్మాయి కుటుంబం వల్ల మోసపోయానని భావించాడు అందుకే తన వారు, పరవారు అనే తేడా లేకుండా హత్యలకు తెగించాడు.. తనను పోలీసులు పట్టుకుంటారనే భయంతోనే తన జీవితాన్ని ఇలా ముగించుకున్నాడు.. అని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. కొత్తూరు మండలం పెంజర్ల వద్ద ఆత్మహత్య చేసుకున్న షాబాద్ నరహంతకుడు రాజ్ కుమార్ ఆత్మహత్య ఘటన స్థలాన్ని కమిషనర్ తరుణ్ జోషి తదితర పోలీసు బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 29 సంవత్సరాల రాజ్ కుమార్ మైనర్ బాలికను, అతని తల్లిని, నాయనమ్మను దారుణంగా హతమార్చడమే కాకుండా తాళి కట్టిన ఇల్లాలిని, కడుపున పుట్టిన పిల్లలను ఇద్దరిని కూడా కడతేర్చాడని ఆయన వివరించారు. ఈనెల 10వ తేదీన రాత్రి గూగుల్ పే ద్వారా రూ. 2000 చెల్లించి ఒక అద్దెకారును తీసుకొని ఈ తతంగం నడిపారని తెలిపారు. రాత్రి 10:30 కి షాబాద్ మండల కేంద్రానికి చేరుకొని 11:30 తర్వాత ఈ దారుణ మారణకాండకు పూనుకున్నాడని వివరించారు. బాలిక తల్లి, నాయనమ్మల ఉపయోగించిన కత్తిని కాకుండా వేరే కత్తిని బాలికను చంపేందుకు ఉపయోగించాడని వివరించారు. పూర్తిగా మత్తు పదార్థాలకు, బెట్టింగులకు అలవాటు పడిన ఇతను రెండు కోట్లకు పైగా అప్పులు చేశాడని అతని మానసిక స్థితి సరిగ్గా లేకపోవడం వల్లనే ఈ హత్యలకు పాల్పడ్డాడని, చివరికి తనను తాను చంపుకున్నాడని స్పష్టం చేశారు. హత్యోదంతం తర్వాత టీంలుగా మారి అతని కోసం పోలీసులు గాలింపులు మొదలు పెట్టినట్లు వివరించారు. షాబాద్ లో హత్యాకాండ పూర్తయిన తర్వాతనే తన స్వగ్రామానికి వెళ్లి భార్యను, పిల్లలను హత్య చేశాడని పేర్కొన్నారు. బాలికను ఇంటికి 200 మీటర్ల దూరంలో గల చెరువు వద్దకు తీసుకువెళ్లి కత్తితో పొడిచి చంపినట్లు తెలిపారు. బాలిక తల్లి అమ్మమ్మను చంపే సమయంలో సదరు బాలిక కారులోనే ఉన్నట్లు ధృవీకరించారు. అతని కుటుంబం ద్వారా ఇక్కడ ఎక్కడ ఉంటాడనే వివరాలు సేకరించి విచారణ ప్రారంభించామని, అతని బంధువులు స్నేహితులు పరిచయస్తులు మొత్తం అతడు వాడిన 16 సిమ్ కార్డుల ద్వారా కూడా వివరాలు సేకరించే ప్రయత్నం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఇతని ఆత్మహత్య వ్యవహారాన్ని కూడా అన్ని కోణాలలో విచారణ జరుపుతున్నామని ఆయన వివరించారు.

### మోసం చేశారు.. అందుకే చంపేశా!

>> చెప్పారు. అమ్మాయి కుటుంబం తనను తీవ్రంగా మోసం చేసిందని, తన బిడ్డలకు కూడా భూమి లేకుండా మొత్తం అమ్మేశానని జీవితంపై విరక్తి పుట్టి వారిని చంపాలనుకున్నా అంటూ రాజ్ కుమార్ తన వాంగ్మూలాన్ని వీడియోలో రికార్డ్ చేశాడు. తనపై ఫోక్సో కేసు పెట్టడంతో విరక్తి చెంది ఆ అమ్మాయి కుటుంబాన్ని చంపినట్లు ఆ వీడియోలోని సారాంశం.

# పోలీసుల సమక్షంలో రాజ్‌కుమార్ మృతదేహం దహనం

**చేవెళ్ల, జూలై 13, ప్రభాతవార్త:** ఆరు హత్యల నిందితుడు రాజ్‌కుమార్ మృత దేహంకు చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో వైద్యులు పోస్టు మార్టం సోమవారం రాత్రి చేశారు. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ప్రణీత్,ప్రశాంత్‌రెడ్డి, స్వర్ణలతల బృందం పోస్టు మార్టం చేసిన తరువాత మృత దేహంను పోలీసులకు అప్పగించారు. చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్,శ్రీనివాస్‌రెడ్డిల అద్వర్యంలో రాజ్‌కుమార్ మృత దేహంకు చేవెళ్ల స్మశాన వాటికలో దహన సంస్కారాలను చేశారు. బందువులు ఎవరు రాకపోండంతో పోలీసులే దగ్గరుండి దహన సంస్కారాలు చేశారు.దీంతో నరరూప రాక్షసుడి కథ ముగిసింది. ఆరు హత్యలు చేసి రాష్ట్రంలో దేశంలో సంచలనం సృష్టించిన రాజ్ కుమార్ ను వెతకడానికి రాష్ట్ర పోలీసు యంత్రాంగం మూడు రోజులు ఉప్పు తిప్పలు పడ్డారు. సిపి తరుణ్ జోషి, అడిషనల్ సీపీ చందన దీప్తి, డీసీపీ యోగేష్ గౌతమ్ వీరి ఆధ్వర్యంలో 14 బృందాలుగా ఏర్పడి షాద్ నగర్ నుంచి శంషాబాద్ వరకు అటుగా కర్నూల్ వరకు జాతీయ రహదారి 44 ఆనుకొని ఉన్న హోటల్లు దాబాలు లాడ్జీలు జల్లెడ పట్టారు. కొన్ని బృందాలు చుట్టుపక్క గ్రామాలలో వెతకడం ప్రారంభించారు రెండు మూడు బృందాలు శంషాబాద్ నుంచి కర్నూల్ వరకు రైల్వే ట్రాక్ పై వెతికారు. కొందరు సాంకేతిక నైపుణ్యం కలిగిన వారు సీసీ కెమెరాలు ఫోన్ లొకేషన్ పరిశీలించడం ప్రారంభించారు. లూస్ టీము మరియు జాగిలాలతో రెండు బృందాలు వెతకడం ప్రారంభించాయి. అయినా ఫలితం లేకపోయింది. సోమవారం రోజు సూర్యాపేట సమీపంలో ఉన్నట్లు ఎవరో పుకార్లు లేపితే అక్కడికి ఒక బృందం వెళ్లినట్లు సమాచారం. డీసీపీ యోగేష్ గౌతమ్ షాబాద్ పోలీస్ స్టేషన్ లోనే మకాం వేసి అన్ని బృందాలను మానిటరింగ్ చేశారు. చివరకు శవం దొరికిందని తెలియడంతో పోలీసులు అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంత కష్టపడినా నరాంతకున్ని తాము ప్రాణాలతో పట్టుకోలేక పోయామని పోలీసులు నిరుత్సా" హపడుతున్నారు. అయినాప్పటికీ ప్రజలు మాత్రం 48 గంటలుగా పోలీసు యంత్రాంగం పడుతున్న కష్టాన్ని గుర్తించారు. పోలీసుల నిరక్ష ్యంతో ఆరు ప్రాణాలు పోయాయని ఆందోళన చేపట్టిన ప్రజలు మూడు రోజులుగా వారు పడుతున్న కష్టాన్ని శ్రమను గుర్తించారు. మన పోలీసులు బాగా కష్టపడుతున్నారని ప్రశంసిస్తున్నారు.పథకం ప్రకారమే రాజ్కుమార్ ఆరుగురిని హత్య చేశాడు: సీపీ తరుణ్ జోషి.ఫోక్సో నిందితుడు రాజ్ కుమార్ పథకం ప్రకారమే బాలిక, తల్లి, నానమ్మ, అతని భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేశాడు. 10వ తేదిన సాయంత్రం 4:55నిమిషాలకు సెల్ఫి వీడియో తీసుకున్నాడు. కారు అద్దెకు తీసుకుని ఆ రోజు రాత్రి మద్యం సేవించి గోడదూకి రాత్రి 11గంటల ప్రాంతంలో బాలిక ఇంటికి వెళ్లాడు. తల్లి, నానమ్మను మొదట హత్య చేసి బాలికను బలవంత తీసుకెళ్లాడు. దైవాలగూడకు వెళ్లి చెరువు ప్రాంతంలో బాలికను హత్య చేశాడు. ఆ తదనంతరం భార్య ఇద్దరు పిల్లలను హత్య చేశాడు. ఇందుకు రెండు కత్తులు వాడాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తండ్రికి ఫోన్ చేసి పరారయ్యాడు. నిందితుడికి కోసం 48గంటలుగా 12 బృందాలను ఏర్పాటు చేసి గాలించాం. ఫోక్సో కేసు సమయంలో ఈసీఐఎల్. శ్రీశైలంలో తలదాచుకున్నాడు. ఆ ప్రాంతంలో సైతం వెతికాం. ఇక్కడ, రైల్వేస్టేషన్, బస్ స్టాడ్స్, వైన్స్ లు. హోటల్స్ ఐనా ఆచూకి లబించలేదు. ఈ రోజు (సోమవారం) మధ్యాహ్నం 3గంటలకు కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ శివార్లలోని ఓ వెంచర్ లో గుర్తు తెలియని మృతదేహం ఉందని డయల్ 100కాల్ వచ్చింది. వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి వెళ్లారు. రాజ్కుమార్ అన్నను సంఘటన స్థలంకు పిలిచాం. మృతదేహం రాజ్కుమార్ దేనని నిర్ధారించారు. పురుగుల మందు డబ్బా. ఓ మొబైల్, రూ.1260 నగదు అతని మృతదేహం వద్ద లభ్యమయ్యాయి. గత ఏడాది ఓ మారు ఇతను ఆత్మహత్యయత్నం చేశాడు. నగరంలోని కామినేని ఆసుపత్రిలో 4రోజులు చికిత్స పొందాడు. ఇతనికి క్రికెట్ బెట్టింగ్, ఆన్ లైన్ గేమ్స్.ప్యాకట ఆలవాటు ఉంది. సుమారు రెండు కోట్ల రూపాయాలు అప్పులు చేశారని ఫ్యూచర్ సీటీఫ్యూచర్ సీటీ సీపీ తరుణ్ జోషి వెల్లడించారు. ఆయన వెంట అడిషనల్ సీపీ చందనా దీప్తి, డీసీపీలు యోగేష్ గౌతమ్. శిరీషలు ఉన్నారు.

# 21 నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

### 28 వరకు రిజిస్ట్రేషన్ కమ్ వెరిఫికేషన్

### ఆగస్టు 1న అర్హుల జాబితా ప్రకటన

### నేడు నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్ సెట్-2026 కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేడు(మంగళవారం) జారీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను అడ్మిషన్స్ కన్వీనర్ (ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి సోమవారం విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 28 వరకు రిజిస్ట్రేషన్ కమ్ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 28 నుంచి 31 వరకు స్పెషల్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. ఆగస్టు 1న కౌన్సెలింగ్‌కు అర్హులైన వారి జాబితాను ప్రకటిస్తారు. ఆగస్టు 2 నుంచి 4 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 4న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. ఆగస్టు 8న సీట్ల కేటాయింపు చేస్తారు. ఆగస్టు 10 నుంచి 14 వరకు ఆయా కాలేజీల్లో విద్యార్థులు చేరాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో కన్వీనర్ పేర్కొన్నారు. ఎడ్ సెట్-2026 పరీక్ష మే 12న నిర్వహించారు. ఎడ్ సెట్ పరీక్షకు 35,600 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 29,441 మంది మహిళలు .. 6,155 మంది పురుష అభ్యర్థులు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. పరీక్షకు 29,342 మంది హాజరయ్యారు. బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో చేరడానికి ఈ నెల 21 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేడు (మంగళవారం) జారీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 25 వరకు రిజిస్ట్రేషన్ కమ్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. ఈనెల 27న కౌన్సెలింగ్‌కి అర్హులైన వారి జాబితాను ప్రకటిస్తారు. ఈ నెల 28 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 31న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. ఆగస్టు 2న సీట్ల కేటాయింపు చేస్తారు. ఆగస్టు 3 నుంచి 6 వరకు ఆయా కాలేజీల్లో విద్యార్థులు చేరాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో కన్వీనర్ పాండురంగారెడ్డి పేర్కొన్నారు.

## అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్-2026లో నారాయణ విద్యార్థి శ్రేష్ఠ సురయకు స్వర్ణం

### విశ్వవేదికపై రెపరెపలాడిన భారత కీర్తిపతాకం



శ్రేష్ఠ సురయ

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** కొలంబియాలోని బుకారామంగాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన 56వ అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐపిహెచ్‌వో)-2026లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థి శ్రేష్ సురయ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రపంచ దేశాల మేధావులతో పోటీపడి, భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన శ్రేష్ఠ సురయ అద్భుత ప్రతిభతో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ ఏడాది ఈ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న భారత ప్రతినిధి బృందంలోని ఐదుగురు సభ్యులూ స్వర్ణ పతకాలు సాధించడం విశేషం. చైనా, రష్యా, సౌత్ కొరియా, కజకిస్తాన్, తైవాన్ దేశాలతో కలిసి భారతదేశం ప్రపంచస్థాయిలో "జాయింట్ వరల్డ్ ర్యాంక్ నెం.1" సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ 56వ ఒలింపియాడ్లో ప్రపంచవ్యాప్తంగా 87 దేశాల నుండి 381 మంది అత్యుత్తమ ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొన్నారు. గ్లోబల్ స్టేజీపై గోల్డ్ మెడల్ సాధించడమే కాకుండా, శ్రేష్ట్ సురయ ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాల్లో ఆల్ ఇండియా 58వ ర్యాంక్ సాధించి తన అసాధారణ విద్యానైపుణ్యాన్ని నిరూపించుకున్నాడు. ఈ డబుల్ అచీవ్‌మెంట్ నారాయణ విద్యాసంస్థల ప్రపంచస్థాయి శిక్షణకు, విద్యార్థి అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇంతటి ఘనవిజయంపై నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సింధూర నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 58వ ర్యాంక్ సాధించిన శ్రేష్ట్ సురయను చూసి ఎంతో గర్విస్తున్నామన్నారు. ఇది శ్రేష్ట్ నిరంతర కృషికి, పట్టుదలకు దక్కిన గౌరవం. ఈ గెలుపు నారాయణ కుటుంబానికే కాకుండా దేశ మొత్తానికి గర్వకారణమని కొనియాడారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రక్షాళన

### ఆడిట్, పనితీరు పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన ఏజెన్సీలను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏజెన్సీల సమగ్ర ఆడిట్ నిర్వహించడంతో పాటు, క్రమబద్ధమైన పర్యవేక్షణ కోసం రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి చైర్మన్ తోపాటు, పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను సభ్యులుగా నియమించింది. కమిటీ చైర్మన్‌గా సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కన్వీనర్‌గా ఆర్థిక, ప్లానింగ్ శాఖ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, సభ్యులుగా కార్మిక, ఉపాధి శాఖ కార్యదర్శి, డి. హరిచందన, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ నాగేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్ ద్రాక్షమణి. తో పాటు, సాధారణ పరిపాలన శాఖ నుంచి మరొకరిని నామినేట్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ కమిటీ 45 రోజుల్లోగా విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. కమిటీ ప్రధానంగా రాష్ట్రంలోని అన్ని ఔట్సోర్సింగ్ ఏజెన్సీలపై సమగ్ర ఆడిట్ నిర్వహించడం. ఈపీఎఫ్, ఈఎస్ఐ, ప్రొఫెషనల్ ట్యాక్స్, కనీస వేతనాల చట్టం, కాంట్రాక్ట్ లేబర్ చట్టాల అమలు తీరును పరిశీలించడం. ఉద్యోగులకు జీతాలు డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో సకాలంలో జమవుతున్నాయో లేదో నిర్ధారించడం. హాజరు, వేతన రిజిస్టర్లతో పాటు ఇతర చట్టబద్ధమైన రికార్డుల తనిఖీ. ఏజెన్సీల వాస్తవ కార్యకలాపాలను ధృవీకరించడం, ప్రభుత్వ శాఖలతో కుదుర్చుకున్న ఒప్పందాల అమలును పరిశీలించడం. ఉద్యోగుల సంక్షేమానికి విఘాతం కలిగించే లోపాలు, అక్రమాలను గుర్తించి.. పారదర్శకత పెంచేందుకు అవసరమైన సూచనలు ఇవ్వడం. భవిష్యత్తు నియామకాలకు మార్గదర్శకాలు రూపొందించడం, వేతనాలు, సేవా నిబంధనలను సమీక్షించాల్సి ఉంటుంది.

## టెట్ పేపర్-2లో ఏపి తరహా సిలబస్ అమలు చేయాలి

### పాఠశాల విద్య డైరెక్టర్‌కు ఆర్‌పిపి-టిఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్వహించే టీజీ టెట్ పేపర్-2లో ఆంధ్రప్రదేశ్ తరహాలో సబ్జెక్టు వారీగా సిలబస్‌ను అమలు చేసి నోటిఫికేషన్ విడుదల చేయాలని రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్-తెలంగాణ (ఆర్‌యుపిపి-టిఎస్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్‌ని కలిసిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు శానమోని నర్సిములు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిరాజు శశికుమార్, నల్గొండ జిల్లా అధ్యక్షులు గాదె సత్యనారాయణ పాల్గొన్నారు. రాష్ట్రంలోని డైట్, ఏఐఎస్ఈ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హులైన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులతో డిప్యూటేషన్ ద్వారా భర్తీ చేయాలని, ఇందుకోసం స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల అనుభవం తప్పనిసరి అనే నిబంధనను సవరించాలని కోరారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం

### వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకొస్తాం

### సిఎం రేవంత్‌రెడ్డితో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. సోమవారం ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్ పర్సన్ కిషోర్ మక్వానా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, డీజీపీ సీవీ ఆనంద్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జాతీయ ఎస్సీ కమిషన్ చైర్ పర్సన్‌కు అధికారులు వివరించారు. అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశాం విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ స్కూల్ లోనే అందిస్తున్నాం విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నాం కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ సంఖ్యను పెంచుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ



అవకాశాలను కల్పిస్తున్నామని వివరించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని చెప్పారు. ఇదే సమయంలో ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని జాతీయ ఎస్సీ కమిసన్‌ను కోరారు.

## పౌరసత్వాన్ని నిష్పాక్షిక ప్రక్రియ ద్వారానే నిర్ధారించాలి

### గువాహటి హైకోర్టు ఇచ్చిన 27 తీర్పులను కొట్టేసిన సుప్రీంకోర్టు

### ఈ కేసులను స్వతంత్రంగా పునఃపరిశీలించాలని ట్రిబ్యునళ్లకు ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 13:** పౌరసత్వానికి సంబంధించిన ప్రశ్నలను 'నిష్పక్షపాతమైన, చట్టబద్ధమైన, సహేతుకమైన్న ప్రక్రియ ద్వారానే నిర్ణయించాలని పేర్కొంటూ, అప్పీలుదారులను విదేశీయులుగా ప్రకటిస్తూ విదేశీయుల ట్రిబ్యునల్స్ ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించిన గువహటి హైకోర్టు ఇచ్చిన 27 తీర్పులను సుప్రీం కోర్టు సోమవారం కీలకమైన తీర్పులో కొట్టివేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ 27 కేసులన్నింటినీ తిరిగి సంబంధిత విదేశీయుల ట్రిబ్యునళ్లకు తాజావిచారణ కోసం పంపింది. 'పౌరసత్వం, విదేశీయుడి హోదా అనేవి అత్యంత రాజ్యాంగ, చట్టపరమైన ప్రాముఖ్యత కలిగిన అంశాల్లు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తి పౌరసత్వానికి సం బంధించిన ఏ నిర్ణయ మైనా నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా, సహేతు కంగా ఉండే ప్రక్రియ ద్వారానే జరగాలని స్పష్టం చేసింది. విదేశీయుల ట్రిబ్యునళ్లు గానీ, గువహటి హైకోర్టు గానీ గతంలో ఇచ్చిన తీర్పుల ప్రభావానికి లోనుకాకుండా, ఈ కేసులను స్వతంత్రంగా పునఃపరిశీలించాలని సుప్రీంకోర్టు ట్రిబ్యునళ్లను ఆదేశించింది. అప్పీలు దారులను విదేశీయులుగా ప్రకటించిన విదేశీయుల ట్రిబ్యునళ్ల ఏకపక్ష ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్ల విచారణలో ఈ తీర్పు వెలువడింది.

## బిఎల్‌ఒలపై దాడి చేశారంటూ ఫిర్యాదు

### కాంగ్రెస్, బిఆర్‌ఎస్ బిఎల్‌ఎలు అరెస్ట్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూలై 13, ప్రభాతవార్త:** బిఎల్‌ఒలపై దాడి చేశారంటూ ఎన్నికల అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బీఎల్‌ఏలుగా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ నేత జేజోళ్ల రాజు, కాంగ్రెస్ పార్టీ నేత బాలనర్సింహాలపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ ఎన్బీటీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం బీఎల్‌ఓలు మాధవి, దేవిలు ఒకరికే 20 ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వడంపై జేజోళ్ల రాజు, బాలనర్సింహాలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే వారి మధ్య మాటలు పెరగడంతో ఏఈఆర్ఓ కైలాశ్ వచ్చి వారికి సర్దిచెప్పారు. ఇదిలా ఉండగా ఎన్బీటీనగర్‌లో నివసించే రాజు ముదిరాజ్ ఇంటికి వచ్చిన ఇద్దరు బీఎల్‌ఓలపై ఎందుకు దాడి చేశారంటూ గొడవకు దిగారు. ఇదిలా ఉండగా బీఎల్‌ఓలపై జేజోళ్ల రాజు, బాలనర్సింహాలు దాడి చేశారంటూ ఈఆర్వో శంకర్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. మరోవైపు కేసు నమోదు విషయాన్ని తెలుసుకొని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి విజయారెడ్డి, బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్‌లు బంజారాహిల్స్ ఠాణా వద్దకు చేరుకున్నారు. పెద్దఎత్తున పార్టీలకు చెందిన కార్యకర్తలు, నేతలు చేరుకోవడంతో ఇక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మరోవైపు జేజోళ్ల రాజు భార్య, తల్లిని సైతం పోలీసులు విచారణకు ఠాణాకు తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా స్థానికంగా ఉన్న కొందరు నేతలు కావాలనే రాజకీయ కక్షతో ఈ కేసులు పెట్టారని జేజోళ్ల రాజు ఆరోపించారు. నిందితులను న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తామని బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.

## వైసిపి అధికార ప్రతినిధి నాగార్జునయాదవ్‌కు రిమాండు

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** ఒక టివి ఛానల్‌లో డిబేట్ జరిగిన సమయంలో సిఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కే సులో అరెస్టయిన ఏపి వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌కు నాంపల్లి కోర్టు సోమవారం రెండు వారాల రిమాండు విధించింది. ఏపి లో జరిగిన ఈ డిబేట్ తెలంగాణలోనూ ప్రసారం కాగా సిఎం రేవంత్ రెడ్డిపై నాగార్జున యాదవ్ చేసిన అడ్డగోలు వ్యాఖ్యలు సంచలనం రేపా యి. దీనిపై టిపిసిసి కాంగ్రెస్ నాయకులు బేగంబజార్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోద య్యింది. ఈ కేసును పురస్కరించు కుని నాగార్జున యాదవ్‌ను ఆదివారం నాడు హైదరాబాద్ పోలీసులు ఏపిలో అరెస్టు చేసి ఇక్కడికి తరలించడం విదితమే. ఆయనను సోమవా రం మధ్యాహ్నం నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి నాగార్జున యాదవ్‌కు రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం పోలీసులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## ఏపికి సహకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం

### గోదావరి-బనకచర్లపై హరీశ్ విమర్శ

**సంగారెడ్డి బ్యూరో, జులై 13, ప్రభాతవార్త :** గోదావరి-బనకచర్ల విషయంలో ఏపీ ముందుకు వెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని మాజీమంత్రి, బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ గోదావరి-బనకచర్ల, గోదావరి- నల్లమల సాగర్‌పై బీఆర్‌ఎస్ మొదటి నుంచే హెచ్చరిస్తూనే ఉందని, బీఆర్‌ఎస్ నిలదీయడంతోనే ప్రభుత్వం బ్యాక్‌డేట్ లేఖలు రాసిందని,పరోక్షంగా ఏపీకి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని నేడు సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందని అన్నారు. కావాలనే లోపభూయిష్టమైన సూట్ వేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ను తిట్టడంపైనే దృష్టి ఉంది తప్ప తెలంగాణ నీటి ప్రయోజనాలపై లేదని విమర్శించారు. నాడు గోదావరి- నల్లమల సాగర్ టెండర్లు పూర్తయ్యాకే కోర్టుకు వెళ్లారని, 11 డిసెంబర్ 2025న టెండర్లు పూర్తయ్యాయి. 16 డిసెంబర్ 2025న రిట్ వేశారని, ఏడు నెలలుగా బలమైన సూట్ ఎందుకు వేయలేకపోయారని ప్రశ్నించారు. సూట్ లోపభూయిష్టంగా ఉందని సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కుకు ఇంతకంటే పెద్ద సాక్ష్యం అవసరం లేదని గుర్తు చేశారు.

# రెండు రోజుల్లో యూరియా ఉత్పత్తి

### రామగుండం ఫెర్టిలైజర్స్


**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ లోని అమ్మోనియా ప్లాంట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో నిలిచిపోయిన యూరియా ఉత్పత్తిని మరో రెండు రోజుల్లో పునరుద్ధరిస్తామని యజమాన్యం వెల్లడించింది. మరమ్మతు పనులను వేగవంతం చేసినట్లు కం పెనీ యాజమాన్యం తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో ఉత్పత్తి ప్రక్రియను సాధారణ స్థితికి తీసుకువస్తామని ఆశిస్తున్నట్లు వివరించింది. దేశ ఎరువుల డిమాండ్‌ను తీర్చడంలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. 2021 మార్చిలో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించినప్పటి నుండి, ఈ ప్లాంట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు యూరియా సరఫరాకు కీలక వనరుగా ఉందని పేర్కొంది. కేవలం 2026 జూన్ నెలలోనే, రామగుండం యూనిట్ సుమారు 94,849 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేసి, 97,094.70 మెట్రిక్ టన్నుల యూరియాను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసిందని వివరించింది.

ఆ నెలలో, తెలంగాణకు 48,675.33 మెట్రిక్ టన్నులు, ఆ తర్వాత కర్ణాటకకు 28,338.66 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 11,308.23 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 5,655.60 మెట్రిక్ టన్నులు, మరియు మహారాష్ట్రకు 3,116.88 మెట్రిక్ టన్నులు ఎగుమతి చేయబడ్డాయని తెలియచేసింది. కాగా సాంకేతిక కారణాలతో గత ఐదు రోజుల క్రితం ప్లాంట్‌లో యూరియా ఉత్పత్తి పూర్తిగా నిలిపివేసినట్లు వెల్లడించింది.

దేశంలోని అతిపెద్ద యూరియా తయారీ కేంద్రాలలో ఒకటైన రామగుండం యూనిట్‌ను పట్టిపీడిస్తున్న దీర్ఘకాలిక సాంకేతిక సమస్యలను ఈ సంఘటన మరోసారి వెలుగులోకి తెచ్చింది. ఖరీఫ్ సీజన్ ఉధృతంగా సాగుతున్న ఈ సమయంలో, పలు రాష్ట్రాల రైతులు ఈ ఎరువుల నిరంతర సరఫరాపై ఆధారపడి ఉన్నందున సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

# రైల్వే భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం

### వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు జనరల్ మేనేజర్ ఆదేశం



అధికారులకు సూచనలు ఇస్తున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), జులై 13, ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైళ్ల సురక్షిత నిర్వహణ, ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం సికిందరాబాద్‌లోని రైల్ నిలయంలో అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాశ్, వివిధ విభాగాల ప్రధానాధికారులతో కలిసి నిర్వహించిన భద్రతా సమీక్షా సమావేశంలో ఆయన రైలు కార్యకలాపాలను సమీక్షించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ విభాగాల అధికారులు దూర దృశ్య సమావేశం ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాక్‌ల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. ఈ నెలలో నిర్వహించిన భద్రతా తనిఖీల నివేదికలను పరిశీలించిన ఆయన, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాక్‌ల వద్ద అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్వహణ పనుల సమయంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించడంతోపాటు అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిదాలని, రైళ్ల సురక్షిత రాక పోకలకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పశు వులు రైల్వే పట్టాలపైకి రావడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి కంచెలు, రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాల నివారణకు ప్రజలను చైతన్య పరచాలని చెప్పారు. లోకో పైలట్లకు సిగ్నల్ సూచనలు స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టాలని, రైలు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేసే చర్యలను అన్ని విభాగాలు సమన్వయంతో అమలు చేయాలని జనరల్ మేనేజర్ ఆదేశించారు.

# మెరిట్ ప్రకారమే బిసి గురుకులాల్లో సీట్ల భర్తీ

### మధ్యవర్తులను నమ్మొద్దు.. తల్లిదండ్రులకు గురుకుల కార్యదర్శి సైదులు విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సంస్థలో సీట్లు మెరిట్ ప్రకారమే కేటాయిస్తున్నామని, సీటు రానివారు సొసైటీ రాష్ట్ర కార్యాలయానికి, స్కూల్స్ చుట్టూ తిరగవద్దని బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు జరుగుతున్నాయని, అర్హత గల వారికే సీట్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. మెరిట్ ప్రకారం మొదటి విడత, రెండవ విడత సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. 5వ తరగతిలో 6, 7, 8తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్లు ఇంకా ఏమైనా ఖాళీలు ఉంటే ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి విద్యార్థుల మెరిట్ ఆధారంగా అర్హులైన వారికి సీటు కేటాయించబడుతుందన్నారు. ఇంటర్ కాలేజీల్లో ఎక్కడైనా సీట్లు ఖాళీ ఉంటే ఆయా కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సీటు రాని వారు ఆఫీస్‌కి, స్కూల్స్ చుట్టూ తిరగవద్దని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సంస్థ కార్యాలయానికి రావద్దని, అడ్మి షన్లకు దరఖాస్తులు తీసుకోబడవని, మధ్యవర్తులను నమ్మవద్దని సూచించారు. ఎవరైనా సీట్లు ఇప్పిస్తామని చెప్పితే వారి మాట నమ్మవద్దని, అలా చెప్పిన వారి వివరాలను 040-23120496 ఫోన్ నంబర్ ద్వారా తెలియ జేయాలని కోరారు. సీట్లు ఇప్పిస్తామని తల్లిదండ్రులను, విద్యార్థులను మోసం చేసేవారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సొసైటీ సెక్రటరీ సైదులు హెచ్చరించారు.



### అయోధ్య రామాలయంపై ఆరోపణలు..

## భద్రాద్రిలో విహెచ్ మౌనదీక్ష

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**భద్రాచలం, జులై 13, ప్రభాతవార్త:** అయోధ్య శ్రీరామ మందిరంలో అవినీతి జరిగిందంటూ వస్తున్న ఆరోపణలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయం సమీపంలో మౌనదీక్ష చేపట్టారు. ఈ మోనదీక్షకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నతో పాటు జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన అయోధ్య శ్రీరామ మందిర నిర్మాణంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు అత్యంత ఆందోళనకరమని అన్నారు. ఈ ఆరోపణలపై సీబీఐతో నిష్పక్షపాత విచారణ జరిపించి, నిజానిజాలు వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, ఉపసర్పంచ్ రత్నం కవిత, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించాలి

### ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

### ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి పిఆర్‌టియు టిజి విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** రెండు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను వెంటనే రూపొందించి డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డివైఈవో) పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని పిఆర్‌టియు తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకి సోమవారం వినతిపత్రం సమర్పించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డితో కలిసి సీఎస్‌కి వినతి పత్రాన్ని సమర్పించినట్టు చెన్నయ్య తెలిపారు. రెండు దశాబ్దాలకు పైబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ రూపొందించి డిప్యూటీ ఈవో తదితర పోస్టులు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని కోరినట్టు తెలిపారు. వెంటనే పిఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ఈహెచ్‌ఎస్ ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, డీఎస్‌సీ-2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలని, జీవో 190ని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. జీవో 317లో మిగిలిపోయిన స్పౌస్ బదిలీలను వెంటనే పూర్తి చేయాలని, నూతన జిల్లాలకు డీఈవో పోస్టులను మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలని సీఎస్‌కి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. సమస్యలపై సీఎస్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రవణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రా రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నూర్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్, నారాయణపేట జిల్లా అధ్యక్షులు మహేష్, మోడల్ స్కూల్ సంఘం అధ్యక్షులు యాకమల్లు, గౌరవ అధ్యక్షులు ఓం ప్రకాష్ పాల్గొన్నట్టు తెలిపారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ : మెదక్ సర్కిల్
టెండర్ నోటీసు నం. 03/2026-27 Spec: T-10/26-27 (1వ పొడిగింపు)
టెండర్ నోటీసు నం. 04/2026-27 Spec: T-13/26-27
మెదక్ సర్కిల్ పరిధిలోని మెదక్ డివిజన్లో వివిధ సివిల్ పనుల కోసం SE/OP/మెదక్ వారి టెండర్ స్పెసిఫికేషన్ నం. T-10/2026-27 (1వ పొడిగింపు) మరియు టెండర్ స్పెసిఫికేషన్ నం. T-13/2026-27 టెండర్ నోటీసు నం. 04. బిడ్ల విక్రయం 14.07.2026న ప్రారంభమై, 20.07.2026న 15:00 గం.కు ముగుస్తుంది. బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ 21.07.2026 15:00 గం.ల వరకు. మరియు బిడ్లు తెరుచుట 21.07.2026న 15:30 గం.కు. తదుపరి సమాచారం కోసం www.tgsouthernpower.org వెబ్‌సైట్ నుండి పొందవచ్చు. ఫోన్లు: 8452-221442, 8712473342, 8712473334.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్: మెదక్, TGSPDCL
DIPR.No.5951-PP/CL/Advt/1/2026-27, తేది: 13.07.2026

వార్త

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.

- బెర్ట్రండ్ రస్సెల్


# కరిగిపోతున్న ఖరీఫ్!

తన వ్యవసాయ క్షేత్రంలో విత్తు నాటితే, అది మొలకెత్తి మొక్క ఉనికిని బాహ్య ప్రపంచానికి కనబడేటట్లు పెరుగుతున్న కొద్దీ రైతులో సంతోషం వెల్లివిరుస్తుంది. అది పెరిగే కొద్దీ దాని వైభవం చూస్తూ పొంగిపోతాడు. కానీ ఎల్‌నినో పుణ్యమా అని దేశవ్యాప్త రైతుల్లో అలాంటిదేమీ కనబడుట లేదు. వర్షం వస్తుందోరాదో తెలియని ఆందోళనతో రైతు దిగాలు పడిపోయాడు. ఇతరత్రా గాలివానలు, తుఫాను బీభత్సాలవల్ల కలిగే భయోత్పాతం ఒకలా ఉంటే ఇప్పుడు చూస్తున్న ఎల్‌నినో క్షణ క్షణం రైతును కృంగదీస్తోంది. ఓ రెండు,మూడుమాసాల పాటుసూపర్ ఎల్‌నినో పేరిట మరెన్నో కష్టనష్టాలు తెచ్చి పెట్టేలాంటి సంకేతాలే ఉన్నాయి. వర్షాలు కురుస్తాయనుకున్న మృగశిర, ఆరుద్ర కార్తెల్లో తగిన వర్షం పడలేదు. ప్రస్తుతం పునర్వసు కార్తె కూడా శుభసంకేతాలను చూపడం లేదు. ఇదిగో వచ్చేసాయనుకున్న రుతుపవనాలు కూడా బలహీనపడటంతో వ్యవసాయదారుని నెత్తిమీద బండపడినట్లే ఉంది. వస్తాయనుకున్న వర్షాలు రాలేదని సాగు మానాలా,రేపెపుడో వర్షాలు కురుస్తాయిలే అని ధైర్యంతో ముందుకెళ్లాలా అన్న మీమాంసల మధ్య కొందరు రైతులు ఒకడుగు ముందుకే వేయాలనినిర్ణయించారు. కానీ నారు మొలవక కురిసే చినుకును ధ్యానిస్తూ రైతు ఆకాశం కేసి చూస్తున్నాడు. పశ్చిమ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంతో ఎల్‌నినో ప్రభావం బాగాబలపడుతోంది.ప్రపంచ వాతావరణ సంస్థ తాజా హెచ్చరికల ప్రకారం ఈ జులై నెల నుంచి సెప్టెంబరుల మధ్య ఎల్‌నినో బలీయంగా ప్రభావం చూపిస్తుంది.ఈతరుణంలో వ్యవసాయం,తాగునీటి వనరులు, ఆర్థిక వ్యవస్థ, ప్రజారోగ్యం, విద్యుత్ వినియోగం వంటి అన్ని రంగాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ముందు ముందు పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు. ప్రస్తుతమైతే ఎల్‌నినో పరిస్థితులు బలపడుతున్నాయనే చెప్పాలి. నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో వాతావరణం ఒకేసారివస్తే మంచిదేనని కొందరు శాస్త్రజ్ఞులు చెబుతుంటారు. కానీ ఒకదానికొకటి ముడిపడని సందర్భాలు అందుకే రైతు దిక్కుతోచక సతమతమవుతున్నాడు. ఎల్‌నినో ఎప్పుడెంత స్థాయిలో ప్రభావం చూపినా నవంబర్ నెలదాక వ్యవసాయం వంటి అన్ని రంగాలపై ఎంతో కొంత ప్రభావం చూపుతుంది. ఏదైనా వ్యవసాయరంగానికి ఎల్‌నినో సవాలే. సాధారణంగా బలహీన వాతావరణ పరిస్థితులు చూడొచ్చు. ప్రధానంగా వరి, పత్తి, పప్పుధాన్యాలు, వర్షాధార పంటలుగా సాగు చేసే రైతులకు దినదినగండంలా ఉంటుంది. ఒకప్పుడు ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుందనే అనుకునేవారం. కానీ ఇప్పుడు తీవ్ర ఉష్ణోగ్రతలు, కార్చిచ్చులు,నీటి కొరత ఆరోగ్య సమస్యలు, ఆహార కొరత, వీటన్నిటి కారణంగా విద్యుత్ డిమాండ్ పెరుగుదల వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది.వర్షపాతం ఏమాత్రం తగ్గినా పండే పంటలపై ప్రభావం చూపుతోందన్న గాభరాతో ప్రభుత్వం రైతులకు అనేక అంశాలలో జాగ్రత్తలు పాటించమని చెబుతూనే ఉంది. భారత్‌లో వ్యవసాయధారిత దేశం కనుక రుతుపవనాలపై సాగు ఆధారపడి ఉంటుంది. జలాశయాల్లో నీటి నిల్వలుతగ్గితే సాగునీటి ప్రాజెక్టులపై ఒత్తిడి పెరుగుతుంది.ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. ధరలు పెరగడం,ద్రవ్యోల్బణం అధికమవడం వంటి తీవ్ర పరిణామాలు కలుగుతాయి. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించుకోవడమొక్కటే మనకుశక్యం. జాగ్రత్తలు పాటించి ముందుచూపుతో వ్యవహరించాలి. అప్పుడే సంక్షోభాన్ని ఎదుర్కొని నిలబడగలం. తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు ముఖం చాటేసి చాలారోజులైంది. ఎందరో రైతులు విత్తులు నాటినా మొలకల్లేక నిరాశతో ఎదురుచూస్తున్నారు. సాగు పనులు లేక వ్యవసాయ కూలీల జీవనోపాధికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. భూగర్భజలాలు అడుగంటి వివిధ పంటలనాట్లు కోసం సిద్ధం చేస్తున్న విత్తనాలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంతో ఎన్నో జిల్లాలలో వ్యవసాయ రంగం కుదేలైపోయింది. గ్రామీణ వ్యవస్థ బాగా దెబ్బతింది. ఈ విషయాలపై భారత్ వాతావరణ సంస్థ 'సెంట్రల్ వాటర్ కమిషన్ తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సొసైటీలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ భారత్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలపై కూడా. పెద్ద ప్రమాదం జరుగుతుంది. నైరుతి రుతుపవనాల బలహీనపడడంతో వర్షపాతం లోటు ఏర్పడింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి ప్రధాన పంట.అదీ వ్యవసాధారమే. ఆంధ్రప్రదేశ్, గోదావరి డెల్టాలో వరిసాగు, రాయలసీమలో వర్షాధార పంటలు. ఉత్తరాంధ్రాలో వరి, జీడి, చెరకు, ఉద్యానపంటలు విస్తృతంగా సాగుచేస్తారు. బంగాళాఖాతంలో తుఫానుల ఒత్తిడి పెరిగి భారీ వర్షాలు కురిస్తే అవి కూడా వ్యవసాయాన్ని దెబ్బతీస్తాయి. పంట నష్టాలు రైతును ఇబ్బంది పెడ్తాయి. సాగ కష్టనష్టాలు తప్పవు. తెలంగాణలో ఇప్పటికే 20 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉంది. జూన్, జులై నెలలో సగటున 22 శాతం వర్షపాతం లోటు ఉంది కొన్ని ప్రాంతాల్లో రెట్టింపులోటు ఉంది.వర్షాలు ఆలస్యమయ్యే కొద్దీ మళ్లీ నాట్లు వేయాలి. దాంతో మళ్లీ వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతాయి. రైతుకు ప్రభుత్వాలు ఎన్ని భరోసాలు కల్పించినా ఎల్‌నినో కల్పించే కష్టాల నుంచి నష్టాల తేరుకోగలడోలేదో. జులైలో ఉపందుకుంటాయనుకున్న వ్యవసాయ పనులు ఎక్కడిక క్కడ నిలిచిపోవడం విచారకరం. ఈ యేడాది ఇలాంటి వాతావరణ పరిస్థితుల రీత్యా గత యేడాది ఖరీఫ్ కన్నా సగం విస్తీర్ణంలోనే వరి సాగు జరిగే అవకాశం ఉంది. తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడం తప్ప రైతుకు వేరే గత్యంతరం లేదు.



విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.

డబ్ల్యు.ఎమర్సన్



అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూపోవాలి.

శ్రీ రమణ మహర్షి

# ప్రజావాక్కు



## మోడీతో భయమా!

టీవీలకు రాజకీయాలు ఉండరాదు. స్వతంత్రంగా పని చేయాలి. ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించాలి.ఆ మధ్య తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని అన్ని ఛానల్స్ ప్రతిరోజు అదేచర్చలు పెట్టి విసుగుపుట్టించాయి.కొన్ని రోజులు గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం చర్చలు మీద చర్చలు. మరి కొన్నాళ్ళు ప్రతి పక్షం వాళ్ళ అటవీభూములు ఆక్రమణమీద చర్చలు.ఒకవారం నుండి చర్చోపచర్చలు జరుగుతున్నాయి.అయితే అయోధ్య బాల రామాలయంలో హుండీలోకి చేరాల్సిన వేలకోట్ల రూపాయలుదొంగతనం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు హుండీ డబ్బులు లెక్కపెట్టేవారికి జేబు లు లేనీ చొక్కాలు వేసుకరమ్మని ఆదేశించారట.తిరుపతి లోఅక్రమాలు జరిగాయని తెగచర్చలు పెట్టినటీవీ ఛానల్స్ వారు,అయోధ్య రామాలయంలోజరిగినదొంగతనం మీదఎందుకు మౌనం వహిస్తున్నాయి? మోడీ తాట తీస్తాడని భయమా?

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## దివ్యాంగుల దైవ దర్శనం ఏర్పాట్లు?

దివ్యాంగులకు వివిధ దేవాలయాలలో దైవదర్శనం కోసం తగిన ఏర్పాట్లు చేయాలి. ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించాలి. దేవాలయాలలో వికలాంగుల దైవదర్శనం కోసం ప్రత్యేకమైన క్యూ ఏర్పాటు చేయాలి. సత్రాలలో ఉచిత సౌకర్యం కల్పించాలి. ఉచిత లడ్డు ఇవ్వాలి. దేవాలయాల వద్ద వికలాంగుల దైవదర్శనం వసతి కొరకు ప్రత్యేకమైన కౌంటర్ ఏర్పాటుచేయాలి.స్వచ్ఛంద సంస్థలు.యువజనసంఘాలు, అధికారులు,ప్రజా ప్రతినిధులు వికలాంగుల దైవదర్శనం కోసం ఆర్థికసహాయం చేయాలి. వికలాంగుల దైవ దర్శనం కోసం ఒక ప్రత్యేకమైన ట్రస్టును ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలి.

- ఈదునూరి, వెంకటేశ్వర్లు, నెక్కొండ

## నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజలు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజలు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది.రాష్ట్ర ముఖ్యమంత్రిమీనమేషాలు లెక్కించకుండా ఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్యనభ్యసించేలా సహకరించాలి.

-బి. కృష్ణ, హైదరాబాద్

## పాశ్చాత్య ధోరణులు

భారతదేశ వాతావరణ పరిస్థితులను బట్టి మనది ఉష్ణ మండల దేశంగా పరిగణిస్తారు.మనదేశంలో వివిధ ప్రాంతాలలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండటం కద్దు. వేసవిలోఅయితేఅసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. ఈ మధ్యకాలంలో పిల్లలు, యువతీ యువకులు, స్త్రీలు, పురుషులు ఉష్ణతాపం తట్టుకోలేకనో లేక పాశ్చాత్య ధోరణిలో చిన్నదుస్తులు ధరించి మండు వేసవిలో యధేచ్ఛగా సంచరిస్తున్నారు. సాధారణంగా సూర్యకిరణాల వేడిమి 30 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ అంతకు మించితే సూర్యకిరణాలలో అల్ట్రా వయొలెట్ కిరణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కిరణాలు చర్మానికి నేరుగా సోకితే చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదంఉంది.పాశ్చాత్యదేశాలలో సూర్యకిరణాల వేడిమి, తీక్షణత 30-32 డిగ్రీల సెల్సియస్‌కు మించదు కాబట్టి అక్కడి ప్రజలు చిన్న దుస్తులు ధరించినా వారికి పెద్దప్రమాదం ఉండదు.ఎటొచ్చీ ఉష్ణమండల దేశమైన భారత్‌లో జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవాలి.

- కె. వెంకట్, సికింద్రాబాద్

## కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంత జాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈకోర్టుకేసులో ఫోరంలో కేసు వేసినచో 90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీ ఇప్పుడు మూడు నాలుగు సంవత్సరాలు గడిచిన కానీ కేసు పరిష్కారం జరగటం లేదు కానీ కేసు బాధితులు మాత్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. అన్ని కేసుల వైపు కాకుండా వినియోగదారు ఫోరంలో తక్షణమే ఆధారాలతో యుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పు వెలబడును. కానీ నేటి వరకు కూడా పరిష్కార దిశలు కనుక్కోలేకపోతున్నారు. సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నారు. వినియోగదారుల ఫోరంలో జాబ్స్ వెంటేనే భర్తీచేసి కేసులు వేగవంతం చేయాలి.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

## వ్యవస్థలలో మార్పులు రావాలి

మానవ సమాజంలో సాంకేతికత పెరుగుతున్న క్రమంలో దానికనుగుణంగా మనం నిరంతరంఅభివృద్ధిచెందుతూ ముందుకు సాగితేనే సమాజంలో నిలదొక్కుకోగలం. కావున సాంకేతికత వినియోగం పెంచుకుని ఆర్థికంగా ఎదగాలి. గ్రామ స్థాయి నుంచే సాంకేతికతను అభివృద్ధిపరచాలి. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాలు, దేశం అభివృద్ధి చెందుతుంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'పచ్చని' ప్రయాణమే ప్రగతికి మార్గం

*సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ ఈవీలు కేవలం రవాణా సాధనాలుగా కాకుండా, స్మార్ట్ పరికరాలుగా మారుతున్నాయి. వినియోగదారుల ధోరణి కేవలం ఆసక్తి చూపడం నుండి హరిత వాహనాలను నేరుగా కొనుగోలు చేసేస్థిరమైన స్థాయికి మారుతోంది. కాలుష్య రహిత సమాజ స్థాపన,పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమేకాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక కర్తవ్యం. పర్యావరణానికి మేలు చేసే హరిత రవాణా వైపు అడుగులు వేయడం కాలప్రవాహంలో అనివార్యమైన అవసరంగా గుర్తించి, సాంప్రదాయ ఇంధన వాహనాల స్వార్థాన్ని వీడి, పచ్చని ప్రకృతి కోసం విద్యుత్తు వాహనాల వైపు మళ్లడమే నేటి వివేకం. హరిత ప్రయాణమే రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు అసలైన పునాది. మనం ఈ రోజు తీసుకునే ఒక్కో హరిత నిర్ణయం, రేపటి స్వచ్ఛమైన గాలికి ప్రాణ వాయువుగా మారుతుందని విస్మరించరాదు.*

వనకల్ల వీరప్ప

మానవజాతి సాధిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక ప్రగతి ఒకవైపు జీవన ప్రమాణాలను అపారంగా పెంచుతుంటే, మరోవైపు ప్రకృతి సమతుల్యతను ఘోరంగా దెబ్బతీస్తోంది. భూగోళాన్ని పట్టిపీడిస్తున్న తీవ్ర వాతావరణ మార్పులు, శరవేగంగా పెరుగుతున్న కార్బన్ ఉద్గారాల నేపథ్యంలో పర్యావరణానికి మేలు చేసే హరిత రవాణా వైపు అడుగులు వేయడం కాలప్రవాహంలో ఒక అనివార్యమైన అవసరంగా మారింది. కేవలం ఇంధన ధరల భారాన్ని తగ్గించుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలిని, కాలుష్యరహిత పచ్చని వాతావరణాన్ని అందించడానికి విద్యుత్తు వాహనాలవిప్లవం ఒక చారిత్రక చైతన్యంగా నిలిచింది. సాంప్రదాయ పెట్రోలు ద్విచక్ర వాహనాల స్థానాన్ని పర్యావరణ అనుకూల ఈవీలు ఆక్రమిస్తున్న ప్రస్తుత తరుణంలో, తెలుగు రాష్ట్రాలు జాతీయ సగటును మించి ఈ హరిత మార్పుకు విప్లవాత్మకంగా స్వాగతం పలుకుతుండటం అభినందనీయం,సర్వత్రా ఆదర్శనీయం. ప్రస్తుత ఆధునిక కాలంలో నిత్యం పెరుగుతున్న ఇంధన ధరలు ఒకవైపు మధ్యతరగతి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంటే, మరోవైపు వాహనాల పొగ వల్ల నగరాల్లో వాయుకాలుష్యం జీవన ప్రమాణాలను తీవ్రంగా క్షీణింపజేస్తోంది. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయేవరకు మహానగరాల రోడ్లపై కిలోమీటర్ల మేరసాగే వాహనాల రద్దీ, అవి వదిలే విషపూరిత వాయువులు వాతావరణాన్ని నరకప్రాయంగా మారుస్తున్నాయి. ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులు కాలుష్యం కారణంగా నానాటికీ పెరిగిపోతున్నాయి.ఈపర్యావరణ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపించగల ఏకైక ప్రత్యామ్నాయ మార్గం విద్యుత్తు రవాణా వ్యవస్థ మాత్రమేనని ప్రపంచ పర్యావరణ శాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు. ఒకప్పుడు విద్యుత్తు స్కూటర్లను కేవలం ఒక విలాసవంతమైన ఆప్షన్‌గా లేదా సరికొత్త సాంకేతిక ప్రయోగంగా చూసిన వినియోగదారులు, నేడు పర్యావరణ హితాన్ని, సుదీర్ఘకాలంలో లభించే అత్యంత తక్కువ నిర్వహణ వ్యయ ప్రయోజనాలను స్పష్టంగా గుర్తిస్తున్నారు. పెట్రోలు ధరలు లీటరుకు వంద రూపాయలు దాటి సామాన్యుడి ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్న తరుణంలో, ఈవీలు ఒక గొప్పవరంగా మారాయి. కేవలం పెట్రోలు ఖర్చులను ఆదా చేయడమే కాకుండా, శబ్ద కాలుష్యం, పొగ లేని స్వచ్ఛమైన ప్రయాణ అనుభూతిని పొందడానికి ప్రజలు ఈవీల కొనుగోలుపై మక్కువ చూపుతున్నారు. ఇది కేవలం ఒకవాహనం మార్పిడి అనే ఆర్థికపరమైన ఎంపిక మాత్రమే కాదు, పర్యావరణ పరిరక్షణలో తాము కూడా నేరుగా భాగస్వాములం కావాలనే సామాజిక బాధ్యతతో కూడిన గొప్పఅడుగుగా భావించాలి. పర్యావరణ స్పృహతో హరిత రవాణాను అలవర్చుకోవడంలో దేశంలోని మిగతా ప్రాంతాల కంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ముందువరుసలో నిలవడం మన తెలుగు ప్రజల ఆలోచనా విధానానికి నిలువెత్తు అద్దం పడుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరపు అధికారిక గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా ద్విచక్ర విద్యుత్తు వాహనాల వ్యాప్తి సగటున 7.8 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో అది 9.3శాతంగాను, తెలంగాణలో ఏకంగా 10.2శాతంగాను నమోదైంది. ఈ గణాంకాలు తెలుగు ప్రజలలో పర్యావరణహిత ఇంధన వనరుల పట్ల పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.కాలుష్య ప్రభావం ఎక్కువగాఉండే హైదరాబాద్, విశాఖపట్నం,విజయవాడ వంటి పెద్ద నగరాల్లోనే కాకుండా, చిన్న పట్టణాల్లో సైతం ఈవీల వాటా పెరుగుతుండటం అత్యంత సానుకూల




పరిణామం. తెలంగాణలోని పెద్ద నగరాలలో ఈవీల వాటా 12శాతానికి చేరగా, రెండో శ్రేణినగరాలలో 11శాతం, చిన్న పట్టణాలలో కూడా 9.2శాతం మార్కెట్ వాటాను సాధించడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఇదే విధమైన పర్యావరణ చైతన్యం ప్రతిబింబిస్తోంది. గడిచిన ఏడాది కాలంలో ఏపీలోని రెండో శ్రేణి నగరాల్లో ఈవీల ఆదరణ 7.5శాతం నుండి 10.2శాతానికి పెరగగా, మూడోశ్రేణి నగరాల్లో 6.2 శాతం నుండి 8.7శాతానికి వృద్ధిచెందింది. ఈ అద్భుతమైన వృద్ధిరేటు పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ,తృతీయశ్రేణి పట్టణ స్థాయికి కూడా శరవేగంగా విస్తరిస్తోందని స్పష్టం చేస్తోంది. పర్యావరణానికి మేలుచేసే వాహనాలు అందరికీ చేరాలంటే, వాటి ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండాలి. పర్యావరణ హితం ఎంత ముఖ్యమైనదైనా, సామాన్యుడికి ఆర్థిక లభ్యత లేనిదే ఏవిప్లవమైనా అర్థాంతరంగా ఆగిపోకతప్పదు. ప్రస్తుత తరుణంలో సాంప్రదాయ పెట్రోలు స్కూటర్లకు, విద్యుత్తు స్కూటర్లకు మధ్య ఉన్నధరల వ్యత్యాసం క్రమంగా తగ్గుతుండ టం శుభపరిణామం. ఈవీలలో అత్యంత కీలకమైన'బ్యాటరీ' తయారీ ఖర్చులు దేశీయంగా తగ్గడం, విడిభాగాలు స్థానికంగానే లభించడం ఇందుకు ప్రధాన కారణం. భవిష్యత్తులో బ్యాటరీ సాంకేతికత మరింత మెరుగై, స్థానిక ఉత్పత్తి పెరిగితే, పెట్రోలు స్కూటర్లతో సమానమైన ధరలోనే పర్యా వరణ అనుకూల ఈవీలు లభించే రోజులు ఎంతో దూరం లో లేవు. అయితే, స్కూటర్ల విభాగంలో కనిపిస్తున్న ఈ హరిత వేగం 'విద్యుత్తు మోటార్ సైకిళ్ల' (ఇ బైక్స్)విభాగంలో ఇంకా వెనకబడే ఉంది. మార్కెట్లో పెద్ద కంపెనీలు మొదట ఇస్కూటర్లనే అందించడం వల్ల, బైక్ ప్రియులు ఇంకా సాంప్రదాయ ఇంధన వాహనాలపైనే ఆధారపడుతున్నారు. మన దేశంలో, ముఖ్యంగా గ్రామీణ అర్ధ పట్టణ ప్రాంతాలలో బైకుల వినియోగం అత్యధికం. ఎక్కువ మైలేజీ, పటిష్టమైన బాడీ,నమ్మకమైన సాంకేతికతతోకూడిన ఇబైకులు అందుబాటులోకి వస్తే, కాలుష్యకారక బైకుల శకం కూడా ముగిసిపో తుంది. ఈవిషయంలో వాహన తయారీ కంపెనీలు పరిశోధనలను వేగవంతం చేయాల్సి న అవసరం ఎంతైనా ఉంది. హరిత రవాణావైపు ప్రజలు పూర్తిగా మారడానికి మార్కెట్లో కొన్ని సహజమైన అపోహలు, మౌలిక సవాళ్లు అడ్డుపడుతున్నాయి. బ్యాటరీ మన్నిక ఎన్ని రోజులు ఉంటుంది? ఒకే చార్జింగ్‌పై వచ్చే అసలు మైలేజీ ఎం? దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు లభించే చార్జింగ్ మౌలిక వసతులు, రీసేల్ విలువపై వినియోగదారులలో అనేక సందేహాలున్నాయి.పర్యావరణ మార్పును కాంక్షించే కొనుగోలుదారులకు డీలర్లు,తయారీ సంస్థలుస్పష్టమైన వారంటీలు,బ్యాటరీ సామర్థ్యంపై పూర్తి నమ్మకాన్ని కలిగించాలి. ఏ థర్ ఎనర్జీ వంటి ప్రముఖ సంస్థలు ఈదిశగా వినియోగదారులకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ మార్కెట్లో విశ్వసనీయతను పెంచుతున్నాయి. ప్రభుత్వాలు కూడా చార్జింగ్ స్టేషన్ల గ్రిడ్‌ను దేశవ్యాప్తంగా పెంచడానికిరాయితీలు ఇవ్వాలి. భారత ప్రభుత్వం దేశంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు 2030 నాటికి కొత్త వాహనాల విక్రయాలలో కనీసం 30శాతం వాటాను విద్యుత్తు వాహనాలుగా మార్చాలని ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని పెట్టుకుంది. ఈ హరిత లక్ష్య సాధన దిశగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు,పటిష్టమైన చార్జింగ్ వ్యవస్థ, సులభమైన సర్వీసింగ్ మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ ఈవీలు కేవలం రవాణా సాధనాలుగా కాకుండా, స్మార్ట్ పరికరాలుగా మారుతున్నాయి. వినియోగదారుల ధోరణి కేవలం ఆసక్తి చూపడం నుండి హరిత వాహనాలను నేరుగా కొనుగోలు చేసేస్థిరమైన స్థాయికి మారుతోంది. కాలుష్య రహిత సమాజ స్థాపన,పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమేకాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక కర్తవ్యం. పర్యావరణానికి మేలు చేసే హరిత రవాణా వైపు అడుగులు వేయడం కాలప్రవాహంలో అనివార్యమైన అవసరంగా గుర్తించి,సాంప్రదాయ ఇంధన వాహనాల స్వార్థాన్ని వీడి, పచ్చని ప్రకృతి కోసం విద్యుత్తు వాహనాల వైపు మళ్లడమే నేటి వివేకం. హరిత ప్రయాణమే రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు అసలైన పునాది. మనం ఈ రోజు తీసుకునే ఒక్కో హరిత నిర్ణయం, రేపటి స్వచ్ఛమైన గాలికి ప్రాణ వాయువుగా మారుతుందని విస్మరించరాదు. ●

# న్యాయవ్యవస్థపై విశ్వాసమే ప్రజాస్వామ్యానికి పునాది

తరిగోపుల నారాయణస్వామి


సుప్రీంకోర్టు ఇచ్చే ప్రతి తీర్పు చట్టబద్ధత, రాజ్యాంగబద్ధత అనే సూత్రాలపైనే ఆధారపడి ఉంటుంది. ఈ వ్యవస్థపై విశ్వాసం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది. అదే సమయంలో రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధ న్యాయపరమైన అవకాశాలను వినియోగించడం కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తిలో భాగమే. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు సంబంధించిన న్యాయపరమైన పరిణామాలు కేవలం ఒక పరీక్షకు సంబంధించినవి మాత్రమే కావు. అవి దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ, విద్యా నాణ్యత, ఉపాధ్యాయుల సేవా భద్రత, విద్యార్థుల భవిష్యత్తు, విద్యా పరిపాలన వంటి అనేక అంశాలతో ముడిపడి ఉన్నాయి. అందువల్ల ఈ అంశాన్ని ఒక ఉద్యోగ వివాదంగా కాకుండా జాతీయ ప్రాధాన్యత కలిగిన విద్యా విధాన అంశంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులు, వారి కుటుంబాలు, ప్రభుత్వ విద్యావ్యవస్థతో ముడిపడి ఉన్న ఈ అంశంలో రాజ్యాంగం కల్పించిన ప్రతి చట్టబద్ధ అవకాశంపై సమాజానికి అవగాహన కల్పించడం కూడా ఒక ప్రజాస్వామ్య బాధ్యత.విద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని నిరంతరం అభివృద్ధి చేయడం కూడా కాలానుగుణ అవసరమే. అయితే అదే సమయంలో టెట్ విధానం అమల్లోకి రాకముందే అప్పటి చట్టాలు, నిబంధనలు, అర్హతల ప్రకారం నియమితులై, అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితిని కూడా ప్రజాస్వామ్య దృష్టితో పరిశీలించాలి. విద్యా సంస్కరణలు ఎంత ముఖ్యమో, వాటి అమలులో న్యాయసముచిత, సమానత్వం, పరిపాలనా సౌలభ్యం,మానవీయ విలువలు కూడా అంతే ముఖ్యమైనవి. క్యూరేటివ్ పిటిషన్ అనేది సాధారణ అప్పీల్ కాదు. సాధారణ రివ్యూ పిటిషన్ కూడా కాదు. అత్యంత అరుదైన పరిస్థితుల్లో, న్యాయం పూర్తిగా జరిగిందా లేదా రాజ్యాంగపరమైన ఏదైనా అసాధారణ అంశం పునఃపరిశీలనకు అర్హమా అనే ప్రశ్నను పరిశీలించేందుకు భారత న్యాయవ్యవస్థ గుర్తించిన చివరి రాజ్యాంగపరమైన అవకాశం. అందువల్ల క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయడం న్యాయవ్యవస్థను వ్యతిరేకించడం కాదు, రాజ్యాంగం నిర్దేశించిన చట్టబద్ధ మార్గాన్ని గౌరవప్రదంగా వినియోగించడమే. ప్రజాస్వామ్యంలో చట్టం, న్యాయం, మానవీయ విలువలు పరస్పర విరుద్ధమైనవి కావు. అవి ఒకదానికొకటి పూరకాలు. చట్టం రూపొందించే సమయంలో ప్రతిభవిష్యత్ పరిస్థితిని ముందుగానే ఊహించడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. విద్యావిధానాలు మారుతాయి. అర్హతలు మారుతాయి. కానీ ఇప్పటికే చట్టబద్ధంగా నియమితులై సేవలందిస్తున్న ఉద్యోగుల పరిస్థితి కూడా ఒక సామాజిక వాస్తవం. అలాంటి సందర్భాల్లో మార్పు కాలం, దశలవారీ అమలు,శిక్షణ, ప్రత్యేక విధానాలు వంటి అంశాలను పరిశీలించడం ప్రజా విధానాల పరిపక్వతకు సంకేతం. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ అంశంలో కూడా చర్చ జరగాల్సింది న్యాయస్థానాన్ని విమర్శించడంకాదు,రాజ్యాంగం కల్పించిన అవకాశాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై. విద్యా ప్రమాణాలను కాపాడుతూ,సేవలో ఉన్న ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన ఆందోళనలను సమతుల్యంగా పరిష్కరించేమార్గాలను అన్వేషించడంప్రభుత్వం, విధాన రూపకర్తలు,న్యాయ నిపుణులు,విద్యావేత్తల ఉమ్మడి బాధ్యత. అలాంటి సందర్భాల్లో క్యూరేటివ్‌పిటిషన్ వంటి రాజ్యాంగపరమైన అవకాశాలను పరిశీలించడం ప్రజాస్వామ్య బద్ధమైన,చట్టబద్ధమైన చర్యగా పరిగణించవచ్చు. అది ఏ తీర్పును ధిక్కరించడంకాదు, రాజ్యాంగం చూపిన చివరి న్యాయమార్గాన్ని వినియోగించాలనే విజ్ఞప్తిమాత్రమే. ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేశిల్పులు. వారి అనుభవాన్ని గౌరవిస్తూ, విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేసే సమతుల్య పరిష్కారాలను అన్వేషించడం భారత ప్రజాస్వామ్య పరిపక్వతకు నిదర్శనం అవుతుంది. భారత విద్యావ్యవస్థ బలోపేతంకావడం,రాజ్యాంగంపై ప్రజలవిశ్వాసం మరింత పెరగడం, చట్టం మానవీయ విలువల మధ్య సమతుల్యత సాధించడం.అదే నిజమైన ప్రజాస్వామ్య విజయం. అదే భారత రాజ్యాంగస్ఫూర్తి. అదే లక్షలాది మంది ఉపాధ్యాయులు,విద్యార్థులు,సమాజం ఆశించే న్యాయం. ●

# శ్వేతసౌధం మసకబారుతున్న దృశ్యం



సరికొండ రవీంద్రనాథ్

ప్రపంచానికి మకుటాయమానమైన ఆ శ్వేత సౌధం కూలుతున్న దృశ్యం గల్ఫ్‌లో స్పష్టంగా గోచరిస్తోంది. ఇరాన్ యుద్ధంలో అపజయంతోబాటు, గల్ఫ్ నుంచి ఇరవై సైనిక స్థావరాలను ఖాళీ చేయడంతో అమెరికా పతనం ప్రారంభం కాబోతోంది. దాదాపు అర్ధ శతాబ్దంగా పర్షియన్ గల్ఫ్ ప్రాంతం అమెరికా సైనిక వ్యూహానికి కేంద్రంగా ఉంది. బహ్రెయిన్, ఖతార్, కువైట్, యూఏఈ, సౌదీ ఇంకా ఇతర ప్రాంతాలలో ఉన్న అరబ్ దేశాల్లో భారీ అమెరికా స్థావరాలు ఉన్నాయి. చమురు నౌకల రవాణా మార్గాలనునాటి కమ్యూ నిస్టు సోవియట్ యూనియన్ దాడి చేయకుండా రక్షించే నెపంతో అమెరికా సుమారు ఇరవై సైనిక స్థావరాలను గల్ఫ్ ప్రాంతంలో ఏర్పాటు చేసింది. గత ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా ఓటమి అంచులో ఉంది. మూడు రోజుల్లో ఇరాన్‌ను స్వాధీనం చేసుకుం టానని చెప్పిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 110 రోజులైనా ఇరాన్‌ను దారికి తెచ్చుకోలేకపోయాడు. పైగా తన వాచాలత్వంతో నాటో దేశాలను, అరబ్ మిత్ర దేశాలను దూరం చేసుకున్నాడు. అమెరికా ఓటమికి అనేక కారణాలు ఉన్నాయి. అమెరికా శక్తిని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అతిగా ఊహించుకున్నాడు. నాటో, అరబ్ దేశాలు (13)ఇజ్రాయెల్, తను కలిసి దాడి చేస్తే మూడు రోజుల్లో వెనెజులాలాగా ఇరాన్ సాగిలబడి పోతుందని ట్రంప్ కలగన్నాడు. కానీ నాటో మిత్రులుగానీ, అరబ్ దేశాలుగానీ యుద్ధంలో పాల్గొనకుండా ప్రేక్షక పాత్ర వహించాయి. ఇప్పటికే ఆర్థిక మాంద్యాలతో ఇబ్బంది పడుతున్న నాటో దేశాలు ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధం వల్ల వచ్చే అవాంఛనీయ పరిణామాలను ఎదుర్కొనడానికి సిద్ధంగా లేవు.అందుకే ట్రంప్ వ్యక్తిగతంగా దూషించినా బ్రిటన్, ఫ్రాన్స్ అధ్యక్షులు ఇరాన్ వైపు కన్నెత్తి చూడలేదు. ఇక అరబ్ మిత్ర దేశాల వెన్నుపోటును డోనాల్డ్ ట్రంప్ మాత్రమే కాదు. ప్రపంచంలో రాజకీయ పరిశీలకులు ఎవరూ ఊహించలేక పోయారు. 2025 జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్‌ను కాళ్లబేరానికి తీసుకురావడంతో అరబ్ దేశాలకు ఇరాన్‌పై నమ్మకం పెరిగింది. మళ్లీ ఫిబ్రవరి 28న అమెరికా యుద్ధం ప్రారంభించేలోపు అరబ్ దేశాలు ఇరాన్ రహస్యంగా కట్టేసాయి. తాజా యుద్ధంలో అమెరికా సైనిక స్థావరాలను తుక్కుకింద కొట్టేసిన ఇరాన్ అరబ్ భూభాగాలపై కనీసం బజూకారాకెట్లను కూడా ప్రయోగించలేదు. ట్రంప్‌కు తగిలిన మొదటి అతి పెద్ద షాక్ ఇదే. ఇంత కాలం యుద్ధం జరుగుతున్నా అరబ్ దేశాల్లో జనజీవనానికి ఎటువంటి అంతరాయంలేదు. ఇరాన్ దాడిలో కూలిపోవాల్సిన ఖలీఫా టవర్ వెలుగులు



విరజిమ్ముతూనే ఉంది. యుద్ధంలో భారతీయులు సుమారు యాభై మంది చనిపోయారు. కానీ ఒక్క అరబ్ దేశీయుడు కూడా చనిపోలేదు. నాటో నేతలు 'పిరికిపందలు' అంటూ బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేసినా ట్రంప్ సౌదీన యువరాజు సల్మాన్ అబ్దుల్‌ను కూడా బండ బూతులు తిట్టాడు. ఇంగ్లీషులో ఫోర్ లెటర్ వర్డ్ వాడటంతో సల్మాన్ అబ్దుల్‌కు కోపం వచ్చి అమెరికాతో వాణిజ్య లావాదేవీలు రద్దు చేస్తున్నట్టు ప్రకటించాడు. నిన్నటి వరకూ సన్నిహితంగా ఉన్న సౌదీ మూటాముల్లే సర్దుకుని వెళ్లిపొమ్మని అమెరికాకు దారి చూపెడుతోంది. అమెరికా సైనికుల సంఖ్య 13 లక్షలు. కాగా గల్ఫ్ సైనిక స్థావరాల్లో 50 వేలమందిని మోహరించింది. దేశ రక్షణ బడ్జెట్ 800 బిలియన్ డాలర్లలో 60 బిలియన్ డాలర్లు గల్ఫ్‌లో వ్యయం చేస్తోంది. ఆదాయం చెప్పుకోడానికి ఏమీ లేదు. గల్ఫ్ ఆదా చేసిన డబ్బును నౌకాదళ విస్తరణ, సెమీకండక్టర్ పెట్టుబడులు, ఎఐ రక్షణ, సాంకేతికత అభివృద్ధికి కేటాయించవచ్చని నిపుణులు ట్రంప్‌కు హితవు చెబుతున్నారు. అంటే 'మనకు యుద్ధాలు చేయడం రాదు. నోర్మూసుకుని కూర్చో' అని చెప్పడం అన్నమాట. ప్రతిరోజూ రెండు బిలియన్ డాలర్లు ఖర్చవుతున్నాయి. ఇరాన్ దాడుల్లో ఫిఫ్త్ ఫ్లీట్‌తో సహా రాడార్‌లు అన్నీ ధ్వంసం అయ్యాయి. గల్ఫ్ నుంచి అమెరికా పారిపోతే అంతర్జాతీయంగా తీవ్ర మార్పులు చోటు చేసుకుంటాయి. గల్ఫ్‌లో చైనా, రష్యాల, భారత్‌ల ప్రభావం పెరుగుతుంది. అమెరికా గుత్తాధిపత్యం పోయి స్వేచ్ఛా వాతావరణం నెలకొంటుంది. విశ్వవ్యాప్తంగా ఈ ప్రభావం ఉంటుంది. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, ఇతర దేశాలు సొంత రక్షణ వ్యవస్థలను సమకూర్చుకోవాల్సిందే. గల్ఫ్ దేశాలు డాలర్‌ను వదిలి ఇతర కరెన్సీలలో వ్యాపారాలు చేస్తాయి.డాలర్ విలువ తగ్గడం మొదలవుతుంది. పారిశ్రామిక వేత్తలు అమెరికా సెక్యూరిటీలు కొనడం మానేసి అమ్మకం మొదలుపెడతారు. దీనితో డాలర్ మారకం విలువ పడిపోయి అమెరికా అప్పులు రెట్టింపు అవుతాయి. చివరగా ప్రపంచానికే శిఖరాయమానమైన శ్వేతసౌధ రాజకీయ ప్రాభవం మసకబారుతుంది. అమెరికా వదిలి వెళ్లిపోతే అరబ్ దేశాలపైకూడా దాని ప్రభావం ఉంటుంది.ఇది గమనించి సౌదీఅరేబియా విజన్2030 లో భాగంగా చమురుపై వచ్చే ఆదాయానికిబదులుగా టూరిజం, టెక్నాలజీ,లాజిస్టిక్స్, తయారీ పరిశ్రమలపై ఆదాయం పెంచుకోవాలని ప్రయత్నిస్తోంది. అరబ్ దేశాలకు ముఖ్యంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్‌లకు భద్రత ఉండదు.ఇజ్రాయెల్ ముప్పు ఉంటుంది. ఈ కారణంగా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రారు. వచ్చినా అనేక షరతులు విధిస్తారు. ప్రస్తుతం అన్ని ఒడుదుడుకులను ఎదుర్కొని చైనా మాత్రమేగల్ఫ్ ప్రాంతంలోని పోర్టులు, రిఫైనరీలు,టెలికం, ఇంకా ఇతర మౌలికరంగాలలో పెట్టుబడులు పెడుతోంది.అమెరికా నిష్క్రమించడం చైనాకు ప్రధానంగా కలిసి వచ్చే అవకాశం కాగలదు. ●

# పబ్‌లో అగ్నిప్రమాదం: 27 మంది మృతి

## 22 మంది పరిస్థితి ఆందోళనకరం

**బ్యాంకాక్,జులై 13:** థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం దేశాన్ని విషాదంలో ముంచెత్తింది. నగరంలోని ఒక ప్రముఖ పబ్‌లో సంభవించిన ఈ ప్రమాదంలో కనీసం 27 మంది మరణించగా, మరో 63 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు బ్యాంకాక్ గవర్నర్ వెల్లడించారు. అధికారుల సమాచారం ప్రకారం, నగర ఉత్తర భాగంలోని పబ్ లో అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. కొద్ది నిమిషాల్లోనే మంటలు భవనం మొత్తం వ్యాపించడంతో అక్కడ ఉన్న ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలను కాపాడుకునేందుకు పలువురు బయటకు పరుగులు తీయగా, మరి కొందరు భవనం లోపలే చిక్కుకుపోయారు. ఘటన స్థలాన్ని సందర్శించిన థాయ్ ప్రధానమంత్రి అనుటిన్ చార్న్‌విరాకుల్ మృతుల సంఖ్యను ధృవీకరించారు. ఆయన మాట్లాడుతూ, 'ఇప్పటివరకు 27 మంది మరణించారు. గాయపడిన చాలా మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది' అని తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలలో పబ్ ప్రధాన ద్వారం నుంచి భారీగా మంటలు



ఎగిసిపడుతున్న దృశ్యాలు కనిపించాయి. అదే సమయంలో లోపల ఉన్న ప్రజలు ప్రాణరక్షణ కోసం పరుగులు తీస్తూ బయటకు వస్తున్న దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం, చాటుచాక్ జిల్లాలోని రోంగ్ బీర్ నా లాట్ ఫ్రావో అనే పబ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది మొదట కాలిన గాయాలతో ఉన్న ఒక వ్యక్తిని రక్షించినప్పటికీ, అనంతరం భవనం లోపల అనేక మంది చిక్కుకుపోయినట్లు గుర్తించారు. మంటల నుంచి తప్పించుకోవడానికి పలువురు పబ్‌లోని మరుగుదొడ్లలో దాక్కున్నారని సమాచారం. దట్టమైన పొగ, వేగంగా వ్యాపించిన మంటల కారణంగా వారు బయటకు రాలేకపోయారు. మృతులలో అధికశాతం మంది టాయిలెట్ ప్రాంతంలోనే లభించినట్లు అధికారులు భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అనేక అగ్నిమాపక బృందాలు వాటర్ కెనాన్ల సహాయంతో సుమారు 30 నిమిషాలపాటు శ్రమించి మంటలను అదుపు లోకి తెచ్చాయి. ప్రమాదం అనంతరం విడుదలైన చిత్రాలలో పబ్ లోపలి భాగం పూర్తిగా కాలిపోయి బూడిదగా మారినట్లు కనిపించింది. కాలిపోయిన బల్లలు, కుర్చీలు, శిథిలాల మధ్య సహాయక బృందాలు గంటల తరబడి సహాయక చర్యలు నిర్వహించాయి. ఈ ఘటనతో థాయ్ లాండ్‌లోని పబ్‌ల భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొద లైంది. పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ప్రస్తుతం ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. మంటలు ఇంత వేగంగా ఎందుకు వ్యాపించాయనే అంశంతో పాటు, పబ్‌లో తగిన అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా లేదా అనే విషయాలను కూడా పరిశీలిస్తున్నారు.



## జైషే మహిళా ఉగ్రవాద నెట్‌వర్క్ భగ్నం

### నిఘా వర్గాలు ఛేదించిన భారీ కుట్ర

**న్యూఢిల్లీ,జులై 13:** పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జెఇఎం) ఉగ్రవాద సంస్థ, భారత్ లో విధ్వంసం సృష్టించేందుకు సరికొత్త, అత్యంత ప్రమాదకరమైన పన్నాగం పన్నింది. ప్రేమ, పెళ్లి పేరుతో భారతీయ మహిళలను వలలో వేసి, వారిని పాకిస్థాన్‌కు తరలించి, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించుకోవాలని చూస్తోంది. ఈ కుట్రను భారత నిఘా వర్గాలు (ఐబీ) ఛేదించాయి. జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలో గతేడాది అక్టోబర్‌లో ఏర్పాటైన జమాత్‌ఉల్‌మోమినాత్ అనే మహిళా విభాగం ఈ కుట్రకు కేంద్రంగా పనిచేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఐబీ అధికారుల కథనం ప్రకారం ఈ ఉగ్రముఠాలోని యువకులు భారతీయ మహిళలతో సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుంటున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంలో నివసించే మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సుమారు ఆరు నెలల పాటు వారితో ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ, ప్రేమ నటిస్తూ నమ్మకం పెంచుతారు. తాము నిజమైన ప్రేమలో ఉన్నామని, పెళ్లి చేసుకుని మంచి జీవితం ఇస్తామని నమ్మిస్తారు. ఈ సమయంలో గూఢచర్యానికి సంబంధించిన సున్నితమైన ప్రశ్నలు ఏవీ అడగకుండా జాగ్రత్తపడతారు. పూర్తిగా వారిని నమ్మించి, పెళ్లికి ఒప్పించిన తర్వాత పాకిస్థాన్‌కు రప్పించేందుకు ప్రయత్నిస్తారు. పాకిస్థాన్‌కు చేరాక, వారిని ఉగ్రవాద భావజాలంతో నింపి, గూఢచారులుగా మార్చి తిరిగి భారత్‌కు పంపేందుకు ప్లాన్ చేస్తున్నారు. గతంలో ఇలాంటి కార్యకలాపాలు జమ్మూకశ్మీర్‌కే పరిమితం కాగా, ఇప్పుడు ఉగ్రవాదులు తమ దృష్టిని రాజస్థాన్‌పైకి మార్చారు. పాకిస్థాన్‌తో రాజస్థాన్‌కు 1,070 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉండటమే దీనికి ప్రధాన కారణం. శ్రీ గంగానగర్ నుంచి బార్మర్ వరకు విస్తరించిన ఈ సరిహద్దు ప్రాంతాల్లోని యువతుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను ఐఎస్ఐ మద్దతు ఉన్న ఉగ్రవాదులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

# రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సుప్రీం నోటీసు

### 'సిట్'‌ నివేదిక అందివ్వాలని యుపి ప్రభుత్వానికి ఆదేశాలు

### విచారణ జులై 20కి వాయిదా

**న్యూఢిల్లీ, జులై 13:** రామ మందిర విరాళాల దుర్వినియోగం కేసుపై కొనసాగుతున్న దర్యాప్తుకు సంబంధించి స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)కి అప్పగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం, శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ల వాదనలను కోరింది. కేంద్ర, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాల తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వారికి అధికారికంగా జ్యుడీషియల్ నోటీసు జారీ చేయవద్దని చేసిన అభ్యర్థనతో భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌నేతృత్వంలోని ముగ్గురున్యాయ మూర్తుల ధర్మాసనం ఏకీభవించింది. కేవలం ట్రస్ట్‌కు మాత్రమే అధికారిక జ్యుడీషియల్ నోటీసు జారీ చేయడానికి కోర్టు పరిమితమైంది.

**నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించాలి:** తాను ఇప్పటికే కోర్టు గదిలో ఉన్నానని, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని మెహతా తెలిపారు. కేసు దర్యాప్తుకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును సీల్డ్ కవర్‌లో సమర్పిస్తానని న్యాయాధికారి ముందుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటుచేసిందని, అరెస్టులతో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని ఆయన అన్నారు. దీనికి అంగీకరిస్తూ, సిట్ కూర్పువివరాలు స్టేటస్‌రిపోర్టులో ఉండాలని,తదుపరి విచారణ తేదీ అయిన జులై20నదానిని దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

# ఇరాన్ హిట్‌లిస్ట్‌లో 13 మంది విదేశీ నేతలు

### ప్రతీకార నప్రతిజ్ఞ చేసిన సుప్రీం లీడర్



**టెహ్రాన్,జులై 13:** ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల అధినేతలే లక్ష్యంగా ఒక హిట్‌లిస్ట్‌ను హమ్‌షహ్రీ అనే పత్రిక విడుదల చేసింది. రాజధాని టెహ్రాన్ అధికార వర్గాల ఆధ్వర్యంలో నడిచే హమ్‌షహ్రీ అనే వార్తాపత్రిక 13 మంది విదేశీ నేతల ఫొటోలతో కూడిన ఒక ఇన్ఫోగ్రాఫిక్‌ను నిన్న రాత్రి ఆన్‌లైన్‌లో ప్రచురించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఫిబ్రవరి 28న మధ్యప్రాచ్య యుద్ధం మొదటి రోజున అమెరికా ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన తర్వాత సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మొజ్తబా ఖమేనీ ప్రతీకార ప్రతిజ్ఞ చేశారు. ప్రతీకారం తీర్చుకోవడం మా జాతి సంకల్పం. అది కచ్చితంగా నెరవేరుతుంది. జాబితాలో పేర్లున్న ఈ నేరస్థులు మంచం మీదే ప్రశాంతంగా చనిపోవాలన్న కోరికను తమతో పాటే సమాధిలోకి తీసుకువెళతారని తన తండ్రి అంత్యక్రియల తర్వాత మొజ్తబా హెచ్చరించారు. అయితే, ఆయన తన సందేశంలో ఎవరి పేర్లనూ బయటపెట్టలేదు. హమ్‌షహ్రీ పత్రిక విడుదల చేసిన జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బ్రిటన్ ఆపద్ధర్మ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌ల పేర్లు ఉన్నాయి. వీరితో పాటు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. అయితే, పత్రిక ప్రింట్ ఎడిషన్‌లో ఈ జాబితా కనిపించకపోవడం గమనార్హం. ఇది కేవలం పత్రిక ప్రచురించిన జాబితానే తప్ప, ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది కాదని తెలుస్తోంది. యుద్ధ సమయంలో తమ భూభాగంపై జరిగిన దాడులను ఖండించడంలో యూరప్ దేశాలు విఫలమయ్యాయని, అమెరికా సైనిక విమానాలకు తమ గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతినిచ్చి ఆ నేరంలో పాలుపంచుకున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా, యుద్ధానికి ముందు నుంచే కనిపించకుండా పోయిన మొజ్తబా ఖమేనీ తన తండ్రిపై జరిగిన దాడుల్లో గాయపడినట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే.



## ఎసి కోచ్‌లలో చోరీల ద్వారా రూ.104.51 కోట్ల నష్టం: ఐఆర్‌సిటిసి

**న్యూఢిల్లీ,జులై 13:** భారతీయ రైల్వే లోని రైళ్ల ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు అందించే బెడ్‌రోల్ సామగ్రి భారీ స్థాయిలో చోరీకి గురవుతోంది. కొవిడ్ అనంతరం 2022 జనవరి నుంచి 2026 మే వరకు నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా టవళ్లు, దిండ్లు, దుప్పట్లు వంటి కనీసం 1.27 కోట్ల వస్తువులు మాయమైనట్లు ఆర్‌టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. సమాచార హక్కు దరఖాస్తుకు 69 రైల్వే డివిజన్లలో 54 డివిజన్లు స్పందించగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రజా ఆస్తులపట్ల నిరక్ష్య ధోరణిని ఇది ప్రతిబింబిస్తోందని విమర్శలు వస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో టవల్‌లు, దిండ్లు, దుప్పట్ల వంటి వస్తువుల చోరీ కారణంగా బెడ్‌రోల్ కాంట్రాక్టర్లకు సుమారు రూ.104.51 కోట్ల నష్టం వాటిల్లింది. 2022తో పోలిస్తే 2025 నాటికి ఇలాంటి దొంగతనాలు 56 శాతం పెరిగినట్లు వెల్లడైంది. ఈ సమస్యను రైల్వే అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారని, దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రయాణికులు అత్యధికంగా చోరీ చేసిన వస్తువుల్లో ఫేస్ టవల్ మొదటి స్థానంలో నిలిచింది. నాలుగేళ్లలో 46.54 లక్షల ఫేస్ టవల్స్ మాయమయ్యాయి. వాటి తర్వాత 41.13 లక్షల బెడ్‌షీట్లు, 23.59 లక్షల పిల్లో కవర్లు, 12.95 లక్షల దుప్పట్లు చోరీకి గురయ్యాయి. మరోవైపు బ్యాగులో సులభంగా పెట్టుకోలేని కారణంగా దిండ్లు అత్యల్పంగా చోరీకి గురయ్యాయి.

రైల్వే డివిజన్ల వారీగా చూస్తే బికనేర్ డివిజన్‌లో అత్యధికంగా 25.76 లక్షల వస్తువులు చోరీకి గురయ్యాయి. తర్వాత రాంచీ (9.31 లక్షలు), ఢిల్లీ (8.21 లక్షలు), ముంబై (8.17 లక్షలు), జోధ్‌పూర్ (8.09 లక్షలు), అహ్మదాబాద్ (6.94 లక్షలు) డివిజన్‌లు ఉన్నాయి. పంపిణీ బాధ్యత నిర్వహించే ఏజెన్సీలే ఈ వస్తువుల లెక్కలు చూసుకోవాల్సి ఉంటుందని, కొరత ఏర్పడితే ఆర్థిక భారం కూడా వారిపైనే పడుతుందని రైల్వే ప్రతినిధి తెలిపారు.

# అక్టోబరు 27న ఇజ్రాయెల్ పార్లమెంటుకు ఎన్నికలు

**టెల్ అవీవ్,జులై 13:** ఇజ్రాయెల్‌లో తదుపరి సార్వత్రిక ఎన్నికలు 2026 అక్టోబర్ 27న నిర్వహించనున్నట్లు ఆ దేశ పార్లమెంట్‌నెస్సెట్ అధికారికంగా ప్రకటించింది. చట్టప్రకారం నిర్ణయించిన గడువు మేరకు ఈ ఎన్నికలు జరగనున్నాయని, ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం పూర్తవుతున్నందున పార్లమెంట్‌ను ముందుగానే రద్దు చేసే అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో ముందస్తు ఎన్నికలపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. ఇజ్రాయెల్ రాజకీయ చరిత్రలో ఈ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గత దాదాపు 40 ఏళ్లలో వివాదాల కారణంగా వాయిదా పడకుండా, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. అలాగే ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం గత 50 ఏళ్లలో పూర్తి నాలుగేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తొలి ప్రభుత్వంగా నిలవనుంది. ఈ ఏడాది మే నెలలో పార్లమెంట్‌ను రద్దుచేసి ముందస్తు ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన వచ్చినప్పటికీ, అది ఆమోదంపొందకపోవడంతో ప్రభుత్వం తనపూర్తి పదవీకాలాన్ని కొనసాగించింది. 2023 అక్టోబర్‌లో హమాస్ దాడి అనంతరం గాజా, లెబనాన్,ఇరాన్‌లతో జరిగిన యుద్ధాల నేపథ్యంలో జరగనున్న తొలిసార్వత్రిక ఎన్నికలు కావడంతో, ఈ ఎన్నికలను ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నాయకత్వంపై జరిగే ప్రజాభిప్రాయ సేకరణగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# తమిళనాడులో గోవధ నిషేధం కేసు

### మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే



**న్యూఢిల్లీ, జులై 13:** 1976 నాటి ప్రభుత్వ ఉత్తర్వును అమలు చేయడం ద్వారా తమిళనాడులో గోవధపై రాష్ట్రవ్యాప్త నిషేధాన్ని తక్షణమే అమలు చేయాలని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలును సుప్రీంకోర్టు సోమవారం నిలిపివేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం, తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన 'స్పెషల్ లీవ్ పిటిషన్'‌పై నోటీసులు జారీ చేయడంతో పాటు హైకోర్టు తీర్పు అమలుపై స్టే విధించింది. విచారణ సందర్భంగా, ఆ తీర్పు అమలును నిలిపివేసే మధ్యంతర ఉత్తర్వును జారీ చేయడానికి ముందు, సదరు తీర్పులో "సవరణ" అవసరమని జస్టిస్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. బక్రీద్ పండుగ సమయంలో లేదా మరే ఇతర రోజునైనా రాష్ట్రంలో ఎక్కడా ఆవు లేదా దూడను వధించకుండా చూడాలని ప్రధాన కార్యదర్శిని, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను ఆదేశిస్తూ మద్రాస్ హైకోర్టు మే 27న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తమిళనాడులో పశువుల వధకు సంబంధించిన చట్టపరమైన నిబంధనల పరిధిని మించి హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో వాదించింది.

# దేశవ్యాప్తంగా గోవధ నిరోధక చట్టం అమలు చేయాలి

### సుప్రీంకోర్టులో పిల్.. విచారణకు నిరాకరణ

**న్యూఢిల్లీ, జులై 13:** గోవధ నిరోధక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా వధశాలలను నియంత్రించాలని ఆదేశాలు కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) సుప్రీంకోర్టు సోమవారం ఉపసంహరించుకున్నట్లుగా కొట్టివేసింది. ఇప్పటికే ఉన్న ఏదైనా కోర్టు ఉత్తర్వును ఉల్లంఘించిన పక్షంలో, ధిక్కారచర్యలను ప్రారంభించడమే సరైన పరిష్కారమని పేర్కొంది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి నిరాకరించింది. "ఏదైనా ఉత్తర్వును ఉల్లంఘించినట్లయితే, ధిక్కార పిటిషన్ దాఖలు చేయండి" అని జస్టిస్ మెహతా నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. స్టేట్ ఆఫ్ గుజరాత్ వర్సెస్ మీర్జాపూర్ మోతీ ఖురేషీ కస్సాబ్ జమాత్ (2005) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గోవధ వ్యతిరేక చట్టాలను అమలు చేయాలని కేంద్రాన్ని, అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను (యుటిలను) ఆదేశిస్తూ మాండమస్ రిట్ జారీ చేయాలని ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్) కోరింది. అంతేకాకుండా, వధశాలల నియంత్రణకు మార్గదర్శకాలను జారీ చేయాలని, ప్రస్తుతం ఉన్న వధ వ్యతిరేక చట్టాలను ఉల్లంఘించే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని కూడా ఆదేశించాలని కోరుతూ న్యాయవాది బరున్ కుమార్ సిన్హా ఈ పిటిషన్ దాఖలు చేశారు.

## భార్య విసిరిన మొబైల్ తలకు తగిలి భర్త మృతి

**భువనేశ్వర్/బలాంగీర్:** ఒడిశాలోని బలాంగీర్ జిల్లాలో కుటుంబ కలహం విషాదాంతానికి దారితీసింది. దంపతుల మధ్య జరిగిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చగా, భార్య ఆగ్రహంతో మొబైల్ ఫోన్‌ను భర్తపై విసిరినట్లు తెలుస్తోంది. ఆ ఫోన్ తలకు బలంగా తగలడంతో అతడు తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు వెంటనే బలాంగీర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి (డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్) తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించగా ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని భావించి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే అతని ఆరోగ్య పరిస్థితి విషమించగా మరోసారి అత్యవసర చికిత్స కోసం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ అతని ప్రాణాలను కాపాడలేకపోయారు. చివరకు అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# 'నేను గాంధీజీని కాను..మళ్లీ చంపేస్తా'

### దోషిగా తేలిన వ్యక్తి కేరళ కోర్టులో వ్యాఖ్యలు



**ప్యాలక్కాడ్, జులై 13:** "మీరు కావాలంటే నన్ను ఉరితీయండి, నాకేమీ అభ్యంతరం లేదు. అవసరమైతే నేను మరికొందరిని కూడా అంతం చేస్తాను. నేను గాంధీజీని కాన్లు" అని జంట హత్యల కేసులో దోషిగా తేలిన చెంతమర ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం పాలక్కాడ్ అదనపు సెషన్స్ కోర్టు అతన్ని దోషిగా నిర్ధారించిన కొద్దిసేపటికే అతను ఈ వ్యాఖ్యలు చేశాడు. శిక్షను ఖరారు చేసే ముందు ఏమైనా చెప్పదలచుకున్నారా అని న్యాయమూర్తి అడిగినప్పుడు, ఆ హంతకుడిలో ఎలాంటి పశ్చాత్తాపం గానీ, విచారం గానీ కనిపించలేదు. దానికి బదులుగా, అతను తన చర్యలను సమర్థించుకున్నాడు. "నేను అనుభవించిన పరిస్థితులను మీరూ ఎదుర్కొని ఉంటే, బహుశా మీరు కూడా నేను చేసిన పనే చేసేవార్లు" అని కోర్టుతో చెప్పి, "మీకు సరైనదనిపించిన శిక్షను విధించండ్లి" అని అన్నాడు. ఈ కేసులో బుధవారం శిక్షను ఖరారు చేయనున్నారు. కేరళలో జరిగిన అత్యంత దారుణమైన ప్రతీకార హత్యల కేసుల్లో ఒకదాని విచారణ ఈ తీర్పుతో ముగిసింది. పాలక్కాడ్ జిల్లాలోని పోతుండిలో జనవరి 27, 2025న సుధా కరన్, అతని 75 ఏళ్ల తల్లి లక్ష్మిని హత్య చేసినట్లు చెంతమరపై అభియోగాలు నమోదయ్యాయి. తన వివాహ బంధం విచ్ఛిన్నం కావడానికి కారణమని భావించి, 2019లో తన పొరుగింటి మహిళ సజితను నరికి చంపడంతో మొదలైన పగకు ఈ హత్య లు పరాకాష్టగా నిలిచాయి. ఆ కేసులో దోషిగా తేలి రెండుసార్లు జీవిత ఖైదు శిక్ష పడినప్పటికీ, అతను 2022లో బెయిల్‌పై విడుదలయ్యాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, చెంతమర బెయిల్ షరతులను ఉల్లంఘించి, మరింత ప్రతీకారం తీర్చుకునేందుకు రహస్యంగా పోతుండికి తిరిగి వచ్చాడు. ముందుగానే సమకూర్చుకున్న కొడవలితో, ఇంటి బయట ఉన్న సుధాకరన్‌ను నరికి చంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొడుకు ఆర్తనాదాలు విని బయటకు వచ్చిన లక్ష్మిపై కూడా అతను దాడి చేశాడు. హత్యల తర్వాత చెంతమర సమీపంలోని మట్టాయి అడవిలోకి పారిపోయాడు, అక్కడ రెండు రోజుల పాటు సాగిన ముమ్మర గాలింపు తర్వాత పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. ఈ జంట హత్యలు ఒక పెద్దకుట్రలో భాగం మాత్రమేనని దర్యాప్తు అధికా రులు తర్వాత వెల్లడించారు. అతని 'హిట్ లిస్ట్'లో విడిపోయిన భార్య, కుమార్తె, పోలీస్ అధికారి అయిన అల్లుడు, బావమరిది, స్థానికంగా ఉన్న మరో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీసులు ఆరోపించారు. విచారణ సమయంలో 132మంది సాక్షులలో నలుగురు ఫిరాయించిన ప్పటికీ, ఫోరెన్సిక్, శాస్త్రీయ ఆధారాలతో కూడిన ప్రాసిక్యూషన్ 480పేజీల ఛార్జిషీట్ నిర్ణయాత్మకంగా నిలిచింది. కోర్టు వెలుపల, సుధాకరన్ కుటుంబం తాము ఇంకా భయంతోనే బతుకుతున్నా మని, కేరళను దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ నేరానికి మరణశిక్ష కంటే తక్కువ ఏదీ న్యాయం చేకూర్చదని చెబుతూ, మరణశిక్ష విధిం చాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది.

# మన్మోహన్‌సింగ్ ఆత్మహత్య చేసుకుంటానన్నారు

### మాజీ సిఇసి ఎస్‌వై ఖురేషి పుస్తకంలో ప్రస్తావన



**న్యూఢిల్లీ,జులై 13:** మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఎస్‌వై ఖురేషీ తన కొత్త పుస్తకం "నేను నాభారత్..100 తీపిగుర్తులు" పేరిట రాసిన పుస్తకంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు సంబంధించి ఓ ఆసక్తికర సంఘటనను వెల్లడించారు. 2012 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘంపై కొందరు కేంద్ర మంత్రులు చేసిన వ్యాఖ్యలపై తాను తీవ్ర ఆందోళన వ్యక్తం చేశానని, ఆ విషయం తెలుసుకున్న మన్మోహన్ సింగ్ తనను అత్యవసరంగా కలవాలని కోరినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను 4.5 శాతం నుంచి 9 శాతానికి పెంచుతామని అప్పటి కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్ యూపీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లో ఉన్న సమయంలో కొత్త హామీలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. నాలుగు రోజుల పాటు ఇరుపార్టీల వాదనలు విన్న ఎన్నికల సంఘం ఖుర్షీద్‌ను తప్పుబడు తూ కఠిన చర్యలు తీసుకుంది. అనంతరం కొందరు కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘం అహంకారంగా వ్యవహరి స్తోందంటూ వ్యాఖ్యలు చేశారని ఖురేషీ తెలిపారు. ఎన్నికల సంఘంపై మంత్రుల వ్యాఖ్యలు సంస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని ఖురేషీ అప్పటి ప్రధానమంత్రి మీడియా సలహాదారు హరీష్ ఖరేకు వివ రించారు. మరుసటి రోజే ప్రధానమంత్రి కార్యా లయం నుంచి ఫోన్ రావడంతో సాయంత్రం మన్మోహన్ సింగ్‌ను ఆయన కలిశారు. ఆ సందర్భంగా మన్మోహన్ సింగ్ తీవ్ర ఆవేదనతో హరీశ్ చెప్పింది నిజమైతే మీరు అలా అనుకుంటే నేను ఆత్మ హత్య చేసుకుంటా అని చెప్పారని ఖురేషీ తన పుస్తకంలో పేర్కొ న్నారు. ఆ వ్యాఖ్యలు తన గురించికాదని, కొందరు మంత్రుల ప్రవర్తన గురించేనని వివరిం చగా నాకు ఈ విషయం అసలు తెలియదు. తెలిసి ఉంటే వారిని తీవ్రంగా మందలించేవాణ్ని. ఇకపై ఏ సమస్య ఉన్నా నేరుగా నాకు ఫోన్ చేయండి అని మన్మోహన్ సింగ్ చెప్పినట్లు వెల్లడించారు.

# పింఛన్ కోసం వెళితే బ్యాంకు ఖాతాలో రూ.1500 కోట్లు

**ముజఫరాపూర్,జులై 13:** వృద్ధాప్య పింఛను, దివ్యాంగ పింఛను తీసుకునేందుకు బ్యాంకు కేంద్రానికి వెళ్లిన తండ్రీకొడుకులు తమ ఖాతాల్లో కనిపించిన భారీ మొత్తంచూసి అవాక్కయ్యారు. బీహార్ లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. సక్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాటియా సిహో గ్రామానికి చెందిన కామేశ్వర్ మిశ్రా తన వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు గ్రామంలోని సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) కేంద్రానికి వెళ్లారు. ఆయనతో పాటు దివ్యాంగ పింఛను పొందుతున్న కుమారుడు కూడా ఉన్నాడు. పింఛను నగదు తీసుకున్న అనంతరం ఇద్దరూ తమ బ్యాంకు ఖాతాల్లో మిగిలిన బ్యాలెన్స్‌ను పరిశీలించగా, అక్కడ కనిపించిన మొత్తం వారిని అవాక్కయ్యేలా చేసింది. బ్యాంకు ఖాతా వివరాల ప్రకారం, కామేశ్వర్ మిశ్రా ఖాతాలో సుమారు రూ.759 కోట్లకు పైగా బ్యాలెన్స్ కనిపించింది. ఇదే తరహాలో ఆయన కుమారుడి ఖాతాలో కూడా దాదాపు అంతే మొత్తం నమోదై రూ.1,500 కోట్లకు పైగా బ్యాలెన్స్ కనిపించింది. ప్రస్తుతం ఈ ఘటనకు గల అసలు కారణం తెలియరాలేదు. బ్యాంకింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపం లేదా సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా ఈ భారీ మొత్తం ఖాతాల్లో కనిపించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# సంక్షిప్త వార్తలు

## ఉక్రెయిన్ ప్రధాని యులియా రాజీనామా



**కీవ్, జులై 13:** ఉక్రెయిన్ ప్రధాని యులియా స్విరిడెంకో రాజీనామా చేశారు. ఉక్రెయిన్ మంత్రి మండలిలో ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ భారీ మార్పులు చేశారు. దీంతో ఆమె తప్పుకున్నారు. అధ్య క్షుడు జెలెన్‌స్కీ తనకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు ఆమె చెప్పారు. గతంలో ఉక్రెయిన్ ఆర్థిక మంత్రిగా స్విరిడెంకో చేశారు. అయితే 2005 జులైలో ఆమెకు ప్రధాని బాధ్యతలు అప్పగించారు. అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఖనిజ ఒప్పందంలో కీలక పాత్ర పోషించినట్లు ఆమెపై గతంలో ఉక్రె యిన్ ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. సంక్లిష్ట సమయంలో ఉక్రెయిన్‌కు నాయకత్వం వహిం చడం గౌరవంగా భావిస్తున్నట్లు స్విరిడెంకో తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు.

## డ్రాగన్ విస్తరణ వాదం అక్రమమే: 14 దేశాల ప్రకటన



**మనీలా, జులై 13:** వివాదాస్పద దక్షిణ చైనా సముద్రప్రాంతంలో చైనా ప్రాదేశిక విస్తరణ యత్నాలు అంతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని అమెరికా, బ్రిటన్,మరో 12 దేశాలు పేర్కొన్నాయి. చైనా వ్యవహరిస్తున్న తీరు ప్రాంతీయ సుస్థిరతకు విఘాతం కలిగిస్తోందని తెలిపాయి. బీజింగ్ చర్యలను సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ఐక్యరాజ్య సమితి సముద్ర చట్ట ఒప్పందం ప్రకారం ద హేగ్‌లో ఏర్పాటైన వివాద పరిష్కార న్యాయస్థానం (ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్) 2016 జులై 12న వెలువరించిన తీర్పును ఆ ప్రకటన గుర్తు చేసింది. గుర్తించిన చైనా ప్రాదేశిక ప్రాంతాలకు వెలుపల, దక్షిణ చైనా సముద్ర జలాల్లోని వనరులపై చైనాకు ఎలాంటి హక్కులు లేవని పదేళ్ల నాటి ఆ తీర్పు పేర్కొంది.

## రామ్‌దేవ్ బాబా వ్యాఖ్యలపై విపక్షాల దుమారం



**న్యూఢిల్లీ,జులై 13:** యోగా గురువు బాబా రాందేవ్ చేసిన 'హిందూ రాష్ట్రం' వ్యాఖ్యలు దేశవ్యా ప్తంగా రాజకీయ, మతపరమైన చర్చలకు దారితీశాయి. భారతీయులందరి పూర్వీకులు ఒక్కరేనని, అందువల్ల హిందూ రాష్ట్రం అనే భావనపట్ల మైనారిటీలు ఆందోళన చెందాల్సి న అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. రాందేవ్ వ్యాఖ్యలపై విపక్ష నేతలు, మత పెద్దల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొన్న బాబా రాందేవ్, 2009లో తాను ఇస్లామిక్ దేవ్‌బంద్‌ను సందర్శించిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు.

## మానససరోవర్ యాత్రలో యమద్వార్ కీలకఘట్టం



**డెహ్రాడూన్,జులై 13:** ప్రపంచంలో అత్యంత పవిత్రమైన తీర్థయాత్రల్లో కైలాస మానససరోవర యాత్రలో తొలి ఆధ్యాత్మిక ఘట్టంగా నిలిచేది యమద్వారం. టిబెట్‌లోని నగారి ప్రాంతంలో, దర్చెన్‌కు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో 4,750 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రదేశం కైలాస యాత్ర ప్రారంభ బిందువుగా భావిస్తారు. పాప విముక్తికి సంకేతం యమద్వారం అంటే యమ ధర్మరాజు ద్వారం అనిఅర్థం. ఈ ద్వారంలోనుంచి వెళ్లడం వల్ల భౌతిక బంధాలను విడిచిపెట్టి ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగుపెట్టినట్లుగా భావిస్తారు.

## ఎర్రకోట పేలుళ్ల కేసు మృతుల అంత్యక్రియలకు ఢిల్లీ కోర్టు అనుమతి



**న్యూఢిల్లీ, జులై 13:** గత నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారుబాంబు పేలుడులో మరణిం చిన 11 మందికి సంబంధించిన అవశేషాలను దహనం చేయడానికి నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ (ఎన్ఐఎ)కి ఢిల్లీకోర్టు సోమవారం అనుమతినిచ్చింది. ఆత్మాహుతి దాడిలో మరణించిన, పేలుడు పదార్థాలతో నిండిన కారు డ్రైవర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సంబంధించిన శరీర భాగాలను కూడా దహనం చేయడానికి ప్రత్యేక న్యాయమూర్తి పితాంబర్‌దత్ అనుమతించారు. బాధితుల మతప రమైన విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని, వారి శరీర భాగాలను పూర్తి గౌరవంతో దహనం చేయాలని కోర్టు పేర్కొంది.

## విమాన చార్జీల దోపిడీపై సుప్రీం సీరియస్

**న్యూఢిల్లీ, జులై 13:** విమాన టిక్కెట్ల ధరలలో ఏకపక్ష, మితిమీరిన హెచ్చుతగ్గులను అరికట్టేందుకు చర్యలు కోరుతూ దాఖలైనపిటిషన్‌పై విచారణ జరుపుతూ, ఛార్జీలను నియంత్రించడానికి రూపొందించిన నిబంధనల ప్రతిని తమ ముందు ఉంచాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాన్ని జారీ చేసింది.

## సింగరేణి అధికారుల సమస్యలపై సత్వరమే సానుకూల నిర్ణయం

### డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** సింగరేణిలో పనిచేస్తున్న అధికా రులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. ఈ మేరకు సోమవారం ఆనతో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 2,200 మంది అధికారుల వేతన సవరణ, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ అమలు ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సంస్థ కార్మికులు, అధికారులు విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు, పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఈ భేటీలో సింగరేణి డైరెక్టర్ పోట్రు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రపంచంలో టాప్-4

### కుటుంబాలకు అత్యంత అనుకూల విమానాశ్రయం

**శంషాబాద్, జులై 13, ప్రభాతవార్త :** యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రముఖ ట్రావెల్ ఎక్స్‌పీరియన్స్ ప్రొవైడర్ అట్రాక్షన్ టికెట్స్.కామ్ విడుదల చేసిన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచంలో కుటుంబాలకు అత్యంత అనుకూలమైన విమానాశ్రయాల జాబితాలో 4వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ జాబితాలో స్థానం సంపాదించిన రెండు భారతీయ విమానాశ్రయాల్లో హైదరాబాద్ విమానాశ్రయం ఒకటి. ఈ గుర్తింపు అట్రాక్షన్ టికెట్స్.కామ్ హ్యాపీయెస్ట్ ఎయిర్‌పోర్ట్స్ ర్యాంకింగ్‌లో భాగంగా లభించింది. ఈ అధ్యయనంలో ప్రపంచవ్యాప్తంగా 140కు పైగా విమానాశ్రయాలను కుటుంబాలకు అనుకూలమైన తొమ్మిది ప్రధాన ప్రమాణాల ఆధారంగా విశ్లేషించారు. హైదరాబాద్ విమానాశ్రయం 20 మార్కులకు గాను 18.5 మార్కులు సాధించింది. ఈ మూల్యాంకనంలో గూగుల్ సమీక్షల రేటింగ్‌లు, పిల్లల ఆట స్థలాలు, కుటుంబాల కోసం ప్రత్యేక భద్రతా తనిఖీ లేన్లు, శిశు సంరక్షణ (బేబీచేంజింగ్) సదుపాయాలు, బేబీ స్ట్రోలర్ సేవలు, విశ్రాంతి మరియు నిద్ర కోసం ప్రత్యేక ప్రాంతాలు, వైఫై నాణ్యత, విమానాశ్రయ విస్తీర్ణం, అలాగే న్యూరోడైవర్జెంట్ ప్రయాణికులకు అందించే సౌకర్యాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ తొమ్మిది ప్రమాణాలపై ప్రతి విమానాశ్రయానికి 20 మార్కులలో స్కోరు కేటాయించగా, 2026 మే నెలలో నిర్వహించిన డేటా విశ్లేషణ ఆధారంగా తుది ర్యాంకింగ్‌ను రూపొందించారు. ఈ గుర్తింపు సందర్భంగా జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈఓ కదిర్ కదిరవన్ మాట్లాడుతూ, "ప్రపంచంలో కుటుంబాలకు అత్యంత అనుకూలమైన విమానాశ్రయాల్లో ఒకటిగా గుర్తింపు పొందడం హైదరాబాద్ విమానాశ్రయానికి గర్వకారణమని ఆధునిక ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సమగ్రమైన, ఆలోచనాత్మకమైన, అందరికీ అందుబాటులో ఉండే ప్రయాణ అనుభవాన్ని అందించాలనే మా నిరంతర నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు.

## సర్కారీ విభాగాల అద్దె వాహనాలు బంద్

### బకాయిలు చెల్లించకుంటే 15 నుండి అమలు

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన శాఖల్లో అద్దెకు నడుపుతున్న వాహనాలకు సంబంధించిన బకాయిలు చెల్లించాలని అద్దె వాహనాల అసోసియేషన్ డిమాండ్ చేసింది. విధ శాఖల్లో సేవలందిస్తున్న అద్దె వాహనాల బకాయిలు చెల్లించకుంటే ఈ నెల 15 నుంచి ఆ వాహనాలను బంద్ చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్‌యాదవ్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారిక పనులు, క్షేత్రస్థాయి పరిశీలన కోసం 5 వేల కు పైగా అద్దె వాహనాలు పనిచేస్తున్నాయి. వీటికి సంబంధించిన బిల్లులు 18 నెలలుగా అందించడం లేదని, ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. దీంతో బిల్లులు రాకపోవడంతో డీజిల్ ఖర్చులు, డ్రైవర్ల జీతాలు, వాహనాల ఇన్సూరెన్స్, ఈఎంఐలకు వాహన యజమానులు డబ్బులు చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నాయని, వాహనాలను జప్తు చేసే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం వాహనాలకు నెలకు రూ.34 వేలు, జిల్లాల హెడ్‌క్వార్టర్స్‌లో రూ.33 వేల చొప్పున అద్దె నిర్ణయించారని, అయితే డీజిల్ ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు పెరిగినందున దీన్ని రూ.55 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

## ఎంపి ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్షకు 14 బిసి సంఘాల మద్దతు

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ 8 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్. కృష్ణయ్య, బిసి నాయకుల ఆధ్వర్యంలో 14న చేపట్టే సత్యాగ్రహదీక్షకు 14 బిసి సంఘాల నాయకులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ దీక్షకు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. బిసి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెం.9ను రద్దుచేసి పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్ మెంట్ స్కీమ్‌ను యదాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల కోసం ఒక్క కొత్త స్కీమ్ కూడా ప్రవేశపెట్టలేదని, పైగా కొనసాగుతున్న పథకాలను రద్దు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

# సంక్షేమ గురుకులాల్లో నిత్యావసరాలకు టెండర్లు

### రూ.687.78 కోట్ల వ్యయం

### ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియ పూర్తి

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన, వెనుకబడిన, మైనారిటీ సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు అవసరమైన సామాగ్రి కొనుగోళ్లకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ముఖ్యంగా యూనిఫాంలు, బెడ్డింగ్ సామగ్రి, పాఠశాల బ్యాగులు, పాదరక్షలు, భోజన పాత్రలు, ట్రంక్ బాక్సులు తదితర వస్తువుల కొనుగోలును అధికారులు ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పూర్తి చేశారు.

2026-27 విద్యా సంవత్సరానికి అవసరమైన విద్యార్థి సామగ్రి కొనుగోలు కోసం ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) రాష్ట్ర స్థాయిలో కార్యాచరణ ప్రారంభించింది.

ప్రతి వస్తువుకు తక్కువ ధరను కోట్ చేసిన సంస్థలను ఎంపిక చేసి టెండర్లను ఖరారు చేసింది. అధికారిక రికార్డుల ప్రకారం తుది టెండర్ల మొత్తం విలువ రూ.687.78 కోట్లుగా ఉంది. వివిధ విభాగాలకు మొత్తం 27 బిడ్లు అందగా, నిబంధనలకు అనుగుణంగా పరిశీలన పూర్తయిన తరువాతే పనులు కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులకు పంపిణీ చేసే ప్రతి వస్తువుకు నాణ్యత ప్రమాణాలు నిర్దేశించారు. నమూనాలను పరిశీలించి ఆమోదించిన తరువాతే భారీ స్థాయిలో తయారీ చేపట్టనున్నారు.

జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా సరఫరాలను తనిఖీ చేసి, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని అధికారులు స్పష్టం చేశారు. ఈ కొనుగోలు ప్రక్రియతో ఒకవైపు లక్షలాది మంది గురుకుల విద్యార్థులకు అవసరమైన సామగ్రి సమయానికి అందనుండగా, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలు, చేనేత సహకార సంఘాలు, తోలు పరిశ్రమ, మహిళా టైలర్లు ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. విద్యార్థి సంక్షేమంతో పాటు ప్రజా రంగ సంస్థలకు పనులు కల్పించడం, స్థానిక ఉపాధిని ప్రోత్సహించడం, నాణ్యమైన వస్తువులను అందించడం అనే మూడు లక్ష్యాలతో ప్రభుత్వం ఈ కొనుగోలు విధానాన్ని అమలు చేసినట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## ఫ్యూచర్‌సిటీలో 10 ఎకరాలకు ఎస్‌బిఐ ప్రతిపాదన

### 3 ఎకరాలు మాత్రం కొనుగోలు చేయాలన్న సర్కార్

### మూడో వారంలో కోర్టు వాయిదాకు ముందే పరిష్కారం

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** రాయదుర్గం వివాదాస్పద భూముల వ్యవహారంపై ప్రభు త్వానికి, స్టేట్ బ్యాంక్‌కు మధ్య ఏర్పడిన వివాదం ఈ వారంలో ముగింపు పలికే దిశగా కసరత్తు జరుగుతోంది. ఈ నెల మూడో వారంలో హైకోర్టులో ఈ కేసు విచారణకు రాకముందే, ఇరుపక్షాలు చర్చల ద్వారా పరిష్కరించు కోనున్నాయి. విచారణకు ముందే ఈ వివాదం పరిష్కారమై కోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసం హరించుకునేలా సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తాజాగా ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ మధ్య మరోసారి చర్చలు జరిగాయి. వాస్తవానికి స్టేట్ బ్యాంక్ కు కేటాయించి, ఆ తర్వాత వేలం వేసిన భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి ఇవ్వబోమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దానికి బదులుగా, జిహెచ్‌ఎంసి పరిధిలో 2.5 ఎకరాలు, ఫ్యూచర్ సిటీలో ఏడు ఎకరాలతో కూడిన ప్రత్యామ్నాయ ప్యాకేజీని ప్రతిపాదించింది. ప్రభుత్వ వర్గాల వివరాలు ప్రకారం వర్గాల సమాచారం ప్రకారం, ఎస్‌బిఐ 2.5 ఎకరాల స్థలాన్ని అంగీకరించి నప్పటికీ, దాని బోర్డు సమావేశంలో చర్చల అనంతరం, ప్రభుత్వం ప్రతిపాదించిన ఏడు ఎకరా లకు బదులుగా ఫ్యూచర్ సిటీలో 10 ఎకరాలు కోరింది. ఫ్యూచర్ సిటీలో 10 ఎకరాలు కేటాయించడానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినప్పటికీ, అందులో ఏడు ఎకరాలను వివాదాస్పద రాయదుర్గం ఆస్తికి ప్రత్యామ్నాయ భూమిగా పరిగణించాలని, మిగిలిన మూడు ఎకరాలను ప్రస్తుత మార్కెట్ ధరకు ఎస్‌బిఐ కొనుగోలు చేయాలని ప్రతిపాదించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే, మొత్తం 10 ఎకరాలను రాయదుర్గ భూములకు ప్రత్యామ్నాయంగా కేటాయించాలని ఎస్‌బిఐ కోరినట్లు సమాచారం.

## నులిపురుగులతో రక్తహీనత, పోషకాహార లోపం



సోమవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి మాత్రలు అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

### ఆల్బండజోల్ మాత్రలతో పిల్లల్లో పెరగనున్న రోగనిరోధక శక్తి

### లోక్‌భవన్ స్కూల్‌లో ట్యాబ్లెట్లను పంపిణీ చేసిన వైద్య మంత్రి రాజనర్సింహ

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** పిల్లల్లో నులిపురుగుల (నట్టలు) మూలంగా రక్తహీనత, పోషకాహార లోపంతో పాటు ఎదుగుదల మంద గిస్తుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. దానిని నివారించడానికి ఆల్బెండజోల్ మాత్రలతో పిల్లల ఆరోగ్యం మెరుగు పడటమే కాకుండా రోగనిరోధక శక్తి పెరుగుతుం దన్నారు. ఈ సమస్యను నివారిం చేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆల్బెండ జోల్ ట్యాబ్లెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ స్కూల్ పిల్లలకు మంత్రి ట్యాబ్లెట్స్ పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 1 నుంచి 19 సంవత్సరాల వయ స్సున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లల్లో నులిపురుగులు ఉండడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ సమస్యల కారణంగా చదువుపై పిల్లల శ్రద్ధ తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. నులిపురుగులు బయటకు కనిపించకపోయినా పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, అందుకే ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ మాత్ర వల్ల నులిపురుగుల సమస్య తొలగిపోయి పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని, తిన్న ఆహారంలోని పోషకాలు శరీరానికి బాగా అందుతాయన్నారు. రోగనిరోధక శక్తి పెరుగుతుందని, చదువుపై ఏకాగ్రత నేర్చుకునే సామర్థ్యం కూడా మెరుగుపడుతాయన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం మాత్రలు వేయడంతోనే ముగిసిపోదని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, హైదరాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యునాని వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

### మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** యునాని వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువచేసి, నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశిం చారు. సెక్రటేరియట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయుష్ శాఖ పనితీరు, నిజామియా టిబ్బీ హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, నిర్మాణ పనులు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి సమగ్రంగా సమీక్షి ంచారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ నిజామియా టిబ్బీ కాలేజీ, నిజామియా జనరల్ హాస్పిటల్ రాష్ట్రంలో యునాని వైద్య సేవలకు ప్రతిష్ఠాత్మక సంస్థలని మంత్రి పేర్కొన్నారు. వాటి అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. హాస్పిటల్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఓపీ బ్లాక్, ఫార్మసీ భవనం పనులను వేగవంతం చేయాలని టీజీఎం ఎస్ఐడీసీ చీఫ్ ఇంజినీర్‌ను మంత్రి ఆదేశించారు. వచ్చే జనవరి నాటికి నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ.. ఆయుష్‌లో గతేడాది 138 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయడంతో డాక్టర్ల కొరత తీరిందన్నారు. సమావేశంలో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు, నిజామియా టిబ్బీ హాస్పిటల్ సూపరిం టెండెంట్, శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఇంజినీర్లకు సిఎం క్షమాపణ చెప్పాలి

### ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** రిటైర్డ్ ఇంజినీర్లపై సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలపై తక్షణమే క్షమాపణ చెప్పాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కరువు వర్సెస్ కాళేశ్వరం 'కన్నెపల్లి నుంచి నీటి తరలింపు సాధ్యమా?' అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఈటెల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేను కరీంనగర్ జిల్లా వాసిని..25 యేళ్లుగా హుజురాబాద్ ప్రజల నీటి కష్టాలు చూస్తున్న. సీఎం అవాకులు చవాకులు పేలుతున్నారు. ఈపద్ధతి మానుకోవాలి. రిటైర్డ్ ఇంజనీర్ల పట్ల మాట్లాడిన మాటలు పట్ల బేషరతుగా క్షమాపణ చెప్పాలి. మేము ఏ పార్టీకి సపోర్ట్ కాదు, రైతులకి, ప్రజలకు న్యాయంకి ధర్మానికి సపోర్ట్. ఎస్ఆర్ఎస్పి 90 టీఎంసీ ప్రాజెక్ట్, 24 టీఎంసీల ప్రాజెక్ట్.. 24 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడానికి డిజైన్ చేశారు. కానీ ఏనాడు 1012 లక్షలకు మించి నీళ్లు అందలేదు. వరంగల్ దాటలేదు. బోర్లు వేసి బండబారిని బండ బ్రతుకులు. నోటికాడికి వచ్చిన బుక్క ఎండిపోయింది. తెలంగాణ వచ్చిన తరువాత రెండు పంటలకు నీళ్లు ఇవ్వాలని ఆలోచన చేశాం. రేవంత్ రెడ్డి మేడిగడ్డ కూలింది.. అన్నారం సుందిళ్ల పనికి రాదు అని చెప్తున్నారు కానీ ఇక్కడి నిష్ణాతులు చెప్తున్న మాటలు వినే సోయిలేదు. నిందించడం బుకాయించడం చేస్తూ..రైతుల కంట్లో మట్టి కొడుతున్నారు. కుసంస్కార మాటలకు తెలంగాణ సమాజం బాధపడుతుంది. సమైక్యాంధ్రలో కూడా సీఎంలు సమయంనంతో సమాధానం చెప్పారు. కానీ మన సీఎం ఇలా మాట్లాడడం ప్రజలను కుంగదీస్తుంది. ఈరోజు ప్రజలు మాట్లాడకపోవచ్చు .కానీ సందర్భం వచ్చినప్పుడు కర్రు కాల్చి గుణపాఠం చెప్తారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా మొండిగా, గుడ్డిగా, అజ్ఞానంగా సిఎం వ్యవహరిస్తున్నారు. బెల్ట్ తో కొడతా అనడం, జైల్లో పెడతా అనడం, రక్తం చల్లుతానానడం అనే మాటలు సిగ్గుతో తలదించుకునేల ఉన్నాయి. ఇలాంటి భాష మీకే దక్కుతుంది. దీనికి మూల్యం చెల్లించుకోబోతున్నారు"అంటూ ఈటెల మండిపడ్డారు.

## తిరుమలరావు తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

### తెలుగు వర్సిటీ విసి ఆచార్య నిత్యానందరావు

**హైదరాబాద్ (నాంపల్లి), జులై 13, ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌ను ఆదిధ్వని ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తున్నారంటూ విశ్వవిద్యాలయం మాజీ ఉద్యోగి జయదీర్ తిరుమలరావు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం, విద్యార్థులు, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌ను ఆదిధ్వని ఫౌండేషన్ ప్రైవేట్ సంస్థకు అప్పగించడానికి ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీచేయలేదు. ప్రభుత్వ భవనాలను ప్రైవేట్ వ్యక్తులకు లేదా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ప్రభుత్వ విధానాలకు, నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రస్తుతం నాంపల్లి ప్రాంగణంలోని తెలుగు విశ్వవిద్యాలయంలో హాస్టల్ సౌకర్యంలేని డేస్కాలర్స్‌తో 12 కోర్సులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. వందలాది మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. ముఖ్యంగా గ్రౌండ్‌ఫ్లోర్‌లో దూరవిద్యా కేంద్రం కార్యాలయం, డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో, చిత్రవాణి స్టూడియో, తరతరాల తెలుగుజాతి వస్తు ప్రదర్శనశాల, కంప్యూటర్ ల్యాబ్ సెంటర్, బి.డిజైన్, జ్యోతిష్యశాస్త్రం విద్యార్థుల తరగతి గదులలో కోర్సులు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయం ఒకేపూట ఉండాలంటే నిబంధన ఎక్కడాలేదు. పరిపాలనా సౌలభ్యం, విద్యావసరాల దృష్ట్యా విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల వేర్వేరు ప్రాంతాల్లో పనిచేయడం దేశంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో అమలులో ఉన్న సాధారణ విధానమేనని, అదేవిధంగా ప్రభుత్వం నేరుగా నిర్వహించని ఏ మ్యూజియమైనా ప్రైవేట్ మ్యూజియంగానే పరిగణించబడుతుందని, దీనిపై అనవసర అపోహలు సృష్టించడం సమంజసం కాదన్నారు. నాంపల్లి ప్రాంగణంలో ప్రస్తుతం కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలు, పరిపాలనా విభాగాలు, మౌలిక సదుపాయాల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో పూర్వ ఉద్యోగిగా పనిచేసిన తిరుమలరావుకు విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న విద్యా కార్యక్ర మాలు, కోర్సులు, కార్యకలాపాలపై పూర్తి అవగాహన ఉన్నప్పటికీ వాస్తవాలను వక్రీకరిస్తూ ఇటువంటి తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం, పౌరసమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రకటనలను వెంటనే విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆదిలాబాద్ సిసిఐ పునఃప్రారంభం కోసం 15న ఢిల్లీకి బిఆర్ఎస్ ప్రతినిధి బృందం

### కేంద్రమంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించనున్న బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమను తక్షణమే పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రతినిధి బృందం ఈ నెల 15న ఢిల్లీకి వెళ్లనుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జోగు రామన్నల ఆధ్వర్యంలోని సీసీఐ సాధన కమిటీ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి పరిశ్రమ పునరుద్ధరణకు సంబంధించి ఒక వినతిపత్రాన్ని సమర్పించనుంది. ఈ ప్రతినిధి బృందానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్రతో పాటు పలువురు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారు. ఆదిలాబాద్ ప్రాంత ప్రజల దశాబ్దాల డిమాండ్ అయిన సీసీఐ పునఃప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా విజ్ఞప్తి చేయడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని పార్టీ తెలిపింది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి సిఎం కేసీఆర్ పలుమార్లు ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి సీసీఐ పునరుద్ధరణపై విజ్ఞప్తి చేసినట్లు పేర్కొంది. అప్పటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కూడా పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు సమర్పించారని, పరిశ్రమ పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం, రాయితీలు అందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ గత 13 ఏళ్లుగా కేంద్రం నుంచి ఎలాంటి సానుకూల నిర్ణయం రాలేదని పేర్కొంది. అలాగే 2019, 2024 ఎన్నికల సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు పలువురు బీజేపీ నాయకులు ఆదిలాబాద్‌లో బీజేపీ ఎంపీని గెలిపిస్తే సీసీఐని తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఆ హామీని అమలు చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆదిలాబాద్ ప్రజల చిరకాల డిమాండ్, జిల్లా యువతకు వేలాది ఉద్యోగాలు కల్పించే సామర్థ్యం ఉన్న సీసీఐ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పునఃప్రారంభించాలని, ఈ అంశంపై కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి జోక్యం చేసుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం కోరనుంది.

## నేటి నుండి బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం-2026 సదస్సు

### కార్మిక సంక్షేమం, సామాజిక భద్రతపై అంతర్జాతీయ ప్రతినిధుల విస్తృత చర్చలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 13, ప్రభాతవార్త:** భారతదేశం ప్రతిష్ఠాత్మకంగా వహిస్తున్న బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలలో భాగంగా నగరంలో నేటి నుండి మూడు రోజుల పాటు జూలై 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం - 2026 అంతర్జాతీయ సదస్సు నిర్వహించబోతున్నట్లు ఫోరమ్ చైర్మన్ సుంకరి మల్లేశం వివరించారు. భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో నగరంలోని మారియట్ హోటల్‌లోని వాయు హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, బెలారస్, సౌదీ అరేబియా సహా 14 బ్రిక్స్ సభ్య దేశాల నుంచి సుమారు 50 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరితో పాటు భారతదేశానికి చెందిన ప్రముఖ కేంద్ర కార్మిక సంఘాలు బి ఏం ఎస్ ఐ యెన్ టి యు సి , ఏ ఐ టుయూసీ, హెచ్ ఎం ఎస్ తో పాటు వివిధ యజమాన్య సంస్థల ప్రతినిధులు, కార్మిక రంగ నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకులతో కలిపి మొత్తం 70 మందికిపైగా భారతీయ ప్రతినిధులు ఈ సదస్సులో భాగస్వామ్యం కానున్నారు. మంగళవారం జరిగే ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథిగా కేంద్ర కార్మిక, ఉపాధి ,యువజన వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ భాయ్ మాండవీయ ప్రారంబిసఞ్చి ప్రసంగిస్తారు. బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సదస్సు చైర్మన్ సుంకరి మల్లేశం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. కాగా అదే రోజు సాయంత్రం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో కార్మిక మహాసభ కు ముఖ్య అతిథిగా హర్యాన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరుకానుండగా, వివిధ దేశాల ప్రతినిధులు ప్రసంగించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రపంచ కార్మిక రంగాన్ని ప్రభావితం చేస్తున్న పలు సమకాలీన అంశాలపై మేధోమథనం జరగనుంది. ఈ సదస్సు బ్రిక్స్ దేశాల కార్మిక సంఘాల మధ్య పరస్పర సహకారాన్ని, ఐక్యతను పటిష్టం చేయడమే కాకుండా ప్రపంచ కార్మిక రంగంలో సమానత్వం, సామాజిక న్యాయానికి ఒక దిక్సూచిగా మారుతుందని బి.ఎమ్.ఎస్ తెలంగాణ సెక్రటేరియట్ ప్రతినిధి జి. రమేష్‌గౌడ్, పి.లక్ష్మీనారాయణ తెలిపారు.

## మందకొడిగా యంగ్ ఇండియా పోలీసు స్కూల్ పనులు





యంగ్ ఇండియా పోలీసు స్కూల్ సమావేశంలో పాల్గొన్న డిజిపి ఆనంద్. చిత్రంలో గ్రేహౌండ్స్ డిజి అనిల్‌కుమార్‌సహా ఇతర అధికారులు

### జాప్యంపై డిజిపి ఆనంద్ తీవ్రఆగ్రహం

### యుద్ధప్రాతిపదికన పనులు జరగాలని ఆదేశం

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేబట్టిన యంగ్ ఇండియా పోలీసు స్కూల్ నిర్మాణ పనుల వేగంగా జరగక పోవడంపై డిజిపి ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్కూల్ పనులను వేగంగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ వుండకూడదని ఆ యన అన్నారు. నగర శివార్లలోని మణికొండలో గ్రేహౌండ్స్ విభాగంలో ఏర్పాటై నిర్మాణంలో వున్న యంగ్ ఇండియా పోలీసు స్కూల్ సొసైటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్‌గా వున్న ఆనంద్ మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా ఈ తరహా పాఠశాల ఏర్పాటవుతుండడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. దీనికి సంబంధించిన పనులను వేగంగా చేబట్టాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని ఆ యన ఆదేశించారు. స్కూల్ నిర్మాణంలో ప్రతీ పనిని నిరంతరం సమీక్షించడంతో పాటు అంతా పక్కాగా వుండేలా చూడాలని ఆయన కోరారు. ఈ పాఠశాలలో పోలీసు పిల్లలతో పాటు సామాన్యుల పిల్లలకు ప్రత్యేక విధానంలో బోధన వుంటుందని, ఒక లక్ష్యంతో ఇది ఏర్పాటయ్యిందని ఆనంద్ తెలిపారు. ఈ పాఠశాల రెండవ ఏడాదిలో అడుగుపెట్టిన క్రమంలో ఇప్పటి వరకు సాధించిన పురోగతిని ఆయన సమీక్షించారు.

ఈ పాఠశాల దేశంలోనే అత్యుత్తమ విద్యా సంస్థగా రూపొందాలని, ఇం దుకోసం అందరు సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. ఇక్కడ చదువు కునే విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించడంతో పాటు క్రీడల్లో రాణించేలా చూడాలని ఆయన ఆదేశించారు.

ఈ సందర్భంగా మొదటి ఏ డాది 345, రెండవ ఏడాది 360 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. గత ఏడాది ఐదవ తరగతి వరకు వుండగా ఈ యేడాది ఆరవ తరగతి వరకు పెంచామని వారు తెలిపారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, గ్రేహౌండ్స్ డిజి అనిల్‌కుమార్, పోలీసు సంక్షేమ విభాగం ఐజి డాక్టర్ గజారావు భూపాల్, సైబరాబాద్ కొత్వాల్ రమేష్‌తో పాటు పాఠశాల నిర్వాహ కులు పాల్గొన్నారు.



## చైనాలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో నల్లగొండ అమ్మాయి సత్తా

### సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** చైనాలోని ఒర్డోస్‌లో జరుగుతున్న తొలి ఏషియా అండర్ 23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్ 2026లో మహిళల (4)400 రిలే పరుగుపందెంలో స్వర్ణ పతకం సాధించిన ప్రవళిక నరిమళ్లను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.తెలంగాణ బిడ్డ ప్రవళిక నరిమళ్ల ఆసియా అండర్23 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్స్‌లో అసమాన ప్రతిభ కనబరిచి మహిళల (4)400 మీటర్ల రిలేలో ఆమె స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. నల్గొండలోని ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతూ, డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొంది అంతర్జాతీయ వేదికపై రాణించిన ప్రవళిక యువ క్రీడాకారులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. తాపీ మేస్త్రీ కూతురైన ప్రవళిక పట్టుదల ఉంటే సాధించలేనిదేదీ లేదని నిరూపించిందని పేర్కొన్నారు. ఏషియా అండర్ 23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్ (4)400 మీటర్ల రిలే జట్టులో ప్రవళిక, శ్రావణి సదన్ సేథీ, సాండ్రమోల్ సాబు, నోఫిసా ఖతూన్‌లతో కలిసి స్వర్ణ పతకం సాధించారు. ఈ నలుగురు సభ్యుల బృందం 3:33.62 సెకన్ల సమయంలోనే స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని, ఆతిథ్య దేశమైన చైనాను అధిగమించింది. అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడానికి ముందే, ప్రవళిక వివిధ వేదికల్లో 23 స్వర్ణాలతో సహా మొత్తం 35 రాష్ట్ర స్థాయి పతకాలను సాధించి అద్భుతమైన దేశీయ రికార్డును నెలకొల్పారు. ప్రవళికకు శిక్షణ అందించిన కోచ్‌లకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఈ చాంపియన్‌షిప్‌లో మొత్తం 3 స్వర్ణ, 4 రజత, 9 కాంస్య పతకాలతో సహా 16 పతకాలను సాధించిన భారత క్రీడాకారులందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

## సైబర్ నేరాలు, టెలికాం సంబంధిత మోసాల నియంత్రణపై కమాండ్ కంట్రోల్‌లో సదస్సు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా పెరిగిపోతున్న సైబర్ నేరాల నివారణ, టెలికాం సంబంధిత నేరాల నియంత్రణకు సిటీ పోలీసు విభాగం ఆధ్వర్యంలో సోమవారం కమాండ్ కంట్రోల్‌లో సదస్సు జరిగింది. సిటీ పోలీసు విభాగంతో పాటు తెలంగాణ సైబర్ సెక్యూ రిటీ బ్యూరో, ఆర్‌బిఐ, టెలికమ్యూనికేషన్స్ విభాగం ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటీ కొత్వాల్ సజ్జనర్ మాట్లా డుతూ రోజురోజుకూ మారుతున్న సైబర్ భద్రతా ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఈ సదస్సును నిర్వహించినట్టు, ఇం దులో ఆర్‌బిఐ, టెలికమ్యూనికేషన్స్ విభాగం అధికారులు భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. ఇలాంటి సదస్సుల వల్ల ప్రభుత్వ విభాగాల మ ధ్య మరింత సమన్వయం ఏర్పడి నేరాల కట్టడికి మార్గం సుగమవుతుందని ఆయన తెలిపారు. సైబర్ నేరాల నివారణలో భాగంగా టెలికమ్యూనికేషన్స్ విభాగం చేపట్టిన కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా ఐదు కోట్లకు పైగా నకిలీ మొబైల్ కనెక్షన్లను తొలగించగలిగామని, 12 లక్షలకు పై గా పోగొట్టుకున్న మరియు చోరీ గురైన మొబైల్ హ్యాండ్‌సెట్‌లను రికవరీ చేశామని ఆయన చెప్పారు. సైబర్ ఆధారిత ఆర్థిక మోసాలు, టెలి కాం దుర్వినియోగం నుండి పౌరులను రక్షి ంచడంలో గత రెండేళ్లలో సాధించిన పురోగతిని ఆయన వివరించారు. అంతేకాకుండా, ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ (ఫ్రిమేఫర్) ద్వారా రూ. 1,800 కోట్లకు పైగా సైబర్ మోసాలను అడ్డుకున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి సదస్సులు మరిన్ని జరగాలని కమిషనర్ కోరారు. ఈ సదస్సులో టెలికాం డైరెక్టర్ జనరల్ శ్రీ ఆనంద్ ఖారే, టెలికాం స్పెషల్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి దీపా అరోరా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ శ్రీ హర్షవర్ధన్, సిఐడి అధికారులు పలువురు పాల్గొన్నారు.

## బండి సంజయ్ కేంద్రమంత్రిగా ఉండడం ప్రజల దురదృష్టకరం

### పిసిసి వర్కింగ్ ప్రెసిండెంట్ జగ్గారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** బిజెపి నాయకుడు బండి సంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండడం రాష్ట్ర ప్రజల దురదృష్టకరం అని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి విమర్శించారు. బండికి పాలనపై అవగాహన లేదని ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో విమర్శించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పినట్లు బండి సంజయ్‌కు చేతనైతే డ్యాం సేఫ్టీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

డ్యామ్ సేఫ్టీ అధికారులతో సీఎం, ప్రతిపక్షాలతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయంచాలన్నారు. అప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుపై నిజానిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు.కాంగెస్ ,బిఆర్ఎస్ నేతలు రక్తకన్నీరు నాగభూషణం తరహాలో నటిస్తున్నారంటూ బండి సంజయ్ కేవలం డైలాగులు కొడితే సరిపోదన్నారు. పదేళ్లు రాష్ట్రంలో బిఆర్ఎస్, కేంద్రంలో బిజెపి కలిసి సంసారం చేశాయని ఆయన విమర్శించారు.

పదేళ్లు మీకు రాజకీయ సంబంధాలు ఉన్నాయని ఆయన అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీష్ రావుకి పట్టిన రోగమే, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి పట్టిందని ఆయన విమర్శించారు. అవగాహన లేకుండానే బండి సంజయ్ కేంద్ర మంత్రి అయ్యారన్నారు. ప్రధాని మోడీ మీకు ట్రైనింగ్ ఇవ్వకుండా మంత్రి పదవి ఇచ్చారని జగ్గారెడ్డి విమర్శించారు.

## ఎపిలో మాదిరిగా డిఎస్సీ-2003 ఉపాధ్యాయులకు ఒపిఎస్ అమలు చేయాలి

### ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకి పాత పెన్షన్ స్కీమ్(ఓపీఎస్)ను అమలు చేస్తూ ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణలో కూడా అదేవిధంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకి ఓపీఎస్‌ను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు టిఎస్ యుటిఎఫ్, తపస్, టిఆర్‌టిఎఫ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. 2004 కంటే ముందే నోటిఫికేషన్ జారీ అయి 2004 అనంతరం నియామకమైన 2003 డీఎస్సీ టీచర్లు, ఉద్యోగులు, పోలీసులకు పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) అమలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నంబర్ 53ను జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ లో అవకాశం ఇచ్చిన విధంగానే తెలంగాణలో కూడా డీఎస్సీ- 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకి టిఎస్ యుటిఎఫ్ సోమవారం వినతిపత్రం ఇచ్చినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ తెలిపారు. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ పాత పెన్షన్ విధానం అమలులో ఉన్న సమయంలోనే ప్రారంభమైందని, పరిపాలనా కారణాల వల్ల నియామక ఉత్తర్వులు ఆలస్యంగా జారీ కావడంతో వీరికి పాత పెన్షన్ విధానం వర్తించకుండా కొత్త పెన్షన్ విధానం (సీపీఎస్) అమలైందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) పేర్కొంది.

# మక్తల్‌లో రూ.531 కోట్ల హ్యామ్‌రోడ్లకు శంకుస్థాపన

### రూ.237 కోట్లతో మక్తల్-నారాయణపేట 4 లేన్ల రహదారి

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.531 కోట్ల వ్యయంతో చేపడుతున్న హ్యామ్ రోడ్ల అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన జరిగింది. ఇందులో భాగంగా రూ.237 కోట్లతో నిర్మించనున్న మక్తల్-నారాయణపేట నాలుగు లైన్ల హ్యామ్ రహదారి నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంకతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరి.. మాట్లాడుతూ, మక్తల్-నారాయణపేట రహదారి నిర్మాణం ప్రజల ఎన్నో ఏళ్ల కల అని, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నాయ కత్వంలో ఆ కల నేడు సాకారమవు తోందన్నారు. గత ప్రభుత్వం రహదా రులను నిర్లక్ష్యం చేయగా, ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

మక్తల్ నియోజకవర్గానికి అవసరమైన ప్రతి అభివృద్ధి పనికి ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు వెంటనే స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. వెనుకబడిన మక్తల్‌ను అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. మాట్లాడుతూ, మక్తల్ నియోజకవర్గంలో రూ.531 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి ప్రతి సమావేశంలో మక్తల్-నారాయణపేట రహదారి నిర్మాణంపై ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఈ ప్రాజెక్టు మంజూరు కోసం నిరంతరం కృషి చేశారని ప్రశంసించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు.. మాట్లాడుతూ, రాష్ట్ర రహదారుల అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టుదలతో కృషి చేసి వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధికి నాణ్యమైన రహదారులే పునాదని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ మక్తల్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు.వచ్చే ఎన్నికల నాటికి మక్తల్ నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

# సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు

**విజయవాడ, జులై 13, ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు,అనుసంధాన బనచర్ల పథక ప్రాతిపదనపై తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో లోపాలున్నాయంటూ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఏపీ ప్రభుత్వానికి తక్షణ నోటీసులు, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ అభ్యర్ధనను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం తోసిపుచ్చింది.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, గోదావరి నీటి వినియోగం, పోలవరంబనకచర్ల అనుసంధానం వంటి అత్యంత కీలకమైన అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ వివాదాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ, ప్రాజెక్టుల లింకేజీలపై నెలకొన్న వివాదాలు కొనసాగుతున్న సమయంలో ఈ విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేయాలని, అలాగే ఏపీ ప్రభుత్వానికి తక్షణమే నోటీసులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోర్టును అభ్యర్థించింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. తెలంగాణ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌లో కొన్ని సాంకేతిక లోపాలు ఉన్నాయని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ఈ సందర్భంగా ఎత్తిచూపింది. ఆ లోపాలను పూర్తిగా సరిదిద్దే వరకు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టడం సాధ్యం కాదని కోర్టు స్పష్టం చేసింది. పిటిషన్‌లో లోపాలు ఉన్నందున, దానిపై ప్రాథమిక విచారణ జరపకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎలాంటి నోటీసులు కూడా జారీ చేయలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ కొనసాగాలంటే మొదట పిటిషన్‌లోని లోపాలను సరిచేయాలని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాదులకు సూచిం చింది. లోపాలు సవరించిన తర్వాతే ఈ కేసు తదుపరి ప్రక్రియ ముందుకు సాగనుంది.

# సింగరేణిని కాపాడుకుందాం

### సంస్థ అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయి

### కార్మిక సంఘాలు ఏకం కావాలి

### మణుగూరు ఏరియాలో 'సింగరేణి భరోసా యాత్ర'లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**మణుగూరు, జులై 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు ఇవ్వాల్సిన రూ. 54 వేల కోట్లు ఇచ్చే వరకు అన్ని కార్మిక సంఘాలు ఏకమై పోరాడాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపు నిచ్చారు. సింగరేణి కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి కష్టపడుతున్నారని ఆయన కొనియాడారు. ఆయన సోమవారం మణుగూరు ఏరియా పీకే ఓసీ 2 గని వద్ద భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'సింగరేణి భరోసా యాత్ర'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తుందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా, ముడుపులు తీసుకుని మైన్స్ కేటాయించిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఆ అక్రమ కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేస్తూ, పారదర్శకంగా కేటాయింపులు జరపాలని ఆదేశించిందని గుర్తుచేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే పారదర్శకత పెరిగిందన్నారు. ఇప్పటివరకు అన్ని బొగ్గు గనులను కేవలం వేలం ద్వారానే కేటాయిస్తూ వచ్చామని, అయితే సింగరేణిని ఆదుకోవాలనే ఉద్దేశంతో వేలం ప్రక్రియ లేకుండా ప్రధాని మోదీ కేటాయించిన ఏకైక బ్లాక్ ఖితాడిచర్ల2ఖి అని ఆయన తెలిపారు. సింగరేణి సంస్థకు ఒడిశాలోని ఖినైనీ కోల్ బ్లాక్‌ఖి కేటాయించినందుకు గానూ ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తాడిచర్లలో సింగరేణి కార్మికులతోనే బొగ్గు తీయాలని ఆయన డిమాండ్ చేశారు.సింగరేణి సంస్థను దెబ్బతీసేలా, నిర్వీర్యం చేసేలా బ్యాంకుల్లో ఓడీ తీసుకునే పరిస్థితికి గత ప్రభుత్వం, ఇప్పటి ప్రభుత్వం తీసుకొచ్చాయని కిషన్ రెడ్డి మండిపడ్డారు. "సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని అన్నారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకున్నారు అని విమర్శించారు. మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బులను ఖర్చు చేస్తారా అని అన్నారు. సింగరేణి నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం పై విరుచుకుపడ్డారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ విషయంలో కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని డిమాండ్ చేశారు. సింగరేణిలో మధ్యదళారీ వ్యవస్థ పెరిగిపోయిందని, కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.సింగరేణి వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోదనే విషయం తెలిసికూడా, ఇప్పుడు కేటీఆర్, హరీశ్ రావు లేఖలు రాస్తున్నారని ప్రశ్నించారు. సింగరేణిలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా కేంద్రానికి సమాచారం ఇవ్వడం లేదని, అయినప్పటికీ సంస్థపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి పెత్తనం చెలాయించబోదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఇరాన్ ఐఆర్‌జిసి, మరో రెండు వ్యవస్థలపై బ్రిటన్ బ్యాన్

**లండన్, జూలై 13:** ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఐఆర్జీసీతో పాటు మరో రెండు సంస్థలను జాతీయ భద్రతకు ముప్పుగా గుర్తించే ప్రక్రియను ప్రారంభించినట్లు బ్రిటన్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది.ఈ జాబితాలో ఇరాన్‌తో సంబంధాలు ఉన్నట్లు బ్రిటన్ పేర్కొంటున్న ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ కంపానియన్స్ ఆఫ్ ది రైట్, అలాగే రష్యా సాయుధ దళాల జనరల్ స్టాఫ్ ప్రధాన నిఘా విభాగం పర్యవేక్షణలో పనిచేసే వాలంటీర్ కార్ప్స్ కూడా ఉన్నాయి. దాదాపుగా వీటిని ఉగ్రకార్యకలాపాలు కొనసాగిస్తున్న సంస్థలుగా బ్రిటన్ పరిగణిస్తోంది. బ్రిటన్ పార్లమెంట్ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే, జాతీయ భద్రత చట్టం2026 కింద గుర్తింపు పొందనున్న తొలి సంస్థలుగా ఇవి నిలుస్తాయని భద్రతా శాఖ మంత్రి ఏంజెలా ఈగిల్ విడుదల చేసిన లిఖితపూర్వక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ గుర్తింపు అమల్లోకి వచ్చిన తర్వాత, బ్రిటన్‌కు సంబంధించిన కార్యకలాపాల్లో ఈ సంస్థలకు మద్దతు ఇవ్వడం, సహాయం చేయడం లేదా వాటి ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందడం నేరంగా పరిగణిస్తారు. ఈ చట్టం కింద నమోదయ్యే కొన్ని నేరాలకు గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఇప్పటికే బ్రిటన్ ప్రభుత్వం ఐఆర్‌జీసీపై సమగ్ర ఆంక్షలు విధించింది. తాజా గుర్తింపు విధానం, టెర్రరిజం యాక్ట్2000 కింద ఉగ్రవాద సంస్థలను నిషేధించే విధానానికి భిన్నమైనదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# కర్ణాటక సిఎం డికె శివకుమార్‌తో బిసి నేతల భేటీ

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** వచ్చే నెల ఆగస్టు ఏడో తేదీన బెంగళూ రులోని మన్మోహన్‌సింగ్ సిటీ యూనివర్సిటీలోని ఆడిటోరియమ్ లో జరగనున్న అఖిలభారత జాతీయ ఓబీసీ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బిసి ప్రతినిధుల బృందం కోరింది. ఈమేరకు సోమవారంబెంగళూరులోని కృష్ణ హౌస్‌లో కర్ణాటక పిసిసి అధ్యక్షులు బికే హరి ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ప్రొఫెసర్ బాబన్ రావు తైవాడే (మహారాష్ట్ర) కేసన శంకర్ రావు (ఆంధ్రప్రదేశ్) లక్ష్మణ్ (కర్ణాటక) కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ (తెలంగాణ) తదితర 15 మంది ఓబీసీ ప్రతినిధులు సీఎం డీకే శివకుమార్ తో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న డిమాండ్లపై సుమారు 20 నిమిషాలు బిసి ప్రతినిధులతో సీఎం డీకే శివకుమార్ చర్చించారు ముందుగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లా డుతూ దేశవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న జాతి జనగణనలో ఓబీసీ కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం లెక్కించడం లేదని, మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు సబ్ కోటా కల్పించకపోతే ఓబీసీ మహిళలు చట్ట సభలను అడుగు పెట్ట లేరని, దేశవ్యాప్తంగా అన్ని వర్గాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వే షన్లు అమలు జరుగు తున్నాయని ఓబీసీలకు మాత్రమే జనాభా దామాషా ప్రకారం రిజర్వే షన్లు దక్కడం లేదని, కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలకు అవలంబిస్తుందని, బీసీలకు దేశవ్యాప్తంగా జరుగుతున్న అన్యాయంపై బీసీ సం ఘాలుగా తాము దేశవ్యాప్తంగా పోరాడుతు న్నా మని, దేశవ్యాప్తంగా జరిగే పోరాటానికి , బీసీ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున చొరవ తీసుకోవాలని సీఎంకు ఆయన విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జరిగే జాతీయ ఓబీసీ మహాసభ ఈ సంవత్సరం తమ రాష్ట్రంలో జరగడం అభినందనీయమనీ, తప్ప కుండా ఈ మహాసభకు తాను హాజరవు తానని సిఎం హామీ ఇచ్చినట్లు జాజుల తెలిపారు.



కర్ణాటక సిఎం డికె శివకుమార్‌తో సమావేశమైన జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## లంచం తీసుకొని రాజ్‌కుమార్‌కు బెయిల్.. పోలీస్ శాఖ లోపం

### విజయశాంతి కీలక వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన షాబాద్ నరమేధం వ్యవహారంపై ఎమ్మెల్సీ విజయశాంతి కీలక వ్యాఖ్యలు చేశారు. అతికిరాతకంగా ఆరుగురిని కడతేర్చిన హంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కేసు ముగిసినట్లు పోలీసులు భావిస్తున్నారని, కానీ.. పోక్సో కేసులో అరెస్టైన నిందితుడు బెయిల్‌పై విడుదల కావడానికి పోలీసుల నిరక్ష్యమ్లే కారణమనే ఆరోపణలు వస్తున్నాయని ఆమె సోమవారం ఎక్స్ పోస్ట్‌లో ధ్వజమెత్తారు. షాబాద్‌లో ఆరుగురిని పొట్టనబెట్టుకున్న నిండుతుడు రాజ్‌కుమార్ బెయిల్‌పై బయటకు రాకపోయి ఉంటే ఆ ఆరుగురు ప్రాణాలతో ఉండేవారని విజయశాంతి అన్నారు. పోక్సో కేసులో అరెస్టైన రాజ్‌కుమార్ నుంచి లంచం తీసుకుని పోలీసులు అతడి విడుదలకు సహకరించారన్న సమాచారం పత్రికల ద్వారా తెలిసిన తర్వాత తెలంగాణలోని మహిళా లోకం షాక్‌కు గురవుతోంది. పోలీసులు చేసిన తప్పుతో ఆరుగురి ప్రాణాలను కడతేర్చడానికి ఆస్కారం ఏర్పడిందన్న అభిప్రాయం కలుగుతోందని ఎమ్మెల్సీ వెల్లడించారు. రాష్ట్ర పోలీసు శాఖలోని ఇలాంటి లోపాల వల్ల తెలంగాణలో మహిళ భద్రతపై అనుమానాలు తలెత్తే ప్రమాదం ఉందని విజయశాంతి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు ప్రాధాన్యమిస్తామని చెబుతున్న కాంగ్రెస్ పాలనలో ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించి.. మహిళల భద్రతతో పాటు శాంతి, భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఓ మహిళా ప్రజాప్రతినిధిగా కోరుకుంటున్నానని విజయశాంతి విజ్ఞప్తి చేశారు.



## తెలంగాణభవన్‌లో 'రేవంత్‌రెడ్డికి రక్తదానం' కార్యక్రమం

### బిఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** బీఆర్ఎస్ నాయకుల రక్తాన్ని పంటల మీద చల్లితే అదే పండుతుంది అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్ఎస్వీ నాయకులు వినూత్నంగా నిరసన బాట పట్టారు. బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో 'రేవంత్‌రెడ్డికి రక్తదానం' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సంఘీభావం తెలుపుతూ బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. సీఎం రక్తదాహం తీర్చేందుకు విద్యార్థి విభాగం రక్తదానం చేస్తోందని, దానం చేసిన రక్తాన్ని సీఎం నివాసానికి తీసుకెళ్లి ఇస్తామని మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్,లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి,సంజయ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. విద్యార్థులు, నాయకుల నుండి సేకరించిన బ్లడ్ ప్యాకెట్లతో బీఆర్ఎస్వీ నాయకులు రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయం బయలుదేరి వెళ్లే క్రమంలో పోలీసులు తెలంగాణ భవన్ చుట్టూ భారీగా మోహరించారు. బ్లడ్ డొనేట్ చేసిన ప్యాకెట్లతో రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్తున్న బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## బాన్సువాడ ఆస్పత్రిలో సిజేరియన్ జరిగిన 10 మంది బాలింతల్లో ఐదుగురికి అనారోగ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:**కామారెడ్డి జిల్లా బాన్సు వాడ ఆస్పత్రిలో సిజేరియన్ జరిగిన 10 మంది బాలింతల్లో ఐదుగురు అనారోగ్యం పాలయ్యారు. సిజేరియన్ తర్వాత ఐదుగురు బాలింతల్లో తెల్లరక్తకణాలు తీవ్రంగా తగ్గాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో వెంటనే వీరిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. సిజేరియన్ వికటించిందని బాలింతల బంధువులు ఆరోపిస్తున్నారు. వారికి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

## 20 నుంచి భారీ వర్షాలు

>> ఈ వ్యవస్థ బంగాళాఖాతం వైపు కదిలితే జూలై చివరి వారంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు మళ్లీ చురుకుగా మారే అవకాశాలు ఉన్నాయని సూచిస్తున్నారు. ఇంటర్ ట్రాపికల్ కన్వర్జెన్స్ జోన్ అనేది భూమధ్యరేఖ సమీపంలో ఉత్తర, దక్షిణ అర్ధగోళాల నుంచి వచ్చే ట్రేడ్ విండ్స్ కలిసే ప్రాంతం. ఈ ప్రాంతంలో వెచ్చని, తేమతో కూడిన గాలి పైకి ఎగసిపోవడంతో భారీ మేఘాలు ఏర్పడి వర్షాలు కురుస్తాయి. సాధారణంగా రుతుపవనాల కాలంలో భారతదేశానికి సమీపంలో ఉంటుంది. ఈసారి ఇది మరింత తూర్పు వైపున ఏర్పడి, బంగాళాఖాతం నుంచి మధ్య పసిఫిక్ వరకు విస్తరించింది.ప్రస్తుతం ఐటిసిజడ్‌లో అనేక అల్పపీడనాలు, ఉష్ణమండల తరంగాలు చురుకుగా ఉన్నాయని వాతావరణ విశ్లేషకులు చెబుతున్నారు. ఇవి నెమ్మదిగా పశ్చిమ దిశగా కదులుతూ బంగాళాఖాతం వైపు చేరుతున్నాయి. ఈ వ్యవస్థల్లో ఏదైనా బలపడితే రుతుపవన ద్రోణి బలపడటంతో తూర్పు, మధ్య, ఉత్తర భారతదేశంలో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వాతావరణ నమూనాల ప్రకారం, జులై 20 నుంచి 30 మధ్య ఈ ఉష్ణమండల వ్యవస్థలు భారత ఉపఖండాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం బలహీనంగా ఉన్న నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుకుగా మారవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రత్యేకించి బీహార్, జార్ఖండ్, తూర్పు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో మంచి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని అంచనా. ఈ వ్యవస్థ మరింత బలపడి అల్పపీడనం లేదా తుఫానుగా మారితే కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో వరదలు, నీటిమునిగే పరిస్థితులు, తీరప్రాంతాల్లో అలల ఉధృతి పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## భారత్‌కు వస్తున్న వియత్నాం మృతుల భౌతికకాయాలు

**హనోయి, జులై 13:** వియత్నాంలో శనివారం జరిగిన ఘోర బోటు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 15 మంది భారతీయుల మృతదేహాలు స్వదేశానికి చేరుకోనున్నాయి. హో చి మిన్ సిటీ నుంచి వియత్నాం ఎయిర్‌లైన్స్‌కు చెందిన వి979 విమానంలో మృతదేహాలను భారత్‌కు తరలిస్తున్నట్లు హనోయ్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 9:35 గంటలకు ఈ విమానం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటుంది. అనంతరం మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తున్నట్లు భారత రాయబార కార్యాలయం తెలిపింది. మృతుల కుటుంబాలకు భారత రాయబార కార్యాలయం ప్రగాఢ సానుభూతి తెలిపింది. వారికి అవసరమైన అన్ని సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చింది. బాధిత కుటుంబాలతో సమన్వయం కొనసాగించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కూడా కోరినట్లు వెల్లడించింది. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 10 మంది తమిళనాడుకు చెందినవారు, ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు, ఇద్దరు కేరళకు చెందినవారని అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు పర్యాటకులు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకున్నారు.




# ఎఐ కెమెరాలతో నేరగాళ్లకు చెక్

## చోరుల పాలిటి సింహస్వప్నంగా ఆర్‌టిజిఎస్ సిసిటివి360

- వాహనాల రికవరీనే కాదు క్లిష్టమైన కేసుల్లోనూ
- గుంటూరులో ఒకే ఒక అలెర్టుతో 7 వాహనాల స్వాధీనం
- ఎన్టీఆర్ జిల్లాలో మరికొన్ని వాహనాల గుట్టు విప్పిన సిసిటివిలు
- నాలుగు నెలల్లో 81 వాహనాల రికవరీకి సహకారం
- మిస్సింగ్ కేసుల దర్యాప్తుల్లోనూ ఏఐ ఆధారిత వ్యవస్థ దోహదం

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** వాహన చోరుల పాలిటి సింహస్వప్నంగా ఆర్‌టిజిఎస్ సిసిటివి360 మారింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణలకు, బహుళ ప్రయోజనాల ఆశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సిసి కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటిని సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్)కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా ప్రస్తుతం 14,750 సిసి కెమెరాలున్నాయి. వీటిని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు ఆధారితంగా పనిచేసేలా ఆర్‌టిజిఎస్ సిసిటివి360 అనే వ్యవస్థను రూపొందించారు. ఈ వ్యవస్థ ఇప్పుడు పోలీసులకు కేసుల దర్యాప్తులో అత్యంత సహాయకారిగా, కీలక సాధనంగా మారుతోంది. పలు కేసులు ఛేధించడంతో పోలీసులకు కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తోంది.

**వాహనాల దొంగల ఆటకట్టు:** వాహనాలను చోరీ చేసే దొంగల పాలిట ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ ఇప్పుడు సింహస్వప్నంలా మారుతోంది. రాష్ట్రంలో దొంగలు ఎక్కడ వాహనాల చోరీలకు పాల్పడినా, ఆ వాహన వివరాల ఆధారంగా చోరీకి గురైన వాహనాలను సిసికెమెరాల ద్వారా ఆర్‌టిజిఎస్ గాలించి, ఆ వాహనాల ఆచూకీ గురించి పోలీసులకు రియల్ టైమ్‌లో సమాచారం చేరవేస్తోంది. దీంతో ఈ కేసులను పరిష్కరించడం పోలీసులకు చాలా సులభంగా మారుతోంది.

**4 నెలల్లో 80 వాహనాల స్వాధీనం:** నాలుగు నెలల్లో 81 వాహనాల రికవరీకి సహకారించింది. మిస్సింగ్ కేసుల దర్యాప్తుల్లోనూ దోహదపడుతున్న ఏఐ ఆధారిత వ్యవస్థ గురించి పోలీసుశాఖ సమాచార పత్రాన్ని విడుదల చేసింది. ఈ సమాచారాన్ని అనుసరించి ఈ నెల ఒకటో తేదీ బాపట్ల జిల్లా చీరాల. చిత్తు కాగితాలు ఏరుకుని జీవనం సాగించే తల్లి. తన ఆరునెలల చంటిబిడ్డను పొత్తిళ్లలు పెట్టుకుని ఫుట్‌పాత్ మీద ఓ దుకాణం ముందు నిద్రిస్తోంది. తెల్లవారుజామున ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో ఓ ఆగంతకుడు ఆమె చంటిబిడ్డను ఎత్తుకెళ్లాడు. ఆమె కన్నీరు మున్నీరైంది. బాపట్ల పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. బిడ్డను ఎత్తుకెళ్లిన నిందితుడ్ని పట్టుకోవడానికి ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ సహకారం కోరారు. బిడ్డను ఎత్తుకెళ్లిన వ్యక్తి కదలికలను ఎఐ ఆధారిత కెమెరాల ద్వారా జల్లెడపట్టి 24 గంటల్లోపే నిందితుడ్ని పట్టుకునేలా ఆర్‌టిజిఎస్ రియల్ టైమ్ అలెర్టులను పోలీసులకు పంపింది. అపహరణకు గురైన బాబును పోలీసులు తీసుకొచ్చి మళ్లీ ఆ తల్లి ఒడికి చేర్చారు. బిడ్డకోసం తల్లడిల్లిన ఆ తల్లి మళ్లీ పొత్తిళ్లలో తన బిడ్డను చూసి మురిసిపోయింది. ఆనందాశ్రువులు కార్చుతూ పోలీసులకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపింది. గుంటూరు నగరం పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవలే ఒక హోండా యాక్టివా స్కూటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎంత అన్వేషించినా దొరకలేదు. చివరకు పోలీసులు ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ సహకారం కోరారు. పోలీసులు అందించిన ఆ వాహనం వివరాల ఆధారంగా మ్యాట్రిక్ సిసి కెమెరాల ద్వారా వాహన కదలికలను అన్వేషించారు. జూన్ 17వ తేదీన ఆ స్కూటర్ గుంటూరులోని ఓ ప్రధాన కూడలి వద్ద తిరుగుతుండగా పోలీసులకు రిలయ్ టైమ్ అలర్టులు పంపారు. వెంటనే పోలీసులు నిందితుడ్ని పట్టుకుని విచారించగా, ఆ స్కూటర్‌తో పాటు మొత్తం ఏడు వాహనాలు చోరీ చేసినట్లు చెప్పడంతో ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

సురక్షిత ఎపి సాధన దిశగా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ పనితీరుకు పైరెండు సంఘటనలు ఒక చిన్న ఉదాహరణలు మాత్రమమే అని పోలీసుశాఖ పేర్కొంది. ఆర్‌టిజిఎస్ సిసిటివి360 అందించిన ఏఐ ఆధారిత సాంకేతిక సహకాం ద్వారా గత నాలుగు నెలల కాలంలో పోలీసులు 80కి పైగా చోరీకి గురైన వాహనాలను కనుగొని స్వాధీనం చసుకోగలిగారు. అదృశ్యమైన 73 మంది ఆచూకీని ఈ వ్యవస్థ కనిపెట్టగలిగింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 52 మంది నేరస్థుల ఆచూకీ కూడా కనుగొని వారిని పోలీసులు పట్టుకోవడానికి దోహదపడింది.

**ఎన్నో ఉదావారణలు:** విజయవాడ టు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో తన వాహనం చోరీకి గురైందని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఆ వాహన ఆచూకీ కోసం ఆర్‌టిజిఎస్ సిసిటివి360 సహకారాన్ని పోలీసులు కోరారు. దీంతో సిసికెమెరాల ద్వారా ఆ వాహన కదలికలపై పోలీసులకు ఆర్‌టిజిఎస్ ఎప్పటికప్పుడు అలర్టులు పంపడంతో ఆ వాహనాన్ని పట్టుకోగలిగారు. కుటుంబ తగాదాల కారణంగా ఆమె భర్తే ఆ వాహనాన్ని అపహరించినట్లు విచారణలో తేలింది. నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మోటారు సైకిల్‌ను చిల్లకల్లువద్ద పటుకోగలిగారు. ఏ.ఎస్.నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోనూ ఇలాగే చోరీకి గురైన వాహనాన్ని ఈ సాంకేతిక సహకారంతో పోలీసులు ఇట్టే పట్టుకోగలిగారు.

విస్సన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వాహన చోరీ కేసు సుదీర్ఘకాలం పెండింగులో ఉంది. ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ ద్వారా పోలీసులు ఈ కేసును ఇటీవలే ఇట్టే పరిష్కరించగలిగారు. ఈ పరిధిలోనే చోరీకి గురైన మరో వాహనాన్ని కూడా పోలీసులు ఇట్టే పట్టుకోగలిగారు. మదనపల్లె టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గత ఏప్రిల్ 27న నమోదైన ద్విచక్ర వాహన చోరీ కేసును కూడా అక్కడి పోలీసులు ఆర్‌టిజిఎస్ సిసిటివి360 సాంకేతిక సహకారంతో ఛేదించగలిగారు.

మనుషుల అదృశ్యం కేసుల్లోనూ ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది. మైలవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మహిళ అదృశ్యం కేసు నమోదైంది. ఎంత గాలించినా ఆమె ఆచూకీ తెలీక చాలా కాలంగా ఆ కేసు పెండింగులో ఉంది. దీంతో పోలీసులు ఈ కేసు పరిష్కారం కోసం ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ సహకారం అడిగారు. ఫేషియల్ రికగ్నిషన్ విశ్లేషణ ద్వారా ఆ మహిళ ఆచూకీని కనుగొని పోలీసులకు అలర్టులు పంపారు. దీంతో పోలీసులు ఆమెను పట్టుకుని ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి ఈ కేసు పరిష్కరించగలిగారు. అదే రోజు ఎస్.ఆర్.పేటలో ఒక బాలిక అదృశ్యమైందనే కేసు నమోదైంది. అదృశ్యమైన బాలిక ఆ చూకీని అదే రోజు కొన్ని గంటల్లో కనుగొని ఆమెను ఆ కుటుంబ సభ్యులకు అప్పగించడంలో ఈ వ్యవస్థ సహకారం అందించింది. రెడ్డిగూడెంలో కూడా ఇటీవలే అదృశ్యమైన ఓ వ్యక్తి ఆచూకీని ఇలాగే కనుగొనగలిగారు. అదృశ్యమైన వ్యక్తి వాహన కదలికలను కెమెరాల ద్వారా పసిగట్టి ఆయన్ను కనుగొనేలా ఈ వ్యవస్థ దోహదపడింది.



## అందరికీ సంస్కృతం.. అకాడమీ లక్ష్యం

### తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్‌చంద్ర

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** పండితులు మాత్రమే సంస్కృతం అధ్యయనం చేయగలరన్న అపోహను దూరం చెయ్యాలి అన్న లక్ష్యంతో సంస్కృత అకాడమీ పనిచేస్తుంది, అందుకు తగ్గ మార్గనిర్దేశం చేయాల్సిందిగా వద్దేశ్వరంలోని తెలుగు, సంస్కృత అకాడమీలో సోమవారం నిర్వహించిన సంస్కృత మేధావుల సదస్సును ఉద్దేశించి ఛైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర అన్నారు. దేశం భిన్నకులాలు, మతాలుగా విడిపోయిన ఈ సంధికాలంలో దేశం మొత్తాన్ని కలిపి ఉంచగలిగే శక్తి సంస్కృత భాషకు ఉందని విల్సన్ అన్నారు. 'అమృతం మధురమైంది. సంస్కృతం అంతకంటే మధురమైంద్ని అంటూ సంస్కృత వ్యాక్యాన్ని ఉదహరిస్తూ 'అమృతం మధురం సమ్యక్ సంస్కృతం హితతోదక్షం' అన్నారు. ఈ విశ్వం సంస్కృత భాషతో సామన్వితమై వుంది అనేది వైదిక వాక్కు అని గుర్తు చేశారు. ప్రాచీనకాలంలో దేశంలో సంస్కృత భాష కేవలం స్పష్టంగా ఉండడమే కాదు అది మన జ్ఞానానికి తల్లిగా ఉంది. కానీ ఈ ఆధునికాలంలో ఈ భాష కేవలం ధార్మిక విషయాలకే పరిమితమైందనే అభిప్రాయం జనాల్లో వుంది అని శరత్ చంద్ర గుర్తుచేశారు. ఈ సందర్భంగా సంస్కృత పండితులు పలు సూచనలు చేశారు. అకాడమీ నేతృత్వంలో సంస్కృత సప్తాహ కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సంస్కృత భాష వ్యాప్తి కోసం చిన్న చిన్న పుస్తకాలు వేసి విద్యార్థుల్లోకి తీసుకెళ్ళాలని కోరారు. అందులో నీతి కథలూ, జాతీయ భావనలతో కూడినవి ఉండాలి అన్నారు. 'సంస్కృతం.. తెలుగు భాషలు తల్లి.. బిడ్డల్లు లాంటివి అని ఆచార్య దీక్షితులు అన్నారు. సంస్కృత అకాడమీ యూ ట్యూబ్ ఛానల్ ద్వారా భాష అభివృద్ధికి దోహదం చెయ్యాలి అన్నారు. ఆచార్య దొర్భల ప్రభాకర్ శర్మ మా ట్లాడుతూ ప్రపంచంలో మెదట పుట్టిన భాష సంస్కృతమే అన్నారు. హెబ్రూ భాష కంటే ప్రాచీనమైనదన్నారు. ఆచార్య రమణ శాస్త్రీ మాటాడుతూ రాష్టములో ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కలిపిస్తే సంస్కృతంలో ఒరియాంటేషన్ క్లాసులు నిర్వహిస్తాం అన్నారు. సమావేశంలో ఆచార్యులు పిటిజివి రంగా చార్యులు, డాక్టర్. పాలపర్తి శ్యామలా నంద, డాక్టర్ దివి నరసింహ దీక్షితులు, డాక్టర్ వందన రావు, డాక్టర్ రమణ మూర్తి, ఆచార్య మారుదూరి నరసింహాచార్యులు, పిన్నమనేని భవాని, తిరుపతి సంస్కృత యూనివర్సిటీ ఆచార్యులు నందన్ రావు, డాక్టర్ కనపాల కుమార్, విజి చంద్రన్‌లతో పాటు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరి, డాక్టర్ ఎస్.వి టి.రాజ్యలక్ష్మి, డాక్టర్ గ్లోరీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆయన బాధను బయటకు వ్యక్తం చేయర్లు'



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కల్యాణ్‌కు ఇటీవల కుడి భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ క్రమంలో ఆయన సతీమణి అన్నా పవన్ కల్యాణ్ కొణిదెల 'ఎక్స్' వేదికగా తన మనస్సులో మాటను పంచుకున్నారు. 'పవన్ తన జీవితంలో శారీరక నొప్పి కంటే తీవ్రమైన ఎన్నో భారాలను మోశారు. ఎంతటి కష్టమైనా ఫిర్యాదు చేయని ఆయన, నొప్పి భరించలేని స్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే తన బాధను బయటపెడతార్లు అని ఆమె భావోద్వేగంగా తెలిపారు. ముంబైలోని ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పరామర్శించిన ఫొటోను అన్నా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం తన దృష్టంతా పవన్ ఆరోగ్యంపైనే ఉందని తెలిపారు. 'ఇప్పుడు నా పని ఒక్కటే.. ఆయన్ను జాగ్రత్తగా చూసుకోవడం. ఆయన సురక్షితంగా ఉన్నారనే నమ్మకం కల్పించడం. ఒక్కో రోజు ముందుకు సాగుతూ ఆయన పూర్తిగా కోలుకుంటార్లు అని ఆమె భావోద్వేగంగా రాశారు. జులై 11న పవన్ కల్యాణ్‌కు ముంబైలోని ఆసుపత్రిలో కుడి భుజానికి ఆర్థోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించారు. రోటేటర్ కఫ్‌లోని సుప్రాస్పినేటస్, ఇన్‌ఫ్రాస్పినేటస్ టెండన్లకు తీవ్ర గాయం కావడంతో పాటు భుజం ఎముకలో ఫ్రాక్చర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్దీవాలా నేతృత్వంలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైందని ఆసుపత్రి ప్రకటించింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆరోగ్యంగా కోలుకుంటున్నారని, కొంత విశ్రాంతి అనంతరం ప్రత్యేక రిహాబిలిటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వైద్యులు తెలిపారు. సుమారు నాలుగు నెలల్లో భుజం పూర్తిస్థాయిలో కోలుకునే అవకాశం ఉందని ఆరోగ్య బులెటిన్‌లో పేర్కొన్నారు.

## సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త

### పాత పెన్షన్ విధానం ఎంచుకునేందుకు మరో చాన్స్

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సిపిఎస్) ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) ఎంచుకునేందుకు ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ ఆర్థిక శాఖ జిఒ ఎంఎస్ నెం.53ను విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వచ్చి, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులుగా ఉండనున్నారు. ఈ ఉద్యోగులు సిపిఎస్ నుంచి ఓపిఎస్‌కు మారేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, జిఒ జారీ అయిన తేదీ నుంచి మూడు నెలల లోపు అర్హులైన ఉద్యోగులు తమ ఆప్షన్‌ను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఒకసారి ఓపిఎస్ లేదా సిపిఎస్‌కు సంబంధించి ఉద్యోగి ఎంచుకున్న ఆప్షన్‌ను మార్చుకునే అవకాశం ఉండదని ప్రభుత్వం పేర్కొంది. గడువులోపు ఎలాంటి ఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు యథావిధిగా సిపిఎస్ పరిధిలోనే కొనసాగుతారని జిఒలో స్పష్టం చేసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన జిఒ ఎంఎస్ నెం. 53ను ఆర్థిక శాఖ అధికారికంగా విడుదల చేసింది.

## భార్యను వేధించిన కేసులో భర్తకు యేడాది జైలు

**చిత్తూరు, జులై 13 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం భరత్‌నగర్‌కు చెందిన వై.సిమోన్ సుదర్శన్(32)కు చిత్తూరు 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. చిత్తూరు భరత్‌నగర్‌లో మౌనిక ప్రియదర్శిని తన భర్త వై.సిమోన్ సుదర్శన్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు తనను మానసికంగా, శారీరకంగా వేధించడంతో పాటు బెదిరిస్తున్నారని 28 నవంబర్ 2020న చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి మహిళా స్టేషన్ ఎస్ఐ నిత్యానందం పిళ్ళై ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించి కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేశారు. ఈ కేసు పూర్వపరాలను విచారించిన జడ్జి సోమవారం తీర్పు వెలువరించారు. సుదర్శన్‌పై నేరం రుజువైందని, ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా చెల్లించాలని ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు తీర్పు వెలువరించింది. ఎ2 నుండి ఎ8 వరకు వున్న నిందితులను కోర్టు నిర్ధోషులుగా ప్రకటించింది.

## 'సర్' గడువును 3నెలలు పొడిగించాలి

- అర్హులందరిని ఓటర్లుగా నమోదు చేసే వరకు వదిలిపెట్టేది లేదు
- రాష్ట్ర ఎన్నికల కమీషనర్ వివేక్ యాదవ్‌కు సిపిఐ వినతి

**సచివాలయం, జులై 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుతం కొనగుతున్న 'సర్' ప్రక్రియ గడువును తక్షణమే మరో మూడు నెలల పాటు పొడిగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించే బాధ్యతను ఎన్నికల కమీషన్ తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల కమీషనర్ వివేక్ యాదవ్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.జగదీష్ కలసి క్షేత్రస్థాయిలో అక్రమాలు, ఇబ్బందులపై సుదీర్ఘంగా వివరించి. సవివరమైన వినతి పత్రాన్ని సమర్పించారు.



ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కు విషయంలో కమీషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించకూ డదని, తక్షణమే స్పందించిన నిర్ధష్టమైన కాల వ్యవధితో గడువును పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## గడువులోపు డిజిటలైజేషన్ పూర్తి

- 'సర్' ప్రక్రియ మరింత వేగవంతం
- కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్



'సర్' ప్రక్రియను పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్

**చిత్తూరు, జులై 13 ప్రభాతవార్త:** నిర్దేశించిన గడువులోపు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సోమవారం చిత్తూరు నగర పరిధిలోని దొడ్డిపల్లి పోలింగ్ స్టేషన్ 14, గాయత్రినగర్ పోలింగ్ స్టేషన్ 132ల్లో 'సర్' ప్రక్రియ ఎలా సాగుతుందనే విషయంపై బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఇంటింటా సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంను ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘ కార్యదర్శి జిల్లాలో 'సర్' ప్రక్రియ ఎలా జరుగుతున్నది! ఎంత మేరకు పూర్తయ్యింది! పెండింగ్‌లో వున్న దరఖాస్తుల స్థితి! ఎమైనా ఫిర్యాదులు వున్నాయా! తదితర అంశాలపై పరిశీలిస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 97 శాతం ఎస్ఎస్ఆర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ప్రస్తుతం సుమారు 40వేల దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయని, వీటిలో కొన్నింటిని సత్వరం పరిష్కరించ గలుగుతామని, మరికొన్నింటిని అవసరమైన ధృవీకరణ అనంతరం నిర్ణయం తీసకుంటామన్నారు. జిల్లాలో ఎవరికైనా 'సర్' దరఖాస్తులకు సంబంధిచి సమస్యలు, సందేహాలు వుంటే బిఎల్‌ఓలను సంప్రదించాలని, మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. సర్ ప్రక్రియను పారదర్శకంగా, కచ్చిత త్వంగా నిర్వహిస్తున్నామని, 2002 జాబితాలో ఓటు లేకపోయినా, ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు కార్డుల్లో ఎదో ఒకటి ఎన్యుమరేషన్ ఫారంతో పాటు బిఎల్‌ఓలకు అందించాలన్నారు. ఈ నెల 21న ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అందులో పేర్లు లేకపోయినా ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గుర్తింపు కార్డుల్లో ఎదో ఒకటి బిఎల్‌ఓలకు అందజేస్తే తుది ఓటరు జాబితాలో పేరును చేర్చడం జరుగుతుందన్నారు. 'సర్'లో అర్హుల ఓట్లను తొలగించే ప్రసక్తే లేదన్నారు.

ఈ కార్యక్రమంలో అర్డిఓ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయ లక్ష్మి, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఐరాల, చిత్తూరు నగర తహసిల్దారు, బిఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్ సాయికృష్ణ మృతి కేసులో అప్రూవర్‌గా సిఐ స్నేహితుడు సురేష్



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** రౌడీషీటర్ సాయికృష్ణ మృతి కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసులో ప్రైవేటు వ్యక్తి అయిన సురేష్ పాత్రే ప్రధానంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కోర్టుకు సమర్పించిన మెమోలో సైతం సిట్ అధికారులు సురేష్‌ను నిందితుడిగా చేర్చారు. అతన్ని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటివరకు అతడిని అధికారికంగా అరెస్టు చేసినట్లు చూపించలేదు. ఇప్పటికే పలు పర్యాయాలు సురేష్‌ను కృష్ణలంకకు పోలీసులు పిలిపించి విచారించారు. సోమవారం కూడా పోలీసులు అతడిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సిట్ అధికారుల విచారణలో సురేష్ అనేక కీలక విషయాలు వెల్లడించినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సురేష్ ఈ కేసులో అప్రూవర్‌గా మారే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాల సమాచారం. సురేష్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సిట్ అధికారులు కృష్ణలంక పిఎస్ సిబ్బందిని విచారిస్తున్నారు. అయితే, తాము విచారించినప్పుడు తమకేమీ తెలియదని కొందరు సిబ్బంది తప్పించుకునే ప్రయత్నం చేసారంటున్నారు. ఆ ఘటన జరిగిన సమయంలో తాము డ్యూటీలో లేమని, బయట ఉన్నామని మరికొందరు చెప్పారు. దీంతో అధికారులు సాంకేతిక ఆధారాలపై దృష్టి సారించారు. స్టేషన్ సిబ్బంది కాల్ డేటా రికార్డులను (సిడిఆర్) సేకరించి విశ్లేషిస్తున్నారు. అయితే ఈ కేసులో సాయికృష్ణపై థర్డ్ డిగ్రీ ప్రయోగించలేదని, అయితే గట్టిగా లాఠీతో కొట్టిన సందర్భంలో అతను ఎదురు తిరిగి, ఒక బాలిక విషయంలో సిఐ నాగరాజు బూటు కాలితో అతని మర్మాంగాలపై తన్నారని, దాంతో అతను బిగ్గరగా కేకలు వేస్తుంటే అక్కడ వదిలివెళ్ళారని, తరువాత సాయికృష్ణ చనిపోయాడని కొందరు చెప్పినట్లు సమాచారం. అయితే సిట్ అధికారులు ఈ అంశాన్ని ధ్రువీకరించలేదు. అయితే పోలీసులు అదుపులో ఉన్న సురేష్ సిఐ నాగరాజుకు అత్యంత సన్నిహితుడు అని వారు స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రైవేటు వ్యక్తి అయినప్పటికీ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సురేష్ చెప్పిందే వేదంగా సాగేది. స్టేషన్‌లో అనధికారికంగా పెత్తనం అంతా అతడే చేసేవాడని విచారణలో తేలింది. ఈ సాన్నిహిత్యంతోనే సాయికృష్ణ వ్యవహారంలో సురేష్‌కు అంతా తెలుసని దర్యాప్తులో బయటపడింది. సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి అతడు మృతి చెందడం, ఆ తర్వాత శవాన్ని మాయం చేయడం వరకు ప్రతి అంశంలో సురేష్‌కు ప్రమేయం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.


## బుచ్చి పోలీస్‌స్టేషన్‌పై వేటు

- సిఐ మాతంగి శ్రీనివాసరావు రేంజి విఆర్‌కి
- ఎస్ఐ సతోష్‌రెడ్డి జిల్లాలో విఆర్‌కి
- 21 మంది కానిస్టేబుల్స్ పై బదలీ వేటు




**బుచ్చి (నెల్లూరు), జులై 13 ప్రభాతవార్త:** జిల్లా చరిత్రలో ఇంత వరకు ఎప్పుడు జరగని విధంగా ఒక పోలీస్‌స్టేషన్ మొత్తంపై వేటు పడిన సంఘటన బుచ్చి పోలీస్‌స్టేషన్‌కి జరిగింది. ఇటీవల వ్యవసాయాధికారి శ్రీహరి మృతి హత్య కాగా దానిని తప్పుదోవ పట్టించినందుకు పర్యావసనం ఇది. జిల్లా ఎస్పి అజితా వేజండ్ల నిర్ణయాన్ని జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. సూపర్ ఎస్పి అంటు ప్రశంసిస్తున్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీహరి మృతి చెందిన రోజు మినగల్లుకి వెళ్లిన ప్రతి ఒక్కరికి మృతదేహాన్ని చూస్తేనే అర్థం అవుతుంది ఇది ముమ్మాటికి హత్యేనని కాని కుటుంబ సభ్యులు మౌనం అందర్ని కట్టి పడవేసింది. మౌనం వెనుక ఆంతర్యం అర్థంకాక అందరి మనస్సులు బరువెక్కాయి. చేతికి గ్లౌజులు వేసుకుని శ్రీహరి బాడిమొత్తాని పరిశీలించిన సిఐకి అర్థమైనా విచారణ చేపట్టకుండా గుండెపోటు అంటు మౌనం వహించడంతో కేసు తప్పుదోవ పట్టింది. మృతుడు శ్రీహరి మొదటి భార్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇవ్వడంతో జిల్లా ఎస్పి అజెండ్ల శ్రీకేసుపై దృష్టిపెట్టారు. డిఎస్పి ఘంటా శ్రీనివాస రావుకి కేసును విచారించమని ఆదేశించడంతో అసలు కథ బయట పడింది. సొంత బావమరిదే మరో ఇద్దరితో కలిసి ఇంతటి ఘాతకానికి ఒడి కట్టాడని, ఇది ముమ్మాటికి హత్యేనని విచారణలో తేలడంతో జిల్లా ఎస్పి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐ మాతంగి శ్రీనివాసరావుని రేంజి విఆర్‌కి బదలీ చేశారు. అలాగే ఎస్ఐ సంతోష్‌రెడ్డిని జిల్లాలో విఆర్‌లో ఉంచారు. 21 మంది కానిస్టేబుల్స్‌ని బదలీ చేసి జిల్లా ఎస్పి సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీంతో పోలీస్ శాఖ ఒక్కసారిగా ఉలిక్కి పడింది.

## కరాటే పోటీల్లో సత్యవేడు విజేతలు 8 మందికి 19 గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్





**సత్యవేడు, జులై 13 ప్రభాతవార్త:** గోవా బోసోటర్ పంచాయతీ కమ్యూనిటీ హాలులో 2026 నేషనల్ యూత్ స్పోర్ట్స్ కాంపిటీషన్ ఆధ్వర్యంలో జూలై 11,12 తేదీల్లో జరిగిన కరాటే పోటీల్లో తిరుపతి జిల్లా సత్యవేడుకు చెందిన 8 మంది కరాటే వీరులు 19 గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఆంధ్రప్రదేశ్ కరాటే మిషన్ సత్యవేడుకు చెందిన జి.భువనేశ్వర్, తెలంగాణ బాక్సింగ్ కోచ్ కిరణ్ పర్యవేక్షణలో జాతీయ యూత్ స్పోర్ట్స్ కాంపిటీషన్ నిర్వహించారు.కరాటే కాంపిటీషన్‌లో 320 ఈవెంట్లు జరగగా ఆంధ్రప్రదేశ్ 33 బంగారు పతకాలు, ఆరు వెండి పతకాలుసాధించి విజేతలుగా కరాటే వీరులు అదరగొట్టారు. ఈ నేపథ్యంలోనే సత్యవేడుకు చెందిన 8 మంది కరాటే విజేతలు కట్ట, కుముతే విభాగాల్లో పతకాలు సాధించారు. ఈ క్రమంలో అండర్-14 బాలికల విభాగంలో టీం కట్ట విభాగంలో విజేతలుగా లక్షిక, ప్రియ, నాజియా భాను గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. అండర్-14 బాలుర టీమ్ కట్ట విభాగంలో విజేతలుగా ఆరిఫ్ బాబ, మోహిత్, రిత్విక్ యాదవ్ పొంకం గోల్డ్ మెడల్ సాధించారు. సీనియర్ కేటగిరి అండర్-17 ఇయర్స్ పవిత్ర వ్యక్తిగతంగా గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. అలాగే అండర్-14 బాలుర విభాగం కట్టాలో ఆరిఫ్ బాబా గోల్డ్ మెడల్ మోహిత్ గోల్డ్ మెడల్, రిత్విక్ యాదవ్, సిల్వర్ మెడల్ సాధించగా వీరిని అందరూ అభినందించారు.

## ఎఇఇ నియామకాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు లేదు

### ఎపిట్రాన్స్‌కో జెఎండి సూర్యసాయి ప్రవీణ్ చంద్

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పవర్ యుటిలిటీస్‌లో 629కు పైగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) పోస్టుల భర్తీకి సంబంధించి 2026 జూన్ 25న విడుదల చేసిన నియామక నోటిఫికేషన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తున్నదని ఎపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పిస్తున్న నేపథ్యంలో, దరఖాస్తుల గడువు పొడిగింపుపై సామాజిక మాధ్యమాలు, ఇతర అనధికారిక వేదికల్లో ప్రచారంలో ఉన్న వార్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ విశ్వసించ వద్దని ఆయన అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. నియామక నోటిఫికేషన్‌లో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని, దరఖాస్తుల సమర్పణకు 2026 జులై 20 చివరి తేదీగా నిర్ణయించబడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ గడువులో ఎలాంటి మార్పు ఉండదని, దరఖాస్తుల స్వీకరణకు అదనపు గడువు ఇవ్వబడదని స్పష్టం చేశారు. చివరి రోజుల్లో సాంకేతిక రద్దీ లేదా ఇతర కారణాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, ఇంకా దరఖాస్తు చేయని అర్హులైన అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించి, దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, నియామక ప్రక్రియలో భాగంగా నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్ష కూడా నోటిఫికేషన్‌లో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే 2026 ఆగస్టు 22 నుంచి ప్రారంభమవుతుందని, పరీక్ష తేదీల్లో కూడా ఎలాంటి మార్పు ఉండదని సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షల షెడ్యూల్‌పై ఎలాంటి సందేహాలకు తావులేకుండా తమ సన్నాహాలను ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కొనసాగించాలని సూచించారు. నియామక ప్రక్రియకు సంబంధించిన అన్ని అధికారిక సమాచారం సంబంధిత వెబ్‌సైట్ ద్వారానే విడుదల చేయబడుతుందని, అందువల్ల అభ్యర్థులు అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని ఆయన కోరారు. సామాజిక మాధ్యమాలు లేదా ఇతర అనధికారిక వేదికల ద్వారా ప్రచారంలో ఉన్న తప్పుడు సమాచారం, వదంతులు లేదా నిర్ధారణలేని వార్తలను నమ్మి అయోమయానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నోటిఫికేషన్‌లో పేర్కొన్న షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు, సూచనలు, నిబంధనలను జాగ్రత్తగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రవీణ్ చంద్ కోరారు.

# అన్నీ షేరింగ్‌కు కుదరవు



ఆపాదమస్తకం అందంగా మెరిసిపోవాలని అందరికీ ఉంటుంది. అందుకోసం మేకప్‌ను కూడా ఆశ్రయిస్తూ ఉంటాం. ఈ క్రమంలో కొందరు మేకప్ ఉత్పత్తులు అందులో ఉపయోగించే బ్రష్‌లను సైతం ఇతరులతో పంచు కొంటూ ఉంటారు. మీరూ అంతేనా? అయితే జాగ్రత్త! అలా చేయడం వల్ల చర్మానికి హాని కలిగే అవకాశాలు చాలానే ఉన్నాయంటున్నారు నిపుణులు. మరి, సౌందర్య సంరక్షణలో భాగంగా ఏయే ఉత్పత్తులను ఇతరులతో పంచుకోకూడదో తెలుసుకుందామా.. స్నేహితులు లేదా బంధువుల్లో ఎవరివైనా లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్/ మేకప్ బ్రష్.. ఇలా ఏది కనిపించకపోయినా వెంటనే పక్కనున్న వాళ్లు ఇదిగో.. నాది తీసుకో అంటూ అందించడం లేదంటే మనమే వాళ్లను అడగడం సర్వసాధారణమే. అయితే ఆ క్షణానికి అందంగా కనిపించడానికి అది ఉపయోగపడినా ముందు ముందు మాత్రం సౌందర్యపరంగా చాలా నష్టాలే ఎదుర్కోవాల్సి రావచ్చు. అందుకే సౌందర్య సంరక్షణలో భాగంగా కొన్ని ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.

మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను కూడా ఇతరులతో పంచుకోకూడదు. ఇతరులు వాటిని ఉపయోగించినప్పుడు వారి చర్మం మీద ఉండే బ్యాక్టీరియా, క్రిములు వంటివి మేకప్ ఉత్పత్తుల్లోకే కాదు. వాటిని తిరిగి మనం ఉపయోగించినప్పుడు మన చర్మం మీదకు కూడా చేరతాయి. కాబట్టి మేకప్ వేసుకోవ డానికి ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు ఇతరులతో పంచు కోకుండా ఉండడం మంచిది. లిక్విడ్ ఫౌండేషన్, లిక్విడ్ ఐ లైనర్, క్రీమ్ రూపంలో ఉండే ఉత్పత్తులు, నెయిల్‌పాలిష్, హెయిర్ బ్రష్‌లు, క్లెన్సింగ్‌కి ఉపయోగించే స్పాంజ్‌లు మేకప్ వేసుకోవడానికి వాడే పఫ్‌లు, ఐ లాష్ కర్లర్, ట్వీజర్స్, ప్లక్కర్స్, లిప్‌బామ్, స్నానానికి ఉపయోగించే ఉత్పత్తులు, సాధనాలు.. మొదలై నవన్నీ ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిది.

**పౌడర్ రూపంలో ఉంటే...** మేకప్‌లో ఉపయోగించే ఫౌండేషన్, ఐ షాడో.. వంటివి కొన్ని పౌడర్ రూపంలో కూడా ఉంటాయి. అయితే వీటిని ఒకరి కంటే ఎక్కువమంది చేతితో తాకినా లేదా బ్రష్‌తో అప్లై చేసుకున్నా అందులో బ్యాక్టీరియా చేరే అవకాశాలు ఎక్కువ. ఫలితంగా మొటిమలు రావడం, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు దరిచేరడం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి పౌడర్ రూపంలో ఉన్న ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.

**లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్:..** చాలామంది రంగు బాగుందనో లేక మంచి లుక్ ఇస్తుందనో ఇతరుల లిప్‌స్టిక్/ లిప్‌గ్లాస్ ఉపయోగిస్తూఉంటారు. అయితే ఇతరులవి మనం ఉపయోగించడం వల్ల వాటిపై ఉన్న బ్యాక్టీరియా మన అధరాల పైకి చేరే అవకాశాలు లేకపోలేవు. అలాగే మన అధరాలపై ఉన్న తేమలో ఉండే బ్యాక్టీరియా కూడా వాటికి తోడై పెదాలకు హాని కలిగించవచ్చు. కాబట్టి ఇవి కూడా ఎవరివి వారూ ఉపయోగించుకోవడం శ్రేయస్కరం.

**కళ్ల సంబంధిత ఉత్పత్తులు...** ఐ షాడో, మస్కారా, ఐ లైనర్.. వంటి ఐ మేకప్ ఉత్పత్తులను చాలా జాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇతరుల ఐ మేకప్ ఉత్పత్తులు ఉపయోగించేటప్పుడు వారికి ఏమైనా కళ్ల సంబంధిత ఇన్ఫెక్షన్లు ఉంటే అవి మనకు కూడా వచ్చే అవకాశాలు లేకపోలేవు. అలాగే ఆ ఉత్పత్తుల్లోని బ్యాక్టీరియా వల్ల కళ్లు ఎర్రబడడం, నీళ్లు కారడం, మండడం..వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.

**మూతలు ఉండేవి..** కొన్ని రకాల క్రీమ్‌లు, పౌడర్లు మూతలు ఉండే చిన్న చిన్న సీసాల్లో లభ్యమవుతుంటాయి. వీటిని కూడా ఇతరులతో పంచుకోకూడదు. అలా షేర్ చేసుకోవడం వల్ల వారు ఉపయోగించి నప్పుడు వారి చేతుల్లో ఉండే హాని కారక బ్యాక్టీరియా ఈ ఉత్పత్తుల్లోకి చేరుతుంది. అవి మనం వాడడం వల్ల మన చర్మానికి కూడా నష్టం వాటిల్లుతుంది. ❑

**చిట్కా**

రాత్రిపూట దిండుమీద తులసి ఆకులు ఉంచుకొని పడుకుంటే తలలో పేలు మాయమవుతాయి. ❑

# ఇహాపరాలు

ఇహాపరాలకు సంబంధించిన విషయాలను ప్రస్తావించింది సుపర్ణసూక్తం. సుపర్ణం అంటే రెండు రెక్కలున్న ప్రాణి. కొమ్మపైనున్న రెండు పక్షుల్లో ఒకటి రావిపళ్లు తింటోంది. రెండోది చూస్తోంది. ఒకటి కర్మఫలం అనుభవించే జీవాత్మ. రెండోది కర్మకు తగ్గ ఫలాన్ని నిర్ణయించే పరమాత్మ. సుపర్ణ శబ్దం సూర్యుడికి, గరుతమంతుడికి, జీవాత్మకు సమానం. కర్మసాక్షి అయిన సూర్యుడికి పగలూ రాత్రి.. గరుత్మంతుడికి శక్తి, భక్తి.. జీవుడికి ప్రాణం. జ్ఞానం రెక్కలతో సమానం. మనిషిలో సూర్యుడిద్వారా ప్రాణశక్తి, గరుడుడికి ద్వారా సూక్ష్మ బుద్ధి ప్రవేశించి జీవాత్మను జీవుడిగా మార్చాయి. అతడిలోని చైతన్యం కర్మలకు పురిగొలిపి కర్మఫలాలను తినిపిస్తుంది. అందుకే అతడు రాగ ద్వేషాలకూ, కష్ట సుఖాలకూ ఆహారమౌతాడు. మనిషి భోక్తాసుపర్ణుడు. స్వార్థం రెక్క విప్పితే సుడిగుండం, త్యాగం రెక్క విప్పితే మోక్షగుండం. సూర్యుడు ఆత్మకారకుడు. పగలంతా లోకాలను వెలిగించి, రాత్రి పడమటి సముద్రంలో తల దాచుకుంటాడు. రెక్కలార్చి గగన విహారం చేసే ఎర్రని పక్షి, నీటిని పీల్చుకుని, వర్షం కురిపిస్తుంది తృప్తినిస్తుంది. జీవరాశిని రక్షిస్తుంది- అని రుగ్వేదం సూర్యుణ్ణి వర్ణిస్తుంది. గరుత్మంతుడు తల్లి దాస్యం తప్పించడానికి స్వర్గాన్ని జయించి అమృతం తెచ్చాడు. పని పూర్తయిన వెంటనే తిరిగెళ్లి అమృతకలశాన్ని ఇంద్రుడికే సమర్పించాడు. ఇహాపరాల నడుమ జీవనం సాగిస్తూ కష్టసుఖాలు చవిచూస్తూ వైరాగ్యంతో జీవన్ముక్తిని పొందడమే జీవిత పరమార్థం. నిష్కామకర్మ మార్గమే గమ్యానికి గమకం. ❑

నాభి భాగంలో రాత్రి సమయంలో నూనె రాసి మర్దన చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. సంప్రదాయ భారతదేశంలో ఈ పద్ధతిని చిన్నారి

# నాభిలో నూనె వేస్తే..



**పుట్టినప్పటినుంచి మన అమ్మలు, అమ్మమ్మలు అనుసరించారు. దీనికి కొబ్బరి, బాదం, అవనూనెలను ఉపయోగించ వచ్చు.**

★ రోజూ స్నానం చేసేటప్పుడు నాభిలో కొద్దిగా నూనె వేసి కాసేపాగి శుభ్రం చేయాలి. ఇంకా అల్లం, ఆవ నూనెల మిశ్రమాన్ని నాభి భాగంలో వేసి చుట్టూ ఉండే ప్రాంతాన్ని మర్దన చేయడం వల్ల కడుపునొప్పి, ఉబ్బరం, వికారం తగ్గుతాయి. ★. రాత్రి నిద్రించే ముందు నాభి భాగంలో రెండు చుక్కలు ఏదైనా నూనెను వేయడం వల్ల నెమ్మదిగా పిగ్మెంటేషన్ సమస్య తగ్గుతుంది. ★ మారుతున్న జీవనశైలీ, ఆమారపు అలవాట్లూ అనేక అనారోగ్యానికి దారితీస్తున్నాయి. వాటిలో ఒకటి చిన్న వయసులో కాళ్లనొప్పులు రావడం. కానీ ఈ బెల్లీ బటన్ ఆయిలింగ్ ద్వారా వీటిని నయం చేయవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. ❑

పాటలోనే కాదు ఆమె మాటలోనూ తడబాటు ఉండదు. గమకాల గతి తప్పకుండా తన స్వరాన్ని కోకిల స్థాయికి ఎలా తీసుకెళ్లగలరో తనకు దక్కని అవార్డు కోసం ఆమె అంతే స్థాయిలో ప్రతిస్పందించగలరు. పాతికేళ్లనాడే నా ఆశ.. అడియాసల

# నీలి మేఘాల సన్నిధి! సుస్వరాల పెన్నిధి !



మేళవింపులో తన తొలిస్వరాన్ని చిత్రసీమకు పరిచయం చేసారు. 2013లో కేంద్ర ప్రభుత్వం సుస్వరాల జానకిగా పేరు పడిన నేపథ్యగాయని శిష్టా జానకికి పద్మభూషణ్ పురస్కారానికి ఎంపిక చేసింది. ఆ అవార్డు తనకే వస్తోందంటే ఎగిరిగంతేయని, ఆనందడోలికల్లో ఊగిసలాడని 'సెలిబ్రిటీ' ఎవరూ ఉండరు. కానీ జానకి మాత్రం అరవై ఏళ్ల గానామృత సేవ అనంతరం వచ్చిన పురస్కారం ఒక పురస్కారమే కాదన్న భావనతో దానిని తిరస్కరించారు. దక్షిణాది కళాకారులకు సరైన సమయంలో గుర్తింపు రాలేదని వాపోతూ దానిని తిరస్కరించడమంటే ఆమెలోని నిబద్ధతను మెచ్చుకోవాల్సిందే. అది దేశ మూడో అత్యున్నత పౌరపురస్కారం. ఇలాంటి గౌరవాన్ని తృణీకరించడమంటే జానకిని మనోధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేం. నేను ఈ వయసులో ఇంతగా రాణించాక 'భారత రత్న'కు అర్హురాలిని కాగా 'పద్మభూషణ్' ఇప్పుడా? అని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నేరుగానే ప్రశ్నించారు. మరోచోట పుట్టి ఉంటేనా అంటూ నర్మగర్భంగా ఎత్తిపొడిచారు కూడా. అదీ ఎంతో ధీమాగా. నవ్వుతో పాడి నవ్వతగా అలరించి నవ్వునే నవ్వించగల ఆమె 'సిరిమల్లె పువ్వుల్లె నవ్వు' అంటూ నవ్వ మధురిమలు పండించారు. పసిపాప స్వరం నుంచి పండుముదుసలి స్వరం వరకు ఆమె పలికించిన రాగాలు స్వర రాగాలాపనలో అలవోకగా ఆమె పాడిన తీరు ఎంత ఆనందోత్తేజాలతో వీనుల విందుగా ప్రేక్షకులను అందించాయి. ప్రచారార్భాటాలకుగానీ, కీర్తికండూతికి గానీ ఆమె ఆమడ దూరంలో ఉన్నారు. తన స్వరం మారకముందే గౌరవంగా గానయాత్ర నుంచి తప్పుకోవాలని ఆమె అభిలషించారు. స్వర వైవిధ్యతతో సంగీత ప్రియుల్ని ఆకట్టుకున్నందువల్లె ఎంతో కాలం గాయనిగా నిలదొక్కున్నారావిడ. నుదుటిన నిండైన బొట్టుతో ఆమె ఎంతో గౌరవప్రదమైన రూపు రేఖావిలాసాలతో ఆకట్టుకునేవారు. తనకు పద్మభూషణ్ ఇస్తానన్నా ఎంతో తేలికగా తృణీకరించారంటే తన ఆత్మ గౌరవం ఎంతటిదో నిరూపించుకున్న ఆమె. దక్షిణాది గాత్రధారులు త్యాగయ్య, అన్నమయ్యలవంటి అసమాన ప్రతిభ కలిగిన వారు, గీతం ఏదైనా ఎలాంటిదైనా తన పద, స్వరలాలిత్యంతో శ్రోతలకు అభిమాన గాయనిగా మారారు. అందుకే ఆమె దక్షిణాది గానకోకిల'గా నీలిమేఘాలను దాటి అనంత వాయువుల్లోకి నిష్క్రమించారు. సినిమా పాటల్లో నవ్వాల్సివస్తే జానకి అంత అందంగా నవ్వే గాయని మరొకరు లేరేమో. ఏదో నవ్వడం కోసం నవ్వడం వేరు. అలవోకగా నవ్వడం వేరు. కొన్ని పాటల్లో ఆమె నవ్వు మాత్రమే ఉండేది. పాట ఎవరు పాడినా ఆమె పాటకున్న గిరాకీ అలాంటిది. 'అభిలాష' చిత్రంలో 'యురేకా సకామికా! 'జ్యోతి' సినిమాలోని 'సిరిమల్లె పువ్వుల్లె నవ్వు 'పాటలో ఆమె నవ్వు ఆ చిత్రాలకు వరహాలు కురిపించాయి. ఈ స్వరధుని గురించి ఒక్క మాట చెప్పుకోవాలి. హీరోలకు, హీరోయిన్‌లకు అభిమానిస్తూ విగ్రహాలు, గుడులు నిర్మించ వారుంటారు. గానీ ఓ స్వర మాధురి జానకి అంత్యక్రియలకు స్థలమిచ్చి ఆమె స్మారకార్థం ఒక భవ్య జ్ఞానమందిరంను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఓ కళాభిమాని. ఆమె అంత్యక్రియలు కూడా ఎంతో వైభవంగా జరుగుతున్నాయంటే ఆమె స్వరం జనం గుండెల్లో గూడుకట్టుకుని ఉందో అర్థమౌతుంది. ❑

# మసాలా స్వీట్ కార్న్ వడ

**కావలసినవి:** స్వీట్ కార్న్ : కప్పు పెసర పిండి కప్పు, బియ్యపిండి పావుకప్పు, ఉల్లి ముక్కలు పావు కప్పు, క్యాప్సికమ్ ముక్కలు పావు కప్పు, కొత్తిమీర తురుము 2 టేబుల్‌స్పూన్లు, వెల్లుల్లి ముద్ద పావుటీస్పూను, కారం టీస్పూను, పసుపు పావుటీస్పూను, నిమ్మరసం టీస్పూను, ఉప్పు తగినంత, చాట్ మసాలా, టీస్పూను, నూనె వేయించడానికి సరిపడా.

**తయారుచేసే విధానం :** స్వీట్‌కార్న్ కచ్చాపచ్చాగా రుబ్బాలి. అందులోనే మిగిలిన అన్ని దినుసులూ వేసి కలపాలి. ఇప్పుడు మిశ్రమాన్ని కొంచెం కొంచెంగా తీసుకుని వడల్లా వత్తి కాగిన నూనెలో వేయించి ఆపై చాట్‌మసాలా చల్లి గ్రీన్ చట్నీతో అందిస్తే సరి. ❑



## తెర

# 'రణబాలి' స్టిల్ షేర్ చేసిన రష్మిక



'రణబాలి' స్టిల్ షేర్ చేసిన రశ్మిక మందన్న 'రణబాలి' చిత్రాన్ని తెరపై చూసేందుకు ఆత్రుతగా వెయిట్ చేస్తున్నానంటూ రష్మిక ఇన్ స్టా పోస్ట్‌విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై రణబాలి సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా రణబాలి సినిమా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్ కు అన్ని సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి.ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉంది మూవీ. తాజాగా ఈ సినిమా సెట్స్ నుంచి ఓ ఇంట్రెస్టింగ్ స్టిల్ షేర్ చేశారు హీరోయిన్ రశ్మిక మందన్న. రణబాలి సినిమాలో విజయ్ నటిస్తున్న ఇంటెన్స్ సీన్ స్టిల్ తో ఆమె చేసిన ఇన్ స్టా పోస్ట్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఈ ఇన్ స్టా పోస్ట్ లో రశ్మిక స్పందిస్తూ ఈ స్టిల్ ఇప్పుడే మీతో షేర్ చేసుకోవచ్చో లేదో తెలియదు. గతంలో ఎన్నోసార్లు చెప్పినట్లు ఈ పోస్ట్ ను కూడా తొలగించమని వారు నన్ను అడగరని భావిస్తున్నా. కానీ రణబాలి టీమ్ మాత్రం ఒక అద్భుతాన్ని క్రియేట్ చేస్తున్నారు. ఆ ప్రపంచాన్ని తెరపై చూసేందుకు ఆత్రుతగా వేచి చూస్తున్నా. అని అన్నారు. రణబాలి చిత్రంలో రష్మిక జయమ్మ అనే పాత్రలో రణబాలికి జోడీగా కనిపించబోతున్నారు.

# 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' టీజర్ లాంచ్



ఫహాద్ ఫాజిల్ హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్స్‌పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ నిర్మించిన చిత్రం డోంట్ ట్రబుల్ ది ట్రబుల్. శశాంక్ యేలేటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీని సెప్టెంబర్ 11న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను సోమవారం నాడు రిలీజ్ చేశారు. ఎస్.ఎస్ కార్తికేయ మాట్లాడుతూ.. .. ఫహాద్ ఫాజిల్‌తో సినిమా నిర్మిస్తుండటం ఆనందంగా ఉంది. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' టీజర్ చూసే ఉంటారు. అందరికీ నచ్చే ఉంటుంది. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' మనసుకు హత్తుకునే చిత్రం. ఇకపై నుంచి రాబోయే కంటెంట్‌ని చూస్తే ఆ విషయం మీకే అర్థం అవుతుందినిర్మాత శోభు యార్లగడ్డ మాట్లాడుతూ.. .. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' అంటూ ఫహాద్ ఫాజిల్ గారితో సినిమా చేయడం మాకెంతో ఎగ్జైటింగ్‌గా ఉంది. చాలా రోజుల తర్వాత మళ్లీ ఓ మూవీని ఆడియెన్స్ ముందుకు తీసుకు వస్తున్నాం. మా మూవీ టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని ఆశిస్తున్నాను. అందరూ చూసి ఎంజాయ్ చేసేలా మా చిత్రం ఉంటుంది. ఆడియో బైట్ ద్వారా ఫహాద్ ఫాజిల్ మాట్లాడుతూ.. .. తెలుగులో ఒక స్ట్రెయిట్ సినిమా చేయాలని నేను ఎప్పటి నుంచో అనుకుంటూ ఉన్నాను. ఒక మంచి స్క్రిప్ట్ కోసం వెయిట్ చేస్తూ ఉన్నాను. శశాంక్ చెప్పిన కథ నాకు ఎంతో నచ్చింది. ఇలాంటి మంచి ఫ్యాంటసీ డ్రామా ఎలిమెంట్స్ ఉన్న సినిమా చేయడం ఆనందంగా ఉంది అని అన్నారు. దర్శకుడు శశాంక్ యేలేటి మాట్లాడుతూ.. .. డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ కాన్సెప్ట్ కొత్తగా ఉంటుంది. ప్రేక్షకుల్ని ఎంటర్టైన్ చేసేలా మా సినిమా ఉంటుంది. సంగీత దర్శకుడు కాల భైరవ మాట్లాడుతూ.. ..డోంట్ ట్రబుల్ ది ట్రబుల్‌షూటింగ్ టైంలో మేం ఎక్కడా ట్రబుల్ అవ్వలేదు. ఇదొక మ్యాజికల్ వరల్డ్. మా టీజర్ ఎంత బాగుంటుందో.. సినిమా కూడా అంతే స్థాయిలో బాగుంటుంది. .చైల్డ్ ఆర్టిస్ట్ సారా మాట్లాడుతూ.. .డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ చిత్రంలో నేను దివ్య అనే పాత్రను పోషించాను. శశాంక్ గారు అద్భుతమైన దర్శకులు. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన శోభు సార్, ప్రసాద్ సార్, కార్తికేయ సర్‌లకు థాంక్స్. ఫహాద్‌తో వర్క్ చేయడం ఆనందంగా ఉంది.

# 'లెనిన్' విజయం ఆనందాన్ని ఇచ్చింది : భాగ్యశ్రీ బోర్సే



**'లెనిన్' విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు?**

ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ సినిమా గురించి, నా నటన గురించి ఎంతో మంచి మెసేజ్‌లు పంపుతున్నారు. ఈ విజయం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది.

**ఈ సినిమా విషయంలో మీరు చాలా ఎమోషనల్ అయ్యారు. మీకు ఇందులో అంతగా నచ్చిన అంశం ఏమిటి?**

ప్రతి సినిమాను ఎంతో ఇష్టంతోనే చేస్తాం. ప్రతి సినిమా మాకు ప్రత్యేకమే.'లెనిన్' విషయంలో ఒక మంచి కథ దొరికింది. మేమంతా ఈ సినిమాను బలంగా నమ్మాం. మా నమ్మకం నిజం కావడంతో ఈ విజయం మరింత భావోద్వేగంగా అనిపించింది.

**హైదరాబాద్ మీకు ఎందుకు అంత ప్రత్యేకం?**

తెలుగు సినిమా నాకు నటిగా అవకాశం ఇచ్చింది. నా తొలి సినిమా ప్రయాణం హైదరాబాద్ నుంచే ప్రారంభమైంది. తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతో ప్రేమగా ఆదరించారు. తెలుగు అమ్మాయిలాగే నన్ను చూసుకుంటున్నారు. అందుకే హైదరాబాద్, తెలుగు సినిమా పరిశ్రమ నాకు ఎంతో ప్రత్యేకం. ఈ అనుబంధం జీవితాంతం కొనసాగాలని కోరుకుంటున్నాను.

**ఈ సినిమా చూసిన తర్వాత మీ అమ్మానాన్నల స్పందన ఎలా ఉంది?**

అమ్మగారు నాకు ఫోన్ చేశారు. తనకు సినిమా చాలా నచ్చింది. నా నటన కూడా ఎంతో బాగా అనిపించిందన్నారు. అయితే నా పాత్ర ముగింపు చూసి ఒక తల్లిగా చాలా ఎమోషనల్ అయ్యారు.

**అఖిల్ తో వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?**

ఇది లెనిన్‌భారతి ప్రేమకథ. అందుకే మా ఇద్దరి పాత్రలు తెరపై చాలా సహజంగా కనిపించేలా ప్రతి సన్నివేశంపై ఎంతో శ్రద్ధ పెట్టి పనిచేశాం. అఖిల్ చాలా అద్భుతమైన డ్యాన్సర్, పెర్ఫార్మర్. ఈ సినిమాలో ఆయన నటన అద్భుతం.

**నాగార్జున మీకు ఏమైనా సలహాలు ఇచ్చారా?**

మొదటి నుంచే నాగార్జున గారికి ఈ సినిమాపై పూర్తి నమ్మకం ఉంది. ఆయన ప్రోత్సాహం ఎప్పుడూ మా వెంటే ఉంది.



# 'రూ.100 కోట్ల క్లబ్‌లోకి మా ఇంటి బంగారం'

. రీసెంట్‌గా సమంత ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ ఫ్యామిలీ డ్రామా"మా ఇంటి బంగారం" రిలీజై సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద అధికారికంగా రూ.100 కోట్ల మార్క్‌ను దాటి.. భారతీయ సినిమా చరిత్రలోనే రూపొందిన మహిళా ప్రధాన చిత్రాల్లో అతిపెద్ద కమర్షియల్ విజయాల్లో ఒకటిగా తన స్థానాన్ని మరింత బలపరచుకుంది. ఈ చిత్రం తన బడ్జెట్‌పై 300 శాతం పైగా రికవరీ సాధించడం విశేషం. మా ఇంటి బంగారం చిత్రానికి రాజ్ కె నిడిమోరు ఆలోచన ప్రధాన బలం. ఆయన డైరెక్టర్ బీవీ నందిని రెడ్డితో కలిసి ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. రాజ్, సమంత, హిమాంక్ రెడ్డి దువ్వూరు కలిసి స్థ త్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా 2026 జూన్ 19న తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదలైంది. తమిళంలో ఎంగళ్ తంగం పేరుతో రిలీజైంది. గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి, ఆనంద్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు.ఈ చిత్రం ఓ సెన్సేషన్ క్రియేట్ చేసింది. అరుదైన రీతిలో అన్ని వయస్సుల మహిళలు, ప్రేక్షకులు థియేటర్లకు తరలివచ్చి ఈ సినిమాను బ్లాక్ బస్టర్ చేశారు. సమంత నటనతో పాటు, పర్ఫెక్ట్‌గా సెట్ అయిన నటీనటుల, సాంకేతిక నిపుణుల పనితీరుపై ఆడియెన్స్ ప్రశంసలు కురిపించారు. ఇది మాకు కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు!" అని సమంత అన్నారు."మా ఇంటి బంగారం సినిమా ద్వారా భాషతో సంబంధం లేకుండా, పూర్తిగా మహిళా ప్రధానంగా నడిచే కథలను ప్రేక్షకులు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారని మరోసారి ప్రూవ్ అయ్యింది" మా ఇంటి బంగారం సినిమా ఇక్కడే కాకుండా ఓవర్సీస్‌లోనూ సక్సెస్‌ఫుల్‌గా థియేట్రికల్ రన్‌ను కొనసాగిస్తోంది.

# 'ఇడుపు కాయితం' డిసెంబర్ ఫస్ట్ వీక్‌లో రిలీజ్




ప్రముఖ యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా "ఇడుపు కాయితం" సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా లాంఛనంగా పూజా కార్యక్రమాలు జరుపుకుంది."ఇడుపు కాయితం" సినిమా టైటిల్ నేపథ్యంగా సాగిన చర్చ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. టైటిల్ తోనే ఈ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. అతి తక్కువ టైమ్ లో మరే చిత్రానికీ లేనంతగా ఈ సినిమా వార్తల్లో నిలిచింది. దీంతో ప్రేక్షకుల దృష్టిని ఈ సినిమా బాగా ఆకర్షిస్తోంది. సినిమా పూజా కార్యక్రమాల సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. "ఇడుపు కాయితం" త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకోనుంది. ఈ సినిమాను డిసెంబర్ ఫస్ట్ వీక్ లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ మూవీకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో దర్శక నిర్మాతలు షేర్ చేసుకోనున్నారు.

# 'శ్రీనివాస మంగాపురం' ట్రైలర్ లాంచ్



అశ్విని దత్ సమర్పణలో, పి. కిరణ్ చందమామ కథలు బ్యానర్ నిర్మాణంలో జై కృష్ణ ఘట్టమనేని, రాషా తడాని, అజయ్ భూపతి 'శ్రీనివాస మంగాపురం' లవ్, ఇంటెన్స్ ఎమోషన్స్, పవర్ ఫుల్ యాక్షన్ థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని శ్రీనివాస మంగాపురం చిత్రంతో హీరోగా ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నారు. ప్రముఖ దర్శకుడు అజయ్ భూపతి ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా థడాని ఈ చిత్రంతో కథా నాయికగా తెలుగు చిత్ర సీమలోకి అరంగేట్రం చేస్తోంది. సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నారు. శ్రీనివాస మంగాపురం ట్రైలర్ ప్రేమ, యాక్షన్, భావోద్వే గాలతో ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంపై ట్రైలర్ మరింత ఆసక్తిని పెంచింది. విజయవాడలో గ్రాండ్‌గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో జై కృష్ణ మాట్లాడుతూ...మా తాతగారు సూపర్ స్టార్ కృష్ణ లేకపోతే నేను ఈ రోజు ఇక్కడ ఉండేవాడిని కాదు. ఆయన నాకు దేవుడితో సమానం. అలాగే మా బాబాయ్ మహేష్ బాబు కూడా నాకు ఎంతో సపోర్ట్ చేశారు. థాంక్ యూ బాబాయ్. హీరోయిన్ రాషా తడానీ మాట్లాడుతూ... . తెలుగు సినిమా లో తొలిసారి నటించడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు అజయ్ భూపతి గారికి, నిర్మాత కిరణ్‌కి ధన్యవాదాలు. నా కోస్టార్ జై కృష్ణ ఎంతో సహకరించారు. దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ... . జై కృష్ణను చూస్తే తొలి సినిమా చేస్తున్న హీరోలా అనిపించదు. 'శ్రీనివాస మంగాపురం' ట్రైలర్‌ను విజయవాడలో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. ఘట్టమనేని ఆది శేషగిరిరావు మాట్లాడుతూ... కృష్ణకి, మహేష్ బాబుకి విజయవాడలో ఎంత అభిమానం ఉందో అందరికీ తెలుసు. మా కుటుంబానికి అప్సర థియేటర్‌తో ఐదు దశాబ్దాల అనుబంధం ఉంది.




# సెమీస్‌లో సూపర్ పవర్స్ సమరం

*ప్రపంచాన్ని ఊపేస్తున్న సాకర్ వరల్డ్‌కప్ చివరి స్టేజ్‌కు చేరుకుంది. ఇపుడు ఫుట్‌బాల్ ప్రపంచం చూపంతా సెమీస్‌పైనే.. నాలుగు దిగ్గజాల మధ్య పోరు ఆసక్తి రేపుతోంది. డిపెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాతో పాటు రన్నరప్ ఫ్రాన్స్, యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, ఇంగ్లాండ్ జట్లు సెమీస్‌కు వచ్చాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత విజయవంతమైన, బలమైన జట్లుగా పేరుగాంచిన ఈ నాలుగు దేశాలు ఒకే టోర్నీలో చివరి నాలుగులో నిలవడం అభిమానుల్లో ఉత్కంఠను పెంచింది.*

**(వార్త క్రీడా విభాగం)**

ఫిఫా ప్రపంచకప్‌లో ఈసారి గ్రూప్ దశలో 48 జట్లు పోటీపడ్డాయి. రౌండ్ ఆఫ్ 32, ప్రిక్వార్టర్స్, క్వార్టర్ ఫైనల్స్‌లో వడపోత తర్వాత నాలుగు జట్లు మిగిలాయి. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో అర్జెంటీనా దర్జాగా సెమీస్‌లో అడుగుపెట్టగా, 2022 ఫిఫా రన్నరప్ ఫ్రాన్స్ కూడా వరుసగా మూడోసారి (2018, 2022, 2026) సెమీస్‌కు దూసుకొచ్చింది. ఇక 16 ఏళ్ల తర్వాత స్పెయిన్ (2010 విజేత) సెమీస్‌లో అడుగుపెడితే, అటు మాజీ చాంపియన్ ఇంగ్లాండ్ కూడా తన దూకుడైన ఆటతీరుతో సెమీస్‌లో అడుగుపెట్టింది. ఇప్పటి దాకా తమకు ఎదురైన ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ వచ్చిన ఈ నాలుగు జట్లు నువ్వా నేనా అన్న రీతిలో సెమీస్‌లో తలపడనున్నాయి.

### ఫ్రాన్స్ వర్సెస్ స్పెయిన్

మొదటి సెమీఫైనల్లో ఫ్రాన్స్-స్పెయిన్ తలపడనున్నాయి. యువ స్టార్ లామిన్ యమాల్ నాయకత్వంలో దూసుకెళ్తున్న స్పెయిన్, కిలియన్ ఎంబాపె నేతృత్వంలోని ఫ్రాన్స్‌కు గట్టి సవాల్ విసరనుంది. రెండు జట్లూ దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థులను ఓడిస్తూ సెమీస్‌కు చేరుకున్నాయి. ఎంబాపె అన్నీ తానై ఫ్రాన్స్‌ను నడిపిస్తున్నాడు. ఈసారి ఫిఫాలో ఆడిన 6 మ్యాచ్‌ల్లో 8 గోల్స్, మూడు అసిస్ట్‌లతో గోల్డెన్ బూట్ రేసులో నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. ఎంబాపె తర్వాత ఒస్మెన్ డెంబ్లీ కూడా ఫ్రాన్స్‌కు బలమైన ఆటగాడు. ఫార్వార్డ్ ప్లేయర్ అయిన డెంబ్లీ ఆరు మ్యాచ్‌ల్లో ఐదు గోల్స్, రెండుఅసిస్ట్‌లతో గోల్డెన్ బూట్ రేసులో ఉన్నాడు. ఇక స్పెయిన్ తరఫున కెప్టెన్ రొడ్రితో పాటు యామినే లమాల్ కీలక ఆటగాళ్లుగా ఉన్నారు. వీరిద్దరితో పాటు మైకెల్ ఒయర్‌జబాల్ (ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు గోల్స్), గోల్ కీపర్ ఉనైయి సిమోన్‌లు కూడా తమదైన ఆటతో ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.

### అర్జెంటీనా వర్సెస్ ఇంగ్లాండ్

మరో సెమీఫైనల్లో ఇంగ్లాండ్-అర్జెంటీనా మధ్య భారీ పోరు జరగనుంది. కెప్టెన్ లియోనెల్ మెస్సీకి ఇది అత్యంత కీలక మ్యాచ్‌గా మారగా, హ్యారీ కేన్ సారథ్యంలో ఇంగ్లాండ్ తమ తొలి ప్రపంచకప్ లక్ష్యాన్ని సాధించాలని పట్టుదలగా ఉంది. ఈ మ్యాచ్ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను ఆకట్టుకునే అవకాశం ఉంది.

ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ హ్యారీకేన్ ఈసారి ఎలాగైనా ఫిఫా ప్రపంచకప్ సాధించాలనే పట్టుదలతో ఉన్నాడు.ఆరు మ్యాచ్‌ల్లో ఆరు గోల్స్‌తో పాటు ఒక అసిస్ట్ చేసి ఆ జట్టు తరఫున గోల్డెన్ బూట్ రేసులో ఉన్నాడు. హ్యారికేన్‌కు తోడుగా జూడ్ బెల్లింగ్‌హామ్ కూడా కీలక ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. బెల్లింగ్‌హామ్ కూడా ఆరు గోల్స్ చేసి హ్యారికేన్‌తో సమానంగా ఉన్నాడు. ఇక డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాకు కర్త, కర్మ, క్రియ.. లియోనల్ మెస్సీ. మెస్సీ ఆరు మ్యాచ్‌ల్లో 8 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో రెండో స్థానంలో ఉన్నాడు. మెస్సీతో పాటు ఎమిలో మార్టినేజ్, జులియన్ అల్వరెజ్, అలెక్సిస్ మాక్ అలిస్టర్‌లు అర్జెంటీనా జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఇరు సెమీఫైనల్ విజేతలు జూలై 19న జరిగే ఫైనల్లో తలపడ తాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌కు కొత్త ఛాంపియన్ ఎవరో తేలే ముందు జరిగే ఈ రెండు సెమీస్ ఫైట్స్ అభిమానులకు అసలైన ఫుట్‌బాల్ పండుగగా నిలవనున్నాయి. గత ఫిఫా ప్రపంచకప్ లాగే ఈసారి ఫైనల్లో అర్జెంటీనా, ఫ్రాన్స్ పోరును చూస్తామా లేక స్పెయిన్, ఇంగ్లండ్ ఆట చూస్తామా అనేది మరో రెండు రోజుల్లో తేలిపోనుంది. మొత్తానికి సెమీస్‌లో ఫుట్‌బాల్ దిగ్గజాల సమరం సర్వత్రా ఆసక్తి రేపుతోంది.



## భారత్ అమ్మాయిల చారిత్రక టెస్ట్ విజయం

**లండన్, జులై 13:** లార్డ్స్ టెస్ట్‌లో భారత అమ్మాయిలు అద్భుతం చేశారు. చారిత్రక టెస్ట్‌లో 270 పరుగులతో ఇంగ్లాండ్‌పై ఘనవిజయం అందుకున్నారు. మూడో రోజే విజయం ఖాయ మైనా... నాలుగో రోజు తొలి సెషన్‌లో మిగతా నాలుగు వికెట్లు కూల్చి టీమిండియా గెలుపును ఖాతాలో వేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు ఆరు వికెట్లకు 130రన్స్ నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్‌ను లంచ్ లోపే భారత బౌలర్లు కుప్పకూల్చారు. 52 పరుగులకు మరో రెండు పరుగులు జోడించిన అమీ జోన్స్(80 బంతుల్లో 54)ను స్నేహ రాణా అవుట్ చేసి నాలుగో రోజు వికెట్ల పతనానికి నాంది పలికింది. ఆతర్వాత ఇస్సీ వాంగ్(1), లూరెన్ బెల్(0)లను వెంటవెంటనే దీప్తి శర్మ అవుట్ చేసింది. మరో ఎండ్‌లో సోఫీ ఎస్సెల్‌స్టోన్(66 బంతుల్లో 50రన్స్) ధాటిగా ఆడుతూ కాసేపు భారత బౌలర్లను సమ ర్థవంతంగా ఎదుర్కొంది. చివరికి అర్థసెంచరీ చేసిన ఎస్సెల్‌స్టోన్‌ను స్నేహ రాణా క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ 186 పరుగుల వద్ద ముగిసింది.

## భారత్, ఇంగ్లాండ్ తొలి వన్డే

### నేటి మధ్యాహ్నం 3.30 గంటలకు

**బర్మింగ్‌హామ్, జులై 13:** టీ20 సిరీస్ ఓడిన టీమిండియా... ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు సిద్ధమైంది. నేడు ఇరు జట్ల మధ్య తొలి వన్డేబర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనుంది.భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా.. 50 ఓవర్ల ఫార్మాట్‌లో సత్తా చాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై భారీ అంచనాలు ఉన్నాయి. వీరిద్దరితో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చేరిక భారత్ బ్యాటింగ్‌ను పటిష్టం చేసింది. టాప్ ఆర్డర్ బలంగా మారింది.ఆర్చర్, బ్రైడన్ కార్స్ వంటి పేసర్లు భారత బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు. జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టు లో చేరడం భారత బౌలింగ్‌ను పటిష్టం చేయ నుంది.గాయపడ్డ హర్షిత్ స్థానంలో ప్రిన్స్‌కు అవకాశం లభించింది. ఇంగ్లండ్ జట్టులో జో రూట్ పునరాగమనం చేయనున్నాడు. బెన్ డకెట్, జేకబ్ బెతెల్ ఆరంభంలో వేగంగా పరుగులు సాధించగలరు. టీ20 సిరీస్‌లో పరుగుల వరద పారిం చిన కెప్టెన్ హారీ బ్రూక్స్, జోస్ బట్లర్ జోడీ మధ్య ఓవర్లలో జట్టుకు కీలకం కానుంది.

## భారత్ బాక్సర్ల పంచ్‌కు15 మెడల్స్

**జకార్తా, జులై 13:** ఇండోనేషియా రాజధాని జకార్తాలో జరుగుతున్న ఆసియా అండర్-19, అండర్-23 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు పవర్ పంచ్‌లతో విరుచుకుపడుతున్నారు.అద్భుత ప్రదర్శనతో 15మెడల్స్ ఖాయం చేశారు. అండర్-23 పురుషులు,మహిళల విభాగాల్లో మొత్తం ఎనిమిది మంది బాక్సర్లు ఫైనల్‌కు చేరుకున్నారు.మరో ఏడుగురు సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు ఖాయం చేసుకున్నారు. మహిళల అండర్-23 విభాగంలో నిషా (54 కేజీలు) దక్షిణ కొరియాకు చెందిన హ్యాజూ లీపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. నికితా చంద్ (60 కేజీలు) జపాన్‌కు చెందిన సారీ కొకుపును ఓడించగా.. కాజల్ (65 కేజీలు) కిర్గిజ్‌స్తాన్‌కు చెందిన గుల్జినా మెల్స్‌వెక్‌పై ఏకపక్ష విజయం సాధించింది. ముస్కాన్ (75 కేజీలు) ఉజ్బె కిస్థాన్‌కు చెందిన టోయిరోవా ఓయ్షాపై 5-0 తేడాతో గెలవగా, ప్రియాంక (80 కేజీలు) కజకిస్థాన్‌కు చెందిన పనార్ సెయిట్‌ఖాంకిజీపై 5-0 స్కోరుతోనే విజయం సాధించింది.

ఇక పురుషుల అండర్-23 విభాగంలో విశ్వ నాథ్ సురేశ్ (50 కేజీలు) ఫిలిప్పీన్స్ ప్రత్యర్థిని 5-0తో చిత్తు చేశాడు. గంగా(55 కేజీలు) జపాన్ బాక్సర్‌పై 3-2 స్ప్లిట్ డెసిషన్‌తో గెలిచి ఫైనల్‌కు చేరాడు. వంశజ్ (65 కేజీలు) కిర్గిజ్‌స్తాన్ ప్రత్య ర్థిపై 4-1 తేడాతో విజయం సాధించి బంగారు పతక పోరుకు అర్హత సాధించాడు. మహిళల అండర్-23 విభాగంలో తను (51 కేజీలు), ప్రాచి (57 కేజీలు), శివాని (70 కేజీ లు), నైనా (80 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో హితేష్ (70 కేజీలు), నీరజ్ (75 కేజీలు), ఇషాన్ కటారియా (90 కేజీలు) సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.




**ముంబయి,జులై 13:** తొలి త్రైమాసిక ఫలితాల సీజన్ నేపథ్యంలో కంపెనీ లకు సంబంధించిన వార్తలపైనే ఇన్వెస్టర్ల ఫోకస్ నిలవడంతో సోమవారం దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి.ప్రారంభంలో నష్టాల్లో ట్రేడైన సూచీలు చివరికి కోలుకుని స్వల్పంగా పెరిగాయి. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి.నిఫ్టీ ఐటీ సూచీ 3.59శాతం ఎగసిపడగా, టీసీఎస్ 5.51 శాతం లాభపడటం ఈ రంగానికి ఊతమిచ్చింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు కూడా పెరిగాయి. ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ 47.04 పాయింట్లు పెరిగి 77,616.40 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 4.10 పాయింట్లు లాభపడి 24,211 వద్ద స్థిర పడింది. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.90, భారతి ఎయిర్‌టెల్ 0.87, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.83 ప్రధానంగా సూచీలపై ఒత్తిడి తెచ్చిన షేర్లుగా నిలిచాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.02 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,335 షేర్లు లాభపడగా, 2,068 షేర్లు నష్టపోయాయి. 201 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. విదేశీ మారకద్రవ్య మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే బలహీనపడింది. రూపాయి విలువ గత ముగింపు 95.3800తో పోలిస్తే 95.6700 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5,2026 నాటి పసిడి సెటిల్ మెంట్‌ధర 0.94 శాతం తగ్గి రూ.1,42,133 వద్దకు చేరింది. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ఆయిల్‌ధర బ్యారెల్‌కు 2.33 డాలర్లు పెరిగి 78.34 డాలర్లకు చేరింది. ఐటీ షేర్లలో భారీ ర్యాలీనిఫ్టీ ఐటీ సూచీ 3.59 శాతం పెరిగి 29,015.85 వద్ద ముగిసింది.వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో ఈ సూచీ మొత్తం 5.62 శాతం లాభపడింది.

## ఒక్కనెలలో భారత్ ఎగుమతులు

# 40.41 బిలియన్ డాలర్లు



**న్యూఢిల్లీ, జులై 13:**భారత్ ఎగుమతులు జూన్ నెలలో వార్షిక ప్రాతిపదికన 15.5 శాతం పెరిగి 40.41 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ముడి చమురు, ఎలక్ట్రానిక్ వస్తువులు, యంత్రాలు, విలువైన ఖనిజాల దిగుమతులు గణనీయంగా పెరగడంతో దేశ వాణిజ్య లోటు 30.43 బిలియన్ డాలర్లకు పెరిగింది.వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాణిజ్య గణాంకాలను వెల్లడిస్తూ, జూన్ నెలలో దిగుమతులు సుమారు 31శాతం పెరిగి 70.84 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని దీంతో వాణిజ్య లోటు 30.43 బిలియన్ డాలర్లుగా నమోదైందన్నారు. పశ్చిమాసియా దేశాలకు భారత్ ఎగుమతులు కూడా జూన్ నెలలో 7.29 శాతం పెరిగి సుమారు 5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వస్తు,సేవల కలిపిన మొత్తం ఎగుమతులు 11.37శాతం వృద్ధితో 232.73 బిలియన్ డాలర్లకు చేరుకు న్నాయి. గతఏడాది ఇదే కాలంలో ఈ విలువ 208.98 బిలియన్ డాలర్లుగా ఉంది.తొలి త్రైమాసికంలో ఎగుమతులు 15.92శాతం పెరిగి 129.32 బిలి యన్ డాలర్లకు చేరుకోగా, గత ఏడాది ఇదే కాలంలో అవి 111.57 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. నాన్‌పెట్రోలియం ఎగుమతులు కూడా బలమైన వృద్ధి ని నమోదు చేశాయి. ఏప్రిల్‌జూన్ కాలంలో ఇవి 12.44 శాతం పెరిగి 106.30 బిలియన్ డాలర్లకు చేరగా, గత ఏడాది ఇదే కాలంలో 94.54 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు జూన్‌లో20.74శాతం పెరిగి 11.48బిలియన్ డాలర్లకు చేరాయి.గత ఏడాది ఇదే నెలలో ఇవి 9.51 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు 18.93శాతం పెరిగి 4.93బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.


కార్మిక రాజ్య బీమా సంస్థ
Employees' State Insurance Corporation

"కార్మికులందరికి ఉదారమైన మరియు సమగ్ర సామాజిక భద్రత వ్యవస్థను అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది."
నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి



దేశవ్యాప్తంగా
శ్రమ జీవుల ఆరోగ్య సంరక్షణను
దృఢంగా తీర్చిదిద్దడం

ప్రారంభోత్సవం

నూతన ఓపిడి బ్లాక్, ఈఎస్ఐసి ఆస్పత్రి, సనత్‌నగర్, తెలంగాణ
మరియు
వర్చువల్ ప్రారంభోత్సవాలు

100 పడకల ఈఎస్ఐసి ఆస్పత్రి, శ్రీపెరుంబుదుర్, తమిళనాడు
100 పడకల ఈఎస్ఐఎస్ ఆస్పత్రి, రాజమహేంద్రవరం, ఆంధ్రప్రదేశ్
అప్‌గ్రేడ్ చేయబడిన 200 పడకల ఈఎస్ఐసి ఆస్పత్రి, బెల్టోల, గువహతి, అస్సాం
ఈఎస్ఐ డిస్పెన్సరీ మరియు బ్రాంచి ఆఫీస్, కోట, రాజస్థాన్
ఈఎస్ఐ డిస్పెన్సరీ, భవానిమండి, రాజస్థాన్
ఈఎస్ఐ డిస్పెన్సరీ మరియు బ్రాంచి ఆఫీస్, సురెంద్రనగర్, గుజరాత్

ప్రారంభించువారు
డా. మన్సుఖ్ మాండవియా
కార్మిక మరియు ఉపాధి మరియు యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రివర్యులు, భారత ప్రభుత్వం
మంగళవారం, జులై 14, 2026 I ఈఎస్ఐసి ఆస్పత్రి, సనత్‌నగర్, తెలంగాణ

ప్రాజెక్ట్ లాభాలు
దాదాపు 53 లక్షల లబ్ధిదారులకు లాభం
గరిష్ట పరిమితి లేకుండ నగదురహితమైన వైద్య సదుపాయం
గృహాల సమీపంలోనే నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ
అధునాతన వైద్య పరికరాలతో
ఆరోగ్య సంరక్షణ
ఈఎస్ఐ డిస్పెన్సరీ మరియు బ్రాంచి ఆఫీస్‌లో ఒకే గొడుగు కింద నగదు లాభాలు మరియు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ




మరింత సమాచారం కోసం సందర్శించండి: https://www.esic.gov.in/
లేదా ఫోన్ చేయవలసిన టోల్-ఫ్రీ నంబర్ 1800-11-2526
కార్యక్రమం ప్రత్యక్షంగా వీక్షించేందుకు స్కాన్ క్యూఆర్ కోడ్


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.